PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 305 | విజయవాడ, మంగళవారం 6 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 6 June 2023 | Rs

ఉద్యమం ఆగదు.. కొనసాగుతుంది

- హోంమంత్రి అమిత్ షా నుంచి హామీ రాలేదు
- రెజ్లర్ సాక్షి మాలిక్

7

వడదెబ్బకు ముగ్గురు మృతి

వెంకటేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి-యంత్రాంగం

వడదెబ్బ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం ముగ్గురు మృతి చెందారు. వారిలో నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు, కృష్ణా జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన బొమ్ము వెంకటేశ్వరరావు (47) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో తనతోపాటు ఉన్న మరో గొర్రెల కాపరికి భోజనం క్యారెజీ ఇచ్చేందుకు పొలానికి వెళ్లారు. వడగాల్పుల ధాటికి ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెంది ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నెల్లూరు గుడ్లూరు పట్టణంలోని గంధర్వ కాలనీకి చెందిన జె.రామయ్య (85), చిమిడిదబాడుకు చెందిన మొగిలిశెట్టి రావమ్మ (85) వృద్ధాప్యం కారణంగా ఎండ వేడికి తట్టుకోలేక అస్వస్థతకు గురై మృతి చెందారు.

అగ్రస్థానంలో ఐఐటి మద్రాస్

- విద్యాసంస్థల ర్యాంకింగ్స్ విడుదల
- వర్సిటీల విభాగంలో ఏయుకు 43వ స్థానం

టాప్ 10 విద్యా సంస్థలు (ఓవరాల్)

ఐఐటి మద్రాస్	1	ఎయిమ్స్ ఢిల్లీ	6
ఐఐఎస్‌సి బెంగళూరు	2	ఐఐటి ఖరగ్‌పూర్	7
ఐఐటి ఢిల్లీ	3	ఐఐటి రూర్కే	8
ఐఐటి ముంబయి	4	ఐఐటి గౌహతి	9
ఐఐటి కాన్పూర్	5	జెఎన్‌యు ఢిల్లీ	10

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో, ఎంవిపి కాలనీ

దేశంలో అత్యుత్తమ ఉన్నత విద్యాసంస్థల జాబితాలో ఐఐటి మద్రాస్ అగ్రస్థానంలో నిలిచింది. వరుసగా ఐదో సంవత్సరం ఐఐటి మద్రాస్ మొదటి స్థానాన్ని నిలబెట్టుకోగా, రెండు, మూడు స్థానాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) బెంగళూరు, ఐఐటి-ఢిల్లీ దక్కించుకున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) కింద కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ రూపొందించిన ఇండియన్ ర్యాంకింగ్స్ రిపోర్టు-2023ను కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ సోమవారం విడుదల చేశారు.

తెలంగాణలో 4, ఎపిలో 2

పద్నాల్గవ ర్యాంకులో ఐఐటి హైదరాబాద్, 20వ ర్యాంకులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, 53వ ర్యాంకులో ఎన్‌ఐటి వరంగల్, 64వ ర్యాంకులో ఉస్మానియా యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కెఎల్ యూనివర్సిటీ 50, ఆంధ్రా యూనివర్సిటీ 74వ ర్యాంకులో నిలిచాయి.

టాప్ యూనివర్సిటీలు

బెంగళూరులోని ఐఐఎస్‌సి ఉత్తమ యూనివర్సిటీగా నిలిచింది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. జాదవ్‌పూర్ యూనివర్సిటీ, బనారస్ హిందూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు) పదో స్థానంతో సరిపెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కెఎల్ యూనివర్సిటీకి 28, ఆంధ్రా యూనివర్సిటీకి 43, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి 60, విజ్ఞాన యూనివర్సిటీకి 75వ ర్యాంకు వచ్చింది. తెలంగాణ లో ఉస్మానియా యూనివర్సిటీకి 36, ట్రిపుల్ ఐటి, హైదారాబాద్‌కు 84వ ర్యాంకులు వచ్చాయి.

అగ్రశ్రేణి ఇంజినీరింగ్ సంస్థలు

ఇంజినీరింగ్ విభాగంలో మొదటి స్థానాన్ని ఐఐటి (మద్రాస్) కైవసం చేసుకుంది. ఐఐటి ఢిల్లీ, ఐఐటి ముంబయి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 8వ స్థానంలో ఐఐటి (హైదరాబాద్), 21వ స్థానంలో ఎన్‌ఐటి (వరంగల్), 55వ ర్యాంకులో ట్రిపుల్ ఐటి (హైదరాబాద్), 71వ ర్యాంకులో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, 83వ ర్యాంకులో జెఎన్‌టియు హైదరాబాద్, 98వ ర్యాంకులో ఎస్‌ఆర్ యూనివర్సిటీ (వరంగల్) నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో కెఎల్ యూనివర్సిటీ 44, ఐఐటి, తిరుపతి 59, విజ్ఞాన్ యూనివర్సిటీ 85, ఎయు ఇంజినీరింగ్ కాలేజ్ 94వ ర్యాంకులో నిలిచాయి.

టాప్ మేనేజ్‌మెంట్ సంస్థలు

మేనేజ్‌మెంట్ విభాగంలో ఐఐఎం అహ్మదాబాద్ తొలి స్థానంలో నిలవగా, ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కొజికోడ్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మెడికల్ విభాగంలో ఎయిమ్స్ ఢిల్లీ, మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (చండీగఢ్), క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ (వెల్లూర్) మొదటి మిగతా 7లో

ఫిబ్రవరి నాటికి విశాఖ ఎంఒయుల పనులు

- పారిశ్రామిక రంగ ప్రగతిలో ఎంఎస్‌ఎంఇలదే కీలకపాత్ర : సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో మార్చిలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలన్నీ 2024 ఫిబ్రవరి నాటికి పనులు ప్రారంభించేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఒప్పందాల అమలుపై సిఎం తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. పారిశ్రామిక రంగ ప్రగతిలో ఎంఎస్‌ఎంఇలది కీలక పాత్ర అని జగన్ అన్నారు. ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు కూడా ఈ రంగంలోనే ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉన్న ఉత్పత్తులు ఏమిటి, వాటి ఉత్పత్తిని సాధించడానికి ఎంఎస్‌ఎంఇలకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తయిన వస్తువులకు అంతర్జాతీయంగా ప్రముఖ బహుళజాతి సంస్థలతో అనుసంధానం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఎంఎస్‌ఎంఇలకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందేలా చూడాలని, దీనిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖలో ఎంఎస్‌ఎంఇల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి కార్యదర్శిని కూడా నియమించాలన్నారు. రాష్ట్రం నుంచి బహుళ ఉత్పత్తులు, బహుళ దేశాలకు ఎగుమతులు లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. మరోవైపు నైపుణ్యాలను పెంచడంపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రస్తుత డిగ్రీలకు తోడు అదనంగా ప్రత్యేక నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఐటి, ఐటి ఆధారిత సేవల రంగాలకు విశాఖ హబ్ కావాలని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, పశు సంవర్ధకశాఖ, టూరిజం రంగాల్లోని ఒప్పందాలపై సిఎం సమీక్ష నిర్వహించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడి ప్రతిపాదనలను వీలైనంత త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలన్నారు. టమోటా, ఉల్లివంటి పంటల డిమాండులో తీవ్ర వ్యత్యాసం తరచూ ఉంటుందన్నారు. ఇలాంటి పంటల విషయంలో ఈ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే పనులను వేగవంతం చేయాలన్నారు. దీనివల్ల రైతులకు తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- 2014 జూన్ 2కి ఐదేళ్ల సర్వీసున్న వారికే
- త్వరలో 12వ పిఆర్‌సి కమిషన్ నియామకం
- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం అనంతరం మంత్రి బొత్స ప్రకటన

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఉద్యోగ సంఘాల నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2014 జూన్ 2కి ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించి డిపార్టుమెంట్ల వారీ గైడ్‌లైన్స్ ఇచ్చి, జనవరిలోపు ఉత్తర్వులు ఇవ్వాలని సచివాలయంలో సోమవారం జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. సమావేశ నిర్ణయాలను మంత్రి బొత్స మీడియాకు వివరించారు. పిఆర్‌సి ఎరియర్స్, డిఎ బకాయిలు జనవరి 2024 నుంచి 2028 వరకు ఏడాదికి నాలుగు వాయిదాల పద్ధతిలో మొదటి ఏడాది పది శాతం, రెండో ఏడాది 20 శాతం, మూడో ఏడాది 30 శాతం, నాలుగో ఏడాది 40 శాతం వంతున చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్, ఛైర్మన్‌ను నియమించే అంశం కేబినెట్ భేటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. యూనివర్సిటీల్లోని నాన్ టీచింగ్ సొసైటీల్లోని ఉద్యోగులకు 60 నుంచి 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయసు పెంపుతోపాటు కొన్ని కార్పొరేషన్ల ఉద్యోగుల విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. సిపిఎస్‌కు సంబంధించిన అంశంపై సానుకూలంగా ఉన్నామన్నారు. మెరుగ్గా ఉండేటట్లు కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. స్పెషల్ అలవెన్స్‌లు ఇవ్వడానికి అంగీకరించామని, కొత్త జిల్లాల కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఎ ఇవ్వనున్నామని మంత్రి తెలిపారు.

ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో పిఆర్‌సి వేయాలని కోరినట్లు తెలిపారు. తాము గతంలో ఇచ్చిన డిమాండ్లలో దాదాపు అన్నీ పూర్తయ్యాయని, ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులకు సంబంధించి జిపిఎస్ పేరుతో కొన్ని రాయితీలు ఇస్తామని కేబినెట్‌లో ప్రకటిస్తామని ప్రభుత్వం చెప్పిందని, తాము పాత పెన్షన్ మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతం కొంత పెంచాలని ప్రభుత్వానికి తెలిపామన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. సిపిఎస్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తాము చేస్తున్న ఉద్యమ ఫలితంగానే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అయితే ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆయా సంస్థల ఉద్యోగులు పెదవి విరిచారు. జాయింట్ కౌన్సిల్ సమావేశంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, సిఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మిగతా 2లో

హామీల అమలు ఏదీ?

- 41.15 కాంటూరు నిర్వాసితులకు 2022 సెప్టెంబరుకు పరిహారం
- ఇప్పటికీ 73శాతం మందికి అందలేదు
- ఆర్ అండ్ ఆర్ పరిహారం పెంపుపైనా మౌనం
- నేడు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో సిఎం పర్యటన

గత ఏడాది వరదలకు కుక్కునూరు రామాలయం సెంటర్‌లో నివసిస్తున్న ప్రజలు తరలివెళ్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. గతేడాది జులైలో విరుచుకుపడిన వరదలకు నిర్వాసితులంతా నెలల తరబడి పునరావాస కేంద్రాల్లో బతుకులు వెళ్లదీశారు. వారికి సెప్టెంబర్‌లో పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తుండడంతో తమకిచ్చిన హామీల సంగతేంటంటూ నిర్వాసితులంతా ప్రశ్నిస్తున్నారు. గతేడాది జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడిన వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పోలవరం నిర్వాసిత కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ రెండు మండలాల్లో 107 గ్రామాలు ఉండగా, వాటిలో దాదాపు వంద గ్రామాల వరకూ వరద ముంపులో చిక్కుకుపోయాయి. కొన్ని గ్రామాల్లో ఇళ్ల పైకప్పుల పైనుంచి వరద నీరు పారింది. నిర్వాసితులు కట్టుబట్టలతో మిగిలారు. ఇంట్లోని సామాన్లు మొత్తం పాడైపోయాయి. ప్రభుత్వం లెక్కలు కట్టిన 41.15 కాంటూరు, 45.72 కాంటూరుతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ వరదల్లో చిక్కుకుని విలవిలలాడాయి. దాదాపు 25 వేల కుటుంబాలు నెలల తరబడి పునరావాస కాలనీల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. తినడానికి తిండిలేక, ఉండడానికి చోటులేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదల సమయంలో వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట గ్రామంలో పర్యటించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి 2022 సెప్టెంబర్ నాటికి 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసిత కుటుంబాలకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. 45.75 కాంటూరు పరిధిలోని కుటుంబాలకు పరిహారం కేంద్రం సహకరిస్తే తప్ప ఇవ్వలేమని అన్నారు. సెప్టెంబర్ పూర్తయ్యి ఎనిమిది నెలలు గడిచిపోయింది. మళ్లీ జులై వచ్చేస్తోంది. నిర్వాసితులను మళ్లీ వరద భయం వెంటాడుతోంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 41.15 కాంటూరు పరిధిలో 7071 కుటుంబాలు ఉన్నాయి. 2023 మే 18 నాటికి 1,943 కుటుంబాలకు మాత్రమే పరిహారం అందింది. ఇంకా 5,074 కుటుంబాలకు అంటే 73 శాతం మందికి పరిహారం అందలేదు. వరదల్లో ఇల్లు దెబ్బతిన్న కుటుంబాలకు రూ.పది వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బాధితుల్లో సగం మందికి కూడా పరిహారం అందకపోవడంతో గగ్గోలు మిగతా 7లో

మరో 3 రోజులు ఎండలే

- నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ఇంటర్‌నెట్ ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు!

- కెఎఫ్‌ఓఎన్ ప్రాజెక్టును ప్రారంభించిన పినరయి విజయన్

సౌదీ అరేబియాలో వెనిజులా అధ్యక్షుడు మదురో పర్యటన

• లోపలి పేజీలో.. •

మునగపాకలో కౌలు రైతుల రక్షణ యాత్ర జాతాను జెండా ఊపి ప్రారంభిస్తున్న హరిబాబు

గ్రామ సభల్లో కౌలు రైతుల గుర్తింపు

అనకాపల్లి జిల్లా మునగపాకలో 'కౌలు రైతుల రక్షణ యాత్ర' ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ (అనకాపల్లి జిల్లా)

గ్రామ సభలు ఏర్పాటు చేసి అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 'కౌలు రైతుల రక్షణ యాత్ర' పేరిట సోమవారం నుంచి తలపెట్టిన రాష్ట్ర జాతాను ఆయన అనకాపల్లి జిల్లా మునగపాక మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సంఘం జెండా ఊపి ప్రారంభించారు. పేటకట్టు, తిమ్మరాజుపేట గ్రామాల్లోని కౌలు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే చివరికి అప్పులే మిగులుతున్నాయన్నారు. గుర్తింపు కార్డు లేకపోవడంతో పంట రుణాలు, పంటల బీమా, రైతు భరోసా, పంట నష్టపరిహారాలు అందకుండా పోతున్నాయని తెలిపారు. భూమిని కౌలుకు ఇచ్చినట్లు భూ యజమానులు సంతకం పెట్టడానికి ముందుకు రాకపోవడంతో కౌలు రైతులు గుర్తింపునకు, ప్రభుత్వ సహాయానికి నోచుకోవడం లేదన్నారు. ఫలితంగా కౌలు రైతులు మిగతా 2లో

ఘటనా స్థలిలో బోల్తా పడిన ట్రాక్టర్, గుమిగూడిన ప్రజలు

ట్రాక్టర్ బోల్తా

- ఏడుగురు మహిళల దుర్మరణం

ప్రజాశక్తి- ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)

శుభకార్యానికి వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి ఏడుగురు మహిళలు మృతి చెందారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు వద్ద సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ప్రత్తిపాడు మండలం కొండేపాడుకు చెందిన జంగా కుమారి సోదరుని కుమార్తె పుష్పాలంకరణ వేడుక కోసం గ్రామంలోని ఎస్‌సి కాలనీకి చెందిన సుమారు 40 మంది మహిళలు, నలుగురు పురుషులు ట్రాక్టర్‌లో పొన్నూరు మండలం జూపూడికి మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బయలుదేరారు. వట్టిచెరుకూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టర్ మలుపు తిరుగుతున్నప్పుడు అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి బోల్తా కొట్టింది. ఎండ నుండి రక్షణకు ట్రాక్టర్‌పై కట్టిన పట్టా సైతం మహిళలను చుట్టేయడంతో పలువురికి ఊపిరాడలేదు. ఇదే సమయంలో అటుగా వస్తున్న ప్రొక్లెయినర్ డ్రైవర్ గమనించి బోల్తాపడిన ట్రక్కును ప్రొక్లెయినర్‌తో యథాతథ స్థితికి చేర్చారు. ఘటన గురించి తెలియగానే కొందరు మిగతా 5లో

కూనేరు రైలు ప్రమాదానికి ఆరున్నరేళ్లు

- నేటికీ నివేదిక బయటపెట్టని కేంద్ర ప్రభుత్వం
- ప్రయివేటీకరణతో పెరుగుతున్న ప్రమాదాలు

(ఫైల్)

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కూనేరు వద్ద 41 మందిని బలిగొన్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం చోటుచేసుకొని నేటికి ఆరున్నరేళ్లు గడిచినా ఇంతవరకూ విచారణ నివేదిక బయటకు రాలేదు. ట్రాక్ బలహీనం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఇది ముమ్మాటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యమేనని అప్పట్లో విమర్శలొచ్చాయి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే నివేదికను తొక్కిపెడుతోందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంతో జిల్లా వాసులు కూనేరు ఘటనను గుర్తు చేసుకుంటున్నారు.

అమలు కాని హామీలు...

2017 జనవరి 21వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో కూనేరు రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఒడిశా మీదుగా విశాఖ వైపు వస్తున్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లోని తొమ్మిది బోగీలు పట్టాలు తప్పగా, ఇందులోని నాలుగు బోగీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో 41 మంది దుర్మరణం చెందగా, 65 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఏడుగురు ఉన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సాయంతోపాటు వారి పిల్లలకు మెరుగైన విద్య అందిస్తామని, కుటుంబ సభ్యులకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీతో కూడిన రుణాలిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో ఆర్థిక సాయం తప్ప, మిగిలినవేవీ అమలు కాలేదు.

విద్రోహ శక్తుల కుట్ర అంటూ అప్పట్లో తప్పుడు ప్రచారం

కూనేరు రైలు ప్రమాదం వెనుక ఉన్న తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పాలకులు... సంఘ విద్రోహ శక్తుల కుట్ర ఉండి ఉండవచ్చంటూ కుట్ర సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. విచారణను తొత్తడం చేయడానికి ఎన్‌ఐఎ (నేషనల్ మిగతా 2లో

సిబ్బందే లేకుండా భద్రత ఎలా?

సిగ్నల్, ట్రాఫిక్ విభాగాల్లోనే భర్తీకాని 77 వేల పోస్టులు 7

అంగన్‌వాడీ కార్యకర్త హత్య..

- ట్రాక్టర్‌తో తొక్కించిన వైసిపి నాయకుడు

ప్రజాశక్తి-టంగుటూరు (ప్రకాశం జిల్లా)

టంగుటూరు పంచాయతీ పరిధిలోని రాయవారిపాలెం గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తను ఆమె సమీప బంధువు ట్రాక్టర్‌తో తొక్కించి సోమవారం హత్య చేశాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాయవారిపాలెం 187వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో సవలం హనుమాయమ్మ (52) అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్నారు. గ్రామ టిడిపి నాయకుడైన ఆమె భర్త సుధాకర్ పార్టీ కార్యక్రమం నిమిత్తం ఉదయమే టంగుటూరుకు వెళ్లారు. హనుమాయమ్మ ఇంటి సమీపంలో ఉన్న బోరు నుండి నీరు తెచ్చుకుంటుండగా సమీప బంధువు, వైసిపి నాయకుడు సవలం కొండలరావు ఆమెను ట్రాక్టర్‌తో ఢీ కొట్టాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. కొండలరావు కుటుంబానికి, హనుమాయమ్మ కుటుంబానికి గత కొన్ని సంవత్సరాలుగా భూ వివాదాలు, ఇతర కుటుంబ కలహాలు ఉన్నాయి.

ముందస్తు ఉండదు

- మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు ఉండవని, సాధారణ ఎన్నికలతోపాటు పార్లమెంటుకు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ముందస్తు అనే ఆలోచనే వైసిపికి లేదన్నారు. చంద్రబాబు రాజకీయంగా అంగవైకల్యంతో బాధపడుతున్నారని, అందుకోసమే ఇతర రాజకీయ పార్టీలతో పొత్తుల కోసం ఆరాటపడుతున్నారని విమర్శించారు. అందులో భాగంగానే ఢిల్లీకి వెళ్లి అమిత్‌షాను కలిశారని ఆరోపించారు. జనసేన, పవన్ కల్యాణ్ గురించి మాట్లాడదలచుకోలేదని పేర్కొన్నారు. ఏ ఎన్నికలైనా తాము ఒంటరిగా వెళ్తామని తెలిపారు.

డ్వాక్రా మహిళలకు అన్యాయం

- చార్జ్‌షీట్ విడుదల చేసిన టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్ పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం జరిగిందని తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ అధ్యక్షులు ఆచంట సునీత విమర్శించారు. 'వైసిపి నాలుగేళ్ల పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం'పై చార్జ్‌షీట్' పుస్తకాన్ని టిడిపి కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా రుణమాఫీ చేస్తానని మహిళలను జగన్ వంచించారని విమర్శించారు. సాధికార కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ విమర్శించారు. ఈ సమావేశంలో సాధికార కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు జానీబేగం, కృష్ణా జిల్లా అధ్యక్షులు పొదిలి లలిత తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేలుడులో మరొకరు మృతి

ప్రజాశక్తి - వరదయ్యపాళెం (తిరుపతి)

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం ఎల్లకట్టవ గ్రామంలో గత నెల 31న టపాసుల తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడు ఘటనలో మరొకరు మృతిచెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య నలుగురికి చేరింది. తీవ్రంగా గాయపడి చెన్నైలో చికిత్స పొందున్న వలంటీర్ కల్యాణ్ పరిస్థితి విషమించి సోమవారం మరణించినట్టు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హామీ ఇచ్చారు.

బాధితులకు అండగా నిలిచాం

- రైల్వే ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన చికిత్స
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒడిశా రైలు ప్రమాద ఘటనలో తమ ప్రభుత్వం సకాలంలో స్పందించి బాధితులకు అండగా నిలిచిందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికత్స అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ దుర్ఘటనలో మొత్తం ప్రయాణికుల వివరాలను సేకరించామన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రయాణికులు కోరమాండల్‌లో 309 మంది, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో 33 మంది కలిపి మొత్తం 342 మంది వున్నారని తెలిపారు. వీరిలో 12 మందికి స్వల్ప గాయాలు కాగా, ఒకరు మృతి చెందారని చెప్పారు. క్షతగాత్రులకు భువనేశ్వర్, విశాఖపట్నంలో మెరుగైన చికిత్స అందించామన్నారు. రాష్ట్రం నుంచి జనరల్ బోగిలో వున్న శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి మృతిచెందారని తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఐఎఎస్ అధికారులు ఇంకా భువనేశ్వర్‌లోనే ఉంటూ అవసరమైన సహాయం అందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఎపిలోని కంట్రోల్ రూమ్‌లకు కాల్స్ ఏమీ రావడం లేదని తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన అంబటి రాములు అనే వ్యక్తి విజయవాడ నుంచి కోల్‌కతాకు వెళ్లారని, మన కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు వచ్చిందని, దానిపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజల మనిషి సాంబశివరావు

- ఆయన ఆశయాల ఆచరణే నిజమైన నివాళి
- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

నీతి, నిజాయితీగా ప్రజల కోసం నిరంతరం పనిచేసిన వల్లభనేని సాంబశివరావు ధన్యజీవిని అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో ఇటీవల మృతిచెందిన సిపిఎం దుగ్గిరాల మండల మాజీ కార్యదర్శి వల్లభనేని సాంబశివరావు సంతాప సభ సోమవారం ఆ పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అధ్యక్షతన జరిగింది. తొలుత సాంబశివరావు స్తూపాన్ని వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సాంబశివరావు కమ్యూనిస్టుగా జీవించడమే కాకుండా కుటుంబ సభ్యులందరినీ కమ్యూనిస్టులుగా చేయడం మంచి పరిణామం అన్నారు. దుగ్గిరాల మండలంలో సిపిఎం బలంగా నిర్మించడంలో ఆయన కృషి ఎనలేనిదని తెలిపారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం కుట్ర జరిగిందని చెప్పి కేంద్ర ప్రభుత్వం తప్పుకోవడానికి చూస్తోందని, రైల్వే మంత్రికి నిజాయితీ ఉంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం నేత పి మధు మాట్లాడుతూ.. వల్లభనేని సాంబశివరావు మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. కడవరకు కమ్యూనిస్టుగా నిలిచారని కొనియాడారు. రైతులు, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయడమే సాంబశివరావుకు ఘనమైన నివాళి అని అన్నారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. పేద ప్రజలు పడుతున్న సమస్యలు పరిష్కారానికి సాంబశివరావు కృషి చేశారని తెలిపారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వి ఉమామహేశ్వరరావు, వి వెంకటేశ్వర్లు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామరావు, ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు కె ధనలక్ష్మి, కె ఉమా మహేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు లోకం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్తూపం ఆవిష్కరించిన అనంతరం నివాళులర్పిస్తున్న వి శ్రీనివాసరావు, పి మధు తదితరులు

రైలు ప్రమాద బాధితులకు న్యాయం చేయాలి

- సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. ప్రమాదంలో 275 మందికి పైగా మరణించడం బాధాకరమన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణకు పూనుకోవడం, ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం, రక్షణను గాలికొదిలేసిన ఫలితమే ఒడిశాలో జరిగిన రైల్వే ప్రమాదానికి కారణమని విమర్శించారు. ఈ దుర్ఘటనలకు ప్రధాన మంత్రి, రైల్వేశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై సిబిఐ విచారణ పేరుతో తప్పించుకుందామని చూస్తే ప్రజలు సహించరని చెప్పారు. విజయవాడ స్టేషన్‌తో సహా ప్రధానమైన స్టేషన్లను ప్రైవేట్ వ్యక్తులకు 99 ఏళ్లకు లీజుకు ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 150 రైల్వే రూట్‌లను ప్రైవేట్‌పరం చేస్తున్నారని వివరించారు. అడ్డగోలుగా లాభాపేక్షతో ప్రైవేటీకరణ చేసి రైల్వేను ఒక వ్యాపార సంస్థగా కేంద్ర ప్రభుత్వం మార్చేసిందని విమర్శించారు. దీని ఫలితమే ప్రయాణికుల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని తెలిపారు. ప్రైవేటీకరణ విధానాలు పోయి, ప్రయాణికులకు రక్షణ కల్పించి, భద్రతను గౌరవించే విధానం రావాలని చెప్పారు. కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిగ్గదీయాలని కోరారు. రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులు ఇవ్వరని, రైల్వేను అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నోరు విప్పి, కేంద్రాన్ని నిలదీసేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు బోయి సత్యబాబు, భూపతి రమణ, కె దుర్గారావు, పి కృష్ణ, నాగేశ్వరరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ 27వ రాష్ట్ర మహాసభల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన పలిశెట్టి దామోదరరావు, జివి నరసయ్య ఇతర రాష్ట్ర నాయకులు సోమవారం ఆర్‌టిసి ఎమ్‌డిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను ఎమ్‌డికి వివరించి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు సంబంధించిన పిఆర్‌సి బకాయిలు, కేడర్ స్ట్రెంగ్త్ సమస్యలు పరిష్కరించాలన్నారు. లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ సమస్యలతోపాటు రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును కలిసినవారిలో వర్కింగ్ ప్రెసిడెంట్ పి సుబ్రమణ్యం రాజు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్‌కె సుభాని, కె నాగేశ్వరరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు ఆవుల ప్రభాకర్, ఎమ్‌ఎమ్‌డి ప్రసాద్, జి నారాయణరావు, పి భానుమూర్తి, కోశాధికారి ఎమ్‌డి, ఎ సిద్ధిక్, ప్రచార కార్యదర్శిగా పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలి

- గురజాల ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా
- సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం : దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)

గురజాల మండలంలోని చర్లగుడిపాడు గ్రామంలో దళితులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వ్యకాస, కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం దళితులు ధర్నా నిర్వహించారు.

అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో దడాల సుబ్బారావు మాట్లాడుతూ జంగమేశ్వరపురానికి చెందిన ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి దళితులు సాగు భూములకు ఎలాంటి సంబంధం లేదన్నారు. హైకోర్టు పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ అమలు చేయడానికి ఆర్‌డిఒ మీనమేషాలు లెక్కించడం అన్యాయమన్నారు. చర్లగుడిపాడులో 300 ఎకరాల ప్రభుత్వ భూములను దళితులు తమ పూర్వీకుల కాలం నుండి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయినా ఎన్‌జి రంగ విశ్వవిద్యాలయ విత్తన పరిశోధన సంస్థవారు ఈ భూమిని దున్ని సాగు చేయాలని చూస్తున్నారని, దాన్ని నిరోధించాలని అధికారులను కోరారు.. విశ్వవిద్యాలయ ఉద్యోగులు, ఆ గ్రామంలోని అగ్రకుల పెత్తందార్లతో కుమ్మక్కయ్యి ఈ భూములు విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం కేటాయించినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వ్యకాస పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల లక్ష్మేశ్వరరెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పును అమలు చేయాలని గత మూడు నెలలుగా తిరుగుతున్నామని, మే 30న సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారని, అయినా ఇంతరవరకు అమలుకు నోచుకోలేదన్నారు. ఈ భూములపై ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం వారికి హక్కులు ఉన్నట్లుగా పత్రాలు లేవని, ఈ నెల 13న విశ్వవిద్యాలయం వారిని పిలిపించి విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. 13న సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు, దళిత రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం ప ల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

గురజాల ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న దడాల సుబ్బరావు

టంగుటూరులో ఉద్రిక్తత

- వైసిపి ఇన్‌ఛార్జి అశోక్‌బాబు గృహ నిర్బంధం
- పోలీసులకు, టిడిపి నేతలకు మధ్య తోపులాట



చెంబులతో వైసిపి శ్రేణుల ర్యాలీ, ఇన్‌సెట్‌లో చిరిగిన టిడిపి ఎమ్మెల్యే స్వామి చొక్కా

ప్రజాశక్తి-టంగుటూరు

గత టిడిపి ప్రభుత్వంలో మరుగుదొడ్ల నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందంటూ వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు సోమవారం చేపట్టిన చెంబుల ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బాధిత లబ్ధిదారులతో కలిసి చెంబులతో ఎమ్మెల్యే డాక్టర్ స్వామి ఇంటి వద్దకు 'చలో నాయుడుపాలెం' అంటూ అశోక్‌బాబు ఆదివారం ప్రకటించారు. ఈ సమాచారం తెలుసుకున్న టిడిపి శ్రేణులు అశోక్ బాబు చెంబులతో వస్తే తాము అంతకు రెట్టింపు జనంతో ఎదుర్కొంటామని ప్రకటించి.. ఫినాయిల్‌తో 'చలో టంగుటూరు'కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు సోమవారం టంగుటూరులో భారీగా మోహరించారు. సోమవారం ఉదయాన్నే అశోక్‌బాబును హౌస్ అరెస్ట్ చేసేందుకు పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. అక్కడ హైడ్రామా నడిచింది. పోలీసులు రాకముందే అశోక్‌బాబు ఇంటిలోంచి బయటకు వెళ్లిపోయారు. పోలీసులు అశోక్‌బాబు ఇంటిలోనే ఉన్నాడని భావించి హౌస్ అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఉదయం 8.30 సమయంలో అశోక్‌బాబు పార్టీ కార్యాలయం వద్ద ఉన్నారని తెల్సింది. దీంతో అశోక్‌బాబు ఇంటి నుండి ఉరుకులు, పరుగులతో పోలీసులు పార్టీ కార్యాలయానికి చేరుకొని అశోక్‌బాబును బయటకు రాకుండా చుట్టుముట్టి ఆంక్షలు విధించారు.

ఎమ్మెల్యేకి చిరిగిన షర్టు

మరో వైపు టిడిపి శ్రేణులతో కలిసి జాతీయ రహదారిపైకి వచ్చిన ఎమ్మెల్యే స్వామిని పోలీసులు బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించారు. కొంతసేపు జాతీయ రహదారిపైనే టిడిపి నాయకులు, పోలీసులు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం జరిగిన తోపులాటలో ఎమ్మెల్యే స్వామి షర్టు పూర్తిగా చిరిగింది. దీంతో టిడిపి నాయకులు జాతీయ రహదారిపై కొంతసేపు బైఠాయించి పోలీసుల తీరును నిరసిస్తూ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ నేపథ్యంలో నాయుడుపాలెం - టోల్ ప్లాజా మధ్యలోని జాతీయ రహదారిపై దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఇరు పార్టీల నాయకులు ఎవరూ ఎదురు కాకుండా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు. ఎమ్మెల్యే స్వామిని కొంతసేపు పోలీసు వాహనంలోనే జాతీయ రహదారిపై తిప్పారు. అశోక్ బాబు ఇక రారని నిర్ధారించుకున్న తర్వాత ఎమ్మెల్యేని ఆయన స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో దింపేశారు.

సిఎఫ్‌ఎంఎస్ వల్లే బిల్లుల చెల్లింపులో జాప్యం

- మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సిఎఫ్‌ఎంఎస్ వల్లే బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతోందని మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్‌శాఖలో పెండింగ్‌లో వున్న 2,760 పనులకు సంబంధించి రూ.511 కోట్ల బిల్లులను పూర్తిగా చెల్లించామని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సిఎఫ్‌ఎంఎస్ ప్రకారం చెల్లించడం వల్ల కాస్త ఆలస్యమైందన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.2 వేలకోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. పన్నుల విధానంలో తెచ్చిన సంస్కరణలతో మున్సిపాలిటీలకు ఆదాయం భారీగా పెరిగిందన్నారు. 2018-19లో రూ.1,185 కోట్లుగా వున్న ఆదాయం, ఇప్పుడు రూ.2 వేలకోట్లకు పెరిగిందన్నారు. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రభుత్వం పనులు చేపడుతోందన్నారు.

'డోలా' గొంతు నొక్కేందుకు కుట్రలు : చంద్రబాబు

అమరావతి బ్యూరో : టిడిపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి గొంతు నొక్కేందుకు వైసిపి కుట్రలు చేస్తోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహించారు. స్వామిపై వైసిపి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీలో దాడి నుంచి నేటి అక్రమ అరెస్టు వరకు ప్రతి చర్య దళిత నాయకుడైన స్వామి గొంతు నొక్కేందుకు ఈ ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని అన్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న అహంకార ధోరణిని దళిత సమాజం గమనిస్తోందని అన్నారు. పోలీసులు వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్వామిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్వామి అరెస్టును టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తదితరులు ఖండించారు.

కాకినాడ సెజ్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు

- స్థానికులకు సైతం సమాచారం ఇవ్వని అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ సెజ్‌లో అరబిందో బల్క్ డ్రగ్ యూనిట్ ఏర్పాటు కోసం గుట్టుగా ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అరబిందో రియాల్టీ సంస్థ కాకినాడ సెజ్ పరిధిలోని తొండంగి మండలం పెరుమాళ్లపురంలో బల్క్ డ్రగ్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణకు యాజమాన్యంతో కలిసి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఏదైనా ఫ్యాక్టరీ పెట్టాలంటే ముందుగా స్థానికులకు, ఫ్యాక్టరీ వల్ల ప్రభావితమయ్యే ప్రజలకు సమాచారం అందించాల్సి ఉంది. ఒకటి రెండు పత్రికల్లో మాత్రం నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులిపేసుకుంది. గ్రామాల్లో దండోరా వేయడం గాని, పంచాయతీ కార్యాలయాల్లో నోటీసులు అంటించడం గాని చేయలేదు. రహస్యంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఫ్యాక్టరీ ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ప్రభుత్వం, అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఈ సెజ్‌లో దివీస్ డ్రగ్స్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యత్నించింది. దీంతో, నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహించారు. వీరికి సిపిఎం అండగా నిలిచింది.ఉద్యమం మరింత ఉధృతమైంది. దీన్ని అణచివేసేందుకు ఆందోళనలో పాల్గొన్న ప్రజలు, నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. బెయిల్ రాకుండా వేధింపులకు దిగింది. తీవ్ర వ్యతిరేకత రావడంతో చేసేది లేక వెనక్కి తగ్గింది. ఇప్పుడు అరబిందో సంస్థ బల్క్ డ్రగ్స్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దివీస్ తరహాలో వ్యతిరేకత వస్తుందనే కారణంతో అధికారులు స్థానిక ప్రజలకు, మత్స్యకారులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా ఈ మేరకు ప్రజాభిప్రాయ సేకరణకు సమాయత్తం అవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్పందనలో టిడిపి ఆధ్వర్యంలో ఫిర్యాదు

కాకినాడ సెజ్‌లో ఏర్పాటు చేస్తున్న అరబిందో బల్క్ డ్రగ్ యూనిట్ పరిశ్రమ సరికాదని టిడిపి పేర్కొంది. మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌విఎస్‌ఎన్.వర్మ, వనమాడి కొండబాబు సోమవారం దివిస్, అరబిందో ఫ్యాక్టరీలకి వ్యతిరేకంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తక్షణం ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

బిజెపి పాలనలో చరిత్రపై దాడి

- సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం : చరిత్రపై దాడిని కేంద్ర ప్రభుత్వం తీవ్రతరం చేసిందని, దానిలో భాగంగానే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న పాఠ్యాంశాలను తొలగిస్తోందని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు తెలిపారు. 'పాఠ్యాంశాల తొలగింపు, పూర్వపరాలు, పర్యవసానాలు' అనే అంశంపై రాజమహేంద్రి ఆలోచన వేదిక, యుటిఎఫ్, జెవివి తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాల్లో సోమవారం సదస్సు జరిగింది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయకర్ అధ్యక్షత జరిగిన సదస్సులో లక్ష్మణరావు ముఖ్యవక్తగా మాట్లాడారు. విద్యా రంగంలో ఎన్‌సిఇఆర్‌టి, ఎస్‌సిఆర్‌టి, యుజిసి తదితర పరిశోధనా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, నీట్ వంటి పరీక్షలకు ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ కీలకమని పేర్కొన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి, జమ్మూ కాశ్మీర్ విలీనం, ఆర్‌ఎస్‌ఎస్ నిషేధం, గోద్రాలో జరిగిన అల్లర్లు, డెమొక్రటిక్ పాలిటిక్స్, మొగల్ చక్రవర్తుల చరిత్ర వంటి పాఠ్యాంశాలను తొలగించారన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వంలోనూ ఇలాగే పాఠ్యాంశాల తొలగింపు జరిగిందని గుర్తు చేశారు.కర్ణాటకలో బసవరాజు బొమ్మై చేసిన ప్రయత్నాన్ని అక్కడ ప్రజలు వ్యతిరేకించారని తెలిపారు. ఈ విధానాలపై ఉద్యమించి పాఠ్యాంశాల పునరుద్ధరణకు ప్రతి ఒక్కరు కంకణ బద్ధులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి యూనియన్ నాయకులు సతీష్, పిఎస్‌ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

మొదటిపేజి తరువాయి

ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కెవివి సత్యనారాయణ, పి భాస్కరరావు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఎస్‌టియు అధ్యక్షులు సాయి శ్రీనివాస్, పిఆర్‌టియు అధ్యక్షులు కృష్ణయ్య, యుటిఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎపిటిఎఫ్ అధ్యక్షులు హృదయరాజు, ఎపిజిఇఎ కార్యదర్శి ఆస్కార్‌రావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోపాలకృష్ణ, ఎపి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సభల్లో కౌలు రైతుల గుర్తింపు

మొదటిపేజి తరువాయి

అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు కార్డు ఉంటే రైతు భరోసా, పిఎం కిసాన్ కింద ఏటా రూ.13,500 పొందడంతో పాటుగా లక్ష రూపాయల వరకు వడ్డీ లేకుండా బ్యాంకులలో రుణాలు పొందవచ్చునన్నారు. మధ్యవర్తిత్వం లేకుండా ప్రతి కౌలు రైతుకూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, పెరిగిన వ్యవసాయ పెట్టుబడి రీత్యా రైతు భరోసా, పిఎం కిసాన్ కింద ఇస్తున్న మొత్తాన్ని రూ.25 వేలకు పెంచాలని, కేరళ తరహాలో రుణవిముక్తి చట్టాన్ని చేయాలని, కౌలు, సన్న, చిన్నకారు రైతుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయ భూముల కౌలు రైతులందరికీ కార్డులు మంజూరు చేసి రుణాలు ఇవ్వాలని కోరారు. తాము తలపెట్టిన యాత్ర ఈ నెల 12వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో సాగుతుందని, చివరి రోజు మంగళగిరిలోని సిసిఎల్ఎ కమిషనర్‌తో రాయబార కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతాలో సంఘం జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల రాము, కార్యదర్శి ఎ.బాలకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పాల్గొన్నారు. అనంతరం జాతా అచ్యుతాపురం, యలమంచిలి, కశింకోట మండలాల్లోని 12 గ్రామాల్లో సాగింది.

కూనేరు రైలు ప్రమాదానికి ఆరున్నరేళ్లు

మొదటిపేజి తరువాయి

ఇన్విస్టిగేషన్ అథారిటీ), సిఐడి, ఎఫ్‌ఎస్‌ఎల్ (ఫోరెన్సిక్ లేబొరేటరీ), పోలీస్ శాఖల ఆధ్వర్యాన వేర్వేరుగా విచారణ చేప ట్టింది. ఇప్పటికీ ఆ నివేదికను బయట పెట్టడం లేదు.

పెరుగుతున్న రైళ్లు... తగ్గుతున్న సిబ్బంది

రైల్వే శాఖలో అనుసరిస్తోన్న ప్రయివేటీకరణ, పేరుకుపోతున్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడం, ఇంజనీరింగ్ విభాగంలో ట్రాక్ నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులను ప్రయివేట్ వారికి అప్పగించడం వంటి చర్యలతో రైల్వే భద్రత ప్రమాదంలో పడుతోందని నిపుణులు పేర్కొంటు న్నారు. రైలు పట్టాల మార్పు మొదలుకుని, పట్టాలు ఎప్పటికప్పుడు పటిష్టపర్చే ప్యాకింగ్, లిఫ్టింగ్ వంటి పనుల్లో ఈ జిల్లా వాసులు ఆరితేరారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ - రాయగడ, విశాఖ - కిరండోల్, విజయనగరం-పలాస వరకు ట్రాక్ మరమ్మతుల పనుల్లో సుమారు ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. పర్మినెంట్ సిబ్బంది సంఖ్య గణనీయంగా తగ్గింది. ఘటన జరిగిన పార్వతీపురం రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్‌లో పదేళ్ల క్రితం 124 మంది ట్రాక్‌మెన్లు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 78కి తగ్గిపోయింది. మరోవైపు రైళ్ల సంఖ్య 87 నుంచి 111కి పెరిగింది. అదనంగా రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరుగుతోంది. అందుకు తగ్గట్టు సిబ్బంది లేకపోవడం, కాంట్రాక్టు పనులపై ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపించడం, ట్రాక్ నిర్వహణపై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వల్లే కూనేరు ఘటన జరిగిందని ఆ శాఖలో ఉద్యోగులే చెబుతున్నారు. కూనేరు, బాలాసోర్ వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే రైల్వే భద్రతపై విచారణ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొంటున్నారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : గుంటూరు వద్ద వట్టిచెరుకూరు వద్ద రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై టిడిపి అధినేత చంద్రబాబు సంతాపం తెలిపారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ట్రాక్టర్ బోల్తా దుర్ఘటన దురదృష్టకరమని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడుగురు మహిళలు దుర్మరణం చెందడం తీవ్ర ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు.

పురిటి బిడ్డను అమ్మేశారు

- పిఠాపురం ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నిర్వాకం
- స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధిత మహిళ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం కోసం వెళ్తే ఓ వైద్యురాలు మోసం చేసి తన బిడ్డను అమ్మేసిందని బాధిత మహిళ సోమవారం స్పందనలో కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. పిఠాపురం రథాలపేటకు చెందిన దాసరి లక్ష్మి రెండేళ్ల క్రితం ప్రసవం కోసం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. ఆపరేషన్ అనంతరం మత్తులోంచి మెలకువ వచ్చిన తర్వాత చూడగా బిడ్డ కనిపించలేదు. ఈ విషయమైన వైద్యులను నిలదీయగా బిడ్డను అమ్మిన విషయం వెలుగులోకి వచ్చింది. తన అనుమతి లేకుండా బిడ్డను ఎలా అమ్మారని, తన బిడ్డను తనకు అప్పగించాలని వైద్యులను ఆమె వేడుకున్నారు. ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న లక్ష్మికి మాయ మాటలు చెప్పి రూ.30 వేలు చేతిలో పెట్టారు. ఇంకా డబ్బులు ఇస్తానని చెప్పి మోసం చేశారు. డబ్బులు వద్దు, బిడ్డను అప్పగించాలని అడుగుతుంటే బెదిరిస్తున్నారని ఆమె ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో త్వరలో ప్రత్యేక బందంతో పూర్తిస్థాయి విచారణ చేసి, బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేస్తామని జిల్లా ఆరోగ్య సేవల సమన్వయ అధికారి పిబి.విష్ణువర్ధిని తెలిపారు.

ఫిర్యాదు చేసిన బాధితురాలు దాసరి లక్ష్మి

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

- చిత్తూరు, ఏలూరులో కొనసాగిన జాతాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

సిపిఎస్ రద్దు చేయాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాలు సోమవారం ఏడవ రోజుకు చేరాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మీదుగా ఏలూరులోకి, సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి బయలు దేరిన జాతా చిత్తూరు జిల్లాల్లోకి ప్రవేశించింది. తాడేపల్లిగూడెంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. సోమయ్య మాట్లాడుతూ..పాదయాత్ర సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను సిఎం జగన్ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచడంతోపాటు ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చిత్తూరులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నాగరాజు మాట్లాడారు. ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎపి ఎఫ్ఆర్ఎస్, ఇకెవైసి తదితర పేర్లతో కార్మికులను వేధింపులకు గురి చేయడం తగదన్నారు. ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తామని వైసిపి మేనిఫెస్టోలో పేర్కొందని గుర్తుచేశారు. 98శాతం హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి.. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని, ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న వారికి రక్షణ ఏదీ అని ప్రశ్నించారు. ఆయా మున్సిపాల్టీల్లో జాతాకు నాయకులు ఘన స్వాగతాలు పలికారు.

తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

- కాలుష్యరహిత విద్యుదుత్పత్తికే ప్రాధాన్యం
- పర్యావరణ, శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని పర్యావరణ, శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం, కాలుష్యాన్ని నియంత్రించుకోవడం ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం విజయవాడలోని ఓ ప్రైవేటు హాల్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దిరెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మిషన్‌లైఫ్ కార్యక్రమంలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో నీటి ఆదా, విద్యుత్ పొదుపు, సరైన ఆహార విధానాన్ని అలవరుచుకోవడం, వ్యర్థాలను తగ్గించుకోవడం, స్వచ్ఛతా కార్యకలాపాల్లో పాల్గొనడం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించుకోవడం అనే ఏడు అంశాలనే ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నామని చెప్పారు. మిషన్ లైఫ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని సముద్ర తీరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యుత్ పొదుపు చర్యలు, నీటి పరిరక్షణ విధానాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కాలుష్యరహిత విద్యుదుత్పత్తిపై జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్రంలో 23 శాతంగా ఉన్న అడవులను 33 శాతానికి పెంచాలనే లక్ష్యంతో సిఎం జగన్ పనిచేస్తున్నారని చెప్పారు. పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా గాలి, నీటి కాలుష్యం తగ్గించుకునేందుకు పలు చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నియంత్రించడం, సరైన విధానంలో ప్లాస్టిక్‌ను సేకరించి, వాటిని రీసైకిల్ చేసేందుకు తగు చర్యలు చేపట్టామని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి బి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగంపై వచ్చిన కొత్త నిబంధనలను అమలు చేయబోతున్నామని చెప్పారు. 'ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రిస్తాం, పర్యావరణాన్ని కాపాడుకుంటామని' ప్రతి ఒక్కరితో మంత్రి పెద్దిరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. క్లాత్‌తో రూపొందించిన బ్యాగ్‌ను అందించే ఎనీటైమ్ బ్యాగ్ (ఎటిబి) వెండింగ్ మిషన్‌ను పెద్దిరెడ్డి ఆవిష్కరించారు.

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

- పాదయాత్రలో నారా లోకేష్
- 1500 కిలోమీటర్ల శిలాఫలకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-చెన్నూరు (కడప జిల్లా)

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 117 రోజుకు చేరుకుంది. సోమవారం మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండలంలోని చెన్నముక్కపల్లె నుంచి ప్రారంభమైన పాదయాత్ర కమలాపురం నియోజకవర్గంలోని కొండపేట, చెన్నూరు, ఉప్పరపల్లి క్రాస్, రామనపల్లె క్రాస్, చిన్నమాచుపల్లి, శేషయ్యవారిపల్లి మీదుగా కడప అసెంబ్లీ నియోజకవర్గంలోకి చేరింది. ఇర్కాన్ సర్కిల్, ఆలంఖాన్‌పల్లి వద్ద పాదయాత్ర 1500 కిలో మీటర్లకు చేరిక సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, రైతులు, ముస్లింములు, వికలాంగులతో లోకేష్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే ప్రజల్లో తీవ్రస్థాయిలో అసంతృప్తి ఉందని, కడప జిల్లాలోనూ జగన్ పనైపోయిందని అన్నారు. జగన్‌ను నమ్ముకున్నవారే వైసిపి నుండి బయటకు వస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్‌కు కడప జిల్లాలోనే ఎదురుగాలి వీచిందని తెలిపారు. ఇసుక మాఫియా ధనదాహం కారణంగా అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 61 మంది అమాయకులు బలయ్యారని, వారికి ఇంతవరకు ఎటువంటి పరిహారం అందజేయలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఇసుక ద్వారా జగన్ అండ్ కో రూ.10 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. నదుల నుంచి ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నదీజలాలను పరిరక్షిస్తూ ఇసుక విధానాన్ని సరళీకరించి స్థానికులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

కార్యకర్తలతో కలిసి సెల్ఫీ దిగుతున్న నారా లోకేష్

అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా అరెస్టు

- రూ.48 లక్షల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న అంతర్జాతీయ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 48 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో తెలిపిన వివరాల మేరకు.. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో సూళ్లూరుపేట పోలీసులు స్థానిక హోలీక్రాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నుంచి వస్తున్న ఓ బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. అందులో గంజాయి ఉండడాన్ని గమనించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఆనందవేలు, బాలకిషన్, తిరుమల, రఘునాథన్, వరదరాజన్, డి లవ్‌రాజు, కె వెంకటరమణ, బి రవి లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 48 లక్షల విలువైన 240 కేజీల గంజాయి, ఐదు సెల్ ఫోన్లు, బొలెరో ట్రక్, ఇన్నోవా వాహనము స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లికి చెందిన అప్పలనాయుడు, శ్రీలంకకు దేశస్తుడు ఖాదర్‌భాయ్ పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ నిందితులను వీరిపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ అదనపు ఎస్‌పి రాజేంద్ర, నాయుడుపేట డిఎస్‌పి రాజగోపాల్ రెడ్డి, సూళ్లూరుపేట సిఐ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఐలు సులూరుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వంగా గీతపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ ఎంపి వంగా గీత నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ గీత వదిన పుప్పాల కళావతి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎంపి గీత అన్నయ్య కృష్ణకుమార్‌తో తనకు వివాహమైందని, తన ఆడపడుచులు ఎంపి వంగా గీత, ఆమె సోదరి కుసుకుమారి 2006లో తన భర్తకు సంబంధించిన ఆస్తులను బలవంతంగా రాయించుకున్నారని ఆరోపించారు. 2010లో తన భర్త మరణించారని తెలిపారు. తమ ఆస్తులు గురించి పిల్లలు కోర్టులో పోరాడుతుంటే బెదిరిస్తున్నారని తెలిపారు. తమ కుటుంబాన్ని చంపాలని చూస్తున్నారని, ద్రాక్షారామం, కాకినాడల్లో తమకు వారసత్వంగా రావాల్సిన ఆస్తులను కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. గతంలో సర్పవరం పోలీస్ స్టేషన్‌తో పాటు సిఎం క్యాంప్ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నా ఎవరూ స్పందించలేదన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నట్లు తెలిపారు. ఎంపి వంగా గీత, ఆమె భర్త విశ్వనాథం, గీత సోదరి కుసుమకుమారి, ఆమె భర్త కనకాల రవికుమార్ నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. వారి నుంచి కాపాడాలని కోరారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంపి గీత వదిన కళావతి

పేదల భూముల్లో మట్టి తరలింపు ఆపండి

- లేనిపక్షంలో లంక భూముల్లోనే నిద్రిస్తా : ఎమ్మెల్యే నిమ్మల

ప్రజాశక్తి - యలమంచిలి (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామ దళితులు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన లంక భూముల పేదల పోరాటానికి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సోమవారం మద్దతు తెలిపారు. తొలుత జాతీయ రహదారి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెరుగులంక భూముల్లోకి పేదలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ పెరుగులంక భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ మట్టి తవ్వకాలు ఆపకుంటే పేదలతో కలిసి లంక భూముల్లోనే నిద్రిస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత 70 ఏళ్లుగా సుమారు 400 కుటుంబాల చెందిన దళితులు, పేదలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పేదలకు లంక భూములు లేకుండా చేయాలన్న ఉద్దేశంతో పెద్దఎత్తున పోలీసు బలగాలను కాపలాగా పెట్టి లారీలతో మట్టిని అక్రమంగా తరలిస్తూ పేదల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే మట్టి తరలింపు ఆపకుంటే లంక భూముల్లోనే వంటావార్పు నిర్వహించి అక్కడే నిద్రిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి, ఇతర ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. పేదల న్యాయమైన సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా చూడాలని, లంకల్లోకి మట్టి తవ్వకానికి వచ్చిన జెసిబిలను, లారీలను వెంటనే వెనక్కి పంపించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లంక భూముల్లో మట్టి తరలింపు ఆపకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెరుగు లంక భూమిలో చెట్టు కింద పేదలతో కలసి బైఠాయించిన ఎమ్మెల్యే నిమ్మల, ప్రజా సంఘం నాయకులు

ఎస్‌బిఐ ఐదో స్టార్టప్ బ్రాంచి ప్రారంభం

హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బిఐ తన ప్రత్యేకమైన ఐదవ స్టార్టప్ బ్రాంచిను హైదరాబాద్‌లో తెరిచింది. మాదాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ శాఖను సోమవారం ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ ఖారా లాంచనంగా ప్రారంభించారు. స్టార్టప్‌ల అన్ని రకాల అవసరాలను తీర్చేలా ఈ బ్రాంచీని రూపొందించామని దినేష్ ఖారా తెలిపారు. కొత్త శాఖా ఏర్పాటు సందర్భంగా స్టార్టప్ ఔత్సాహికవేత్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల కల్పనలో కీలక పాత్ర పోశిస్తున స్టార్టప్‌ల పట్ల తాము అంకితభావన్ని కలిగి ఉన్నామన్నారు. ఈ శాఖ స్టార్టప్ విత్త, విత్తయేతర అవసరాలను తీర్చనున్నాయని వెల్లడించారు. మరిన్ని యూనికర్న్‌ల వృద్ధికి మద్దతును అందించనుందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా నాలుగు సంస్థలకు రూ.50 లక్షల చొప్పున అందించారు.

వారంలో రూ.80వేల కోట్ల డిపాజిట్లు

బ్యాంక్‌ల్లో రూ.2వేల నోట్ల జమ

న్యూఢిల్లీ : రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించిన వారం రోజుల్లోనే రూ.80,000 కోట్ల విలువ చేసే ఈ పెద్ద నోట్లు బ్యాంక్‌ల్లో జమ అయ్యాయి. ఈ కరెన్సీ మార్పిడికి నాలుగు నెలలు సమయం ఉండటంతో రూ.3.6 లక్షల కోట్ల మొత్తం కూడా తిరిగి బ్యాంక్‌లకు రావొచ్చని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్‌బిఐ గణంకాల ప్రకారం.. రూ.2వేల నోట్ల డిపాజిట్లతో మే 26 నాటికి దేశంలోని మొత్తం నగదు చెలామణి రూ.34.41 లక్షల కోట్లకు తగ్గింది. వచ్చే కొన్ని వారాల్లో మరింత తగ్గొచ్చని అంచనా. తమ వద్ద రూ.14,000 కోట్ల డిపాజిట్లు, రూ.3,000 కోట్ల విలువ చేసే రూ.2వేల నోట్ల మార్పిడి జరిగిందని ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ ఖారా ఇటీవల తెలిపారు. పెద్ద నోట్లు మొత్తం తమ వద్ద రూ.80వేల కోట్ల మేర డిపాజిటు అయ్యే అవకాశం ఉందని ఆ బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తం కరెన్సీలో 10-15 శాతం వరకు రూ.2వేల నోట్లు వాటా కలిగి ఉన్నాయి.

భారత్‌లో వర్జిన్ అట్లాంటిక్ విస్తరణ

బెంగళూరు : భారత్‌లో తన సేవలను విస్తరిస్తున్నట్లు విమానయాన సంస్థ వర్జిన్ అట్లాంటిక్ వెల్లడించింది. లండన్ హీత్రూ నుండి బెంగళూరుకు రోజువారీ విమానయానంతో వినియోగదారులకు గతంలో కంటే ఎక్కువ ఎంపికలను అందిస్తోన్నట్లు తెలిపింది. 2019 నుండి వర్జిన్ అట్లాంటిక్ భారత్‌లో తమ సామర్థ్యాన్ని 250 శాతం పెంచినట్లు పేర్కొంది. బ్రిటన్, భారత్ మధ్య ప్రతీ ఏడాది దాదాపు 500,000 సీట్లను అందిస్తూ.. దేశం పట్ల తమ నిబద్ధతను చాటుతున్నట్లు పేర్కొంది. వర్జిన్ అట్లాంటిక్ 2023 అక్టోబర్ 28వ తేదీ నుండి లండన్ హీత్రూ నుండి దుబాయ్ వరకు సీజనల్ శీతాకాల సేవలను, 2024 జూన్ 3వ తేదీ నుండి మాంచెస్టర్ నుండి లాస్ వెగాస్ వరకు సీజనల్ సమ్మర్ సర్వీస్, 2022 మే 13వ తేదీ నుండి సావో పాలోకు రోజువారీ సేవలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.

జీడికి మద్దతు ధర ప్రకటించండి

లేదంటే దశలవారీ పోరాటం

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం)

80 కిలోల జీడి బస్తాకు రూ.16 వేలు ప్రకటించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జీడి రైతుల సంఘం ఆధ్వర్యాన జీడి రైతులు శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ బస్టాండ్ మూడు రోడ్ల జంక్షన్ వరకు సోమవారం నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు.జీడి పంటకు మద్దతు ధర ప్రకటించే వరకూ దశల వారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడారు.

రైతుభరోసా కేంద్రాల ద్వారా జీడిపిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించకపోవడంతో జీడి రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలాస జీడి వ్యాపారులు సిండికేట్‌గా మారి రాష్ట్రంలో జీడి వ్యాపారాన్ని శాసిస్తున్నారని విమర్శించారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, వ్యాపారులకు మద్దతిచ్చి రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. జీడిపిక్కల ధరలు రోజురోజుకూ తగ్గుతుంటే పప్పు ధర మాత్రం పెరుగుతోందని తెలిపారు. జీడి రైతులకు బస్తాకు అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తామని మంత్రి సీదిరి అప్పలరాజు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. పలాస కేంద్రంగా జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, జీడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేసి నాణ్యమైన మొక్కలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, జీడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న జీడి రైతులు

ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

అప్పులు తీర్చలేక బలవన్మరణం!

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

తుపాకీతో కాల్చుకుని ఎస్‌పిఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం ఒంగోలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చీమకుర్తికి చెందిన ఎం. వెంకటేశ్వర్లు (35) 2013లో ఎస్‌పిఎఫ్‌కు ఎంపికయ్యారు. నగరంలోని యూనియన్ బ్యాంక్ చెస్ట్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో మధ్యాహ్నం తన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ (సెల్ఫ్ లోడెడ్ రివాల్వర్)తో కాల్చుకున్నాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పులు తీర్చలేకే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కియా సెల్టోస్ ఐదు లక్షల యూనిట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ : కియా ఇండియాకు చెందిన ఎస్‌యువి సెల్టోస్ కేవలం 46 నెలల్లో ఐదు లక్షల యూనిట్ల అమ్మకాల మైలురాయిని చేరినట్లు వెల్లడించింది. ఆగస్ట్ 2019లో భారత్‌లో తమ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు ఆ కంపెనీ తెలిపింది. స్వల్ప కాలంలోనే రికార్డ్ అమ్మకాలతో దేశంలో గర్వకారణంగా నిలిచినట్లు పేర్కొంది. ఇది వినియోగదారుల నమ్మకం, మనస్సును దోచుకుందని అభిప్రాయపడింది. మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా, మధ్య దక్షిణ అమెరికా, మెక్సికో, ఆసియా పసిఫిక్ ప్రాంతం సహా సుమారు 100 విదేశీ మార్కెట్స్‌కు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపింది.

స్టోన్‌లామ్ నుంచి వినూత్న ఆర్కిటెక్చరల్ ఉత్పత్తులు

హైదరాబాద్ : ఇంటీరియర్‌లలో మూడు మిల్లీమీటర్ సన్నని స్లాబ్‌ల కోసం భారతదేశంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న స్టోన్‌లామ్ ఆర్కిటెక్చరల్ మెటీరియల్స్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. అత్యాధునిక మూడు మిల్లీమీటర్ల సన్నని పింగాణీ స్లాబ్‌లతో, హోటళ్లు, వాణిజ్య ప్రాంగణాలు, నివాస సముదాయాలు, వ ౹ ని ్ర టా లి టో ప్రదేశాలలో సహా విస్తృత శ్రేణి భవనాలలో బాహ్య ఫసడ్స్ క్లాడింగ్ కోసం స్టోన్‌లామ్ విభిన్నమైన పరిష్కారాన్ని అందిస్తుందని స్టోనెక్స్ గ్రూప్ మార్కెటింగ్ చీఫ్ సుశాంత్ పాఠక్ తెలిపారు. ఈ స్లాబ్‌లు ఆల్గే, శిలీంధ్రాలు, మోల్డ్, బ్యాక్టీరియా పెరుగుదలకు నిరోధకతను కలిగి ఉంటయని, థర్మల్ షాక్‌కు విశేషమైన ప్రతిఘటనను ప్రదర్శిస్తాయన్నారు.

బజాజ్ ఫైనాన్స్‌తో టయోటా కిర్లోస్కర్ ఒప్పందం

బెంగళూరు : బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) వెల్లడించింది. టయోటా వాహనాన్ని కొనుగోలు చేసే ప్రక్రియను మరింత సౌకర్యవంతంగా, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి, మెరుగైన రిటైల్ ఫైనాన్స్ ఎంపికలను అందించడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేయనుందని తెలిపింది. బజాజ్ ఫినాన్స్ తమ ఖాతాదారులకు సమగ్ర ఆర్థిక పరిష్కారాలను అందించడానికి ముందుకు వచ్చిందని వెల్లడించింది. దేశంలోని 89 కీలక ప్రదేశాలలో ఫినాన్సింగ్ సేవలను అందించనుందని పేర్కొంది.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada-520002 (A.P.)

E PROCUREMENT TENDER NOTICE

NIT No. 06 /MAU61-USI0HB(OTH)/52/2023-HB Dated: 01.06.2023

Name of Work: "Providing Waterproofing treatment for terrace of AP High Court Building, Nelapadu" - **Estimate Amount: Rs.75.00 Lakhs.**

The bid can be downloaded on **AP e-procurement portal** from **09.06.2023 to 23.06.2023 up to 14.00 Hrs.** Due date for submission of Bid **23.06.2023 up to 15.00 Hrs,** Technical bid opening **23.06.2023 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION VISAKHAPATNAM

Short Tender Notice No. : 03/2023-24/SE(PL&C)/EE(PL&C)/GVMC, Date : 25-05-2023 (7 Days)

01.	No. of Works	01 No (One)
02.	Value of Work (ECV)	Rs. 1,27,78,927/-
03.	Down Loading Starting Date	26-05-2023 @ 07.00 PM
04.	Down Loading End Date	07-06-2023 @ 02.00 PM
05.	Last Date of Submission of bid	07-06-2023 @ 02.30 PM
06.	Date of Opening Tenders	07-06-2023 @ 03.00 PM

Further details at http://www.apeprocurement.gov.in
O/o the Executive Engineer (PL&C), GVMC
For COMMISSIONER, GVMC

సంపాదకీయం

నెత్తుటి పట్టాలు

ఒడిశా బాలేశ్వర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం సంభవించిన ఘోర రైలు ప్రమాదం మాటలకందని విషాదం. మూడు రైళ్ల ఢీకొన్న భీతావహానికి 275 మంది మరణించగా 1,200 మంది వరకు క్షతగాత్రులయ్యారని అధికారిక ప్రకటన. చికిత్స పొందుతున్న వారిలో వందల మంది పరిస్థితి విషమంగా ఉంది. ఈ లెక్కలపై అనుమానాలున్నాయి. ఘటనా ప్రదేశంలో శవాల గుట్టలు, గుర్తుపట్టవీల్లేని మృతదేహాలు ఘోరకలి తీవ్రతను తెలియజేస్తాయి. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే విషయం స్పష్టం కానప్పటికీ షాలీమార్ నుంచి చెన్నై వెళుతున్న కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అకస్మాత్తుగా లూప్‌లైన్‌లోకి మారి ఆగివున్న గూడ్స్‌రైలును ఢీకొట్టింది. దాంతో కోరమండల్ బోగీలు కొన్ని పట్టాలు తప్పగా కొన్ని పక్కనే ఉన్న ట్రాక్‌పై ఎగిరి పడ్డాయి. అప్పుడే అదే ట్రాక్‌పై బెంగళూరు నుంచి హౌరా వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కోరమండల్ బోగీలను ఢీకొట్టి పట్టాలు తప్పింది. సిగ్నల్ లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక రిపోర్టు. సహాయక చర్యలు నాల్గవ రోజు కూడా కొనసాగాయి. ప్రధాని మోడీ, రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, తదితరులు ప్రమాద స్థలాన్ని సందర్శించి యథామామూలుగా ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించారు. ప్రాథమిక విచారణలో కుట్ర కోణం అనుమానం వచ్చినందున సిబిఐ దర్యాప్తునకు సిఫారసు చేశామన్నారు.

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సమగ్ర విచారణ జరిపించి కారణాలు వెలికితీసి బాధ్యులను శిక్షించడం, అటువంటివి పునరావృతం కాకుండా పటిష్టంగా తాత్కాలిక, శాశ్వత చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత. కాగా దర్యాప్తు పూర్తికాకమునుపే ఏవోకొన్ని ఊహాగానాలు ప్రచారం చేసి అసలు విషయాన్ని పక్కదారి పట్టించడం మోడీ గణానికి రివాజుగా మారింది. కోరమండల్ రైలు ప్రమాదంలోనూ అదే ధోరణి కనబర్చారు ప్రధాని, రైల్వే మంత్రి. ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలో పాయింట్ మెషీన్ సెట్టింగ్‌లను ఎవరో మార్చారని, కుట్ర, విధ్వంస కోణంగా పేర్కొని ప్రభుత్వ వ్యవస్థాపర వైఫల్యాలను కప్పెట్టేందుకు ఒడిగట్టారు. రైల్వేల భద్రత విషయంలో మోడీ ప్రభుత్వం ఎంతగా ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని పాటిస్తున్నదో రైలు ప్రమాదాలపై 2022లో విడుదల చేసిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక కుండబద్దలు కొట్టింది. దాదాపు రైలు ప్రమాదాలన్నీ పట్టాలు తప్పడం వల్లనే సంభవిస్తున్నాయని, పట్టాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాల్సి ఉండగా, 2017లో ప్రత్యేకంగా నెలకొల్పిన రాష్ట్రీయ రైలు రక్షణ నిధి నుంచి నిధులు తగ్గించిన వైనాన్ని కాగ్ ఎత్తి చూపింది. అలాగే రైల్వేలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రిపోర్టు ప్రకారం రైలు ప్రమాదాలపై రైల్వే సేఫ్టీ కమిషనర్ దర్యాప్తు చేసి సమర్పించిన నివేదికలపై ఎలాంటి చర్యలూ లేవు. యాక్షన్ టేకెన్ రిపోర్టులు 2014 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఇదీ ప్రయాణీకుల ప్రాణాల భద్రతపై మోడీ ప్రభుత్వానికున్న శ్రద్ధ.

కేంద్రంలో బిజెపి వచ్చాక రైల్వేల ప్రైవేటీకరణ దూకుడుగా జరుగుతోంది. వందల ప్రైవేటు రైళ్లొచ్చాయి. అదానీ వంటి కార్పొరేట్లకు రైల్వే ఆస్తులు ధారాదత్తమవుతున్నాయి. రైల్వే ప్రత్యేక బడ్జెట్ ఎగిరిపోయింది. ప్యాసింజర్ రైళ్లు రద్దవుతూ వందేభారత్, బుల్లెట్, స్పీడ్ ట్రైన్లు ప్రవేశపెడుతున్నారు. రైల్వేలలో మూడు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రైల్వేల ద్వారా రోజుకు రెండున్నర కోట్ల మంది గమ్యస్థానాలకు చేరుతున్నారు. రైల్వేల ద్వారా ఏడాదికి రూ.2.40 కోట్ల ఆదాయాన్ని మోడీ ప్రభుత్వం ఆర్జిస్తూ, ప్రయాణీకుల భద్రతకు ఏడాదికి రూ.5 వేల కోట్లు కూడా కేటాయించలేకపోతోంది. రైల్వే ప్రమాదాలను మానవ తప్పిదంగానో, కుట్రగానో చెప్పడం తప్పించుకొనే ఎత్తు. ప్రపంచంలోనే అతి పెద్ద రవాణా వ్యవస్థ మన రైల్వే. అత్యధిక ఉద్యోగులు పని చేస్తున్న సంస్థగా కూడా మన రైల్వేలకు పేరుంది. రైల్వేలపట్ల ప్రభుత్వ విధానాల్లో మార్పు రానంత వరకు ప్రయాణీకుల ప్రాణాలు గాలిలో పెట్టిన దీపాల చందమే. ప్రమాదానికి బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలి. ప్రభుత్వం కోరమండల్ ఘోరకలిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు చేపట్టాలి.

మహనీయుల మాట

ప్రజలలో కనిపించే వెనుకబాటు భావాలకూ ఇతర వెనుకబాటు లక్షణాలకూ వ్యతిరేకంగా పోరాడాలి. అప్పుడు మాత్రమే మనం ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచగలం. దోపిడీ వర్గాలను ఓడించేందుకు వారిని ఐక్యపరచగలం.

- లీ షావ్‌చీ

ప్రపంచీకరణ క్రమం తిరుగుముఖం పడుతోందా?

ప్రభాత్ పట్నాయక్

చాలామంది ఆర్థికవేత్తలు ఈ మధ్య ప్రపంచీకరణ క్రమం రివర్స్ అవుతున్న క్రమం గురించి (డి-గ్లోబలైజేషన్) చర్చిస్తున్నారు. నిన్నటి కాలపు నయా ఉదారవాద వ్యవస్థ ఇప్పుడిక ఎంతమాత్రమూ కొనసాగడంలేదని మరికొందరు అంటున్నారు. "ఒకే నదిలో రెండు సార్లు అడుగుపెట్టలేము" అని గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ ఎప్పుడో అన్నట్లు ప్రపంచంలో ప్రతీదీ ఎల్లకాలమూ ఒకేవిధంగా కొనసాగలేదు. అదేమాదిరిగా నయా ఉదారవాద విధానంలో కూడా కాలం గడుస్తున్నకొద్దీ మార్పులు జరగడం అనివార్యం. అయితే వర్తమాన ప్రపంచంలోని ఆర్థిక వాస్తవికతను గ్రహించి దానిని మార్చడానికి ప్రయత్నించడం ఇప్పుడిక అవసరం లేదా? నయా ఉదారవాద వ్యవస్థను మనం ప్రత్యేకంగా పూనుకుని మార్చనవసరం లేదా?-ఇదీ అసలు ప్రశ్న.

ప్రపంచీకరణ అంటే ఏమిటి? ప్రపంచంలోని వివిధ దేశాలు కలిసికట్టుగా ముందుకు వచ్చి అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉండేటట్లు ఒక ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవడమే ప్రపంచీకరణ అని మనం ఎన్నడూ భావించలేదు. ప్రస్తుతం దాదాపు 50 దేశాలు రకరకాల "ఆంక్షలను" చవిచూస్తున్నాయి. ఆ ఆంక్షల వలన ఆ యా దేశాలకు అవసరమైన సరుకులను ప్రపంచ మార్కెట్‌లో అవి పొందడానికి అవకాశం లేకుండా పోయింది. ప్రాణాలను కాపాడే ఔషధాలను సైతం ఆ దేశాలు పొందడానికి ఇప్పుడు సాధ్యం కావడం లేదు. ప్రంచీకరణ క్రమం పూర్తిస్థాయిలో "మంచి ఊపు మీద ఉన్న కాలంలో", అంటే ఒక దశాబ్దం క్రితం కూడా ఈ విధమైన ఆంక్షలను ఎదుర్కొనే దేశాల సంఖ్య ఇప్పుడున్న మోతాదులోనే ఉండింది.

"ప్రపంచీకరణ" గురించి సాధారణంగా చెప్పుకునే అర్థం వేరు, దాని వాస్తవ స్వభావం వేరు. ప్రపంచీకరణ అంటే ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలలోకి పెట్టుబడి, ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి యథేచ్ఛగా సంచరించగలిగే పరిస్థితిని కల్పించే దశ. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒకానొక దశ. అది ఆ యా దేశాలు (జాతి రాజ్యాలు) తమకు నచ్చిన విధంగా తమ ఆర్థిక వ్యవస్థను నడిపించడానికి జోక్యం చేసుకునే శక్తిని ప్రపంచీకరణ బాగా కుదించివేసింది. తన ఆమోదం లేని విధానాలను ఆ యా దేశాలు అనుసరించే వీలు లేకుండా ప్రపంచీకరణ చేసింది. అన్నింటికీ మించి ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా చేసే పెత్తనానికి సంపన్న పెట్టుబడిదారీ దేశాలు పూర్తి మద్దతునిస్తున్నాయి. మరీ ముఖ్యంగా అమెరికా ప్రపంచీకరణ క్రమానికి లోబడని దేశాల మీద ఆంక్షలు విధించడం ద్వారా తక్కిన అన్ని దేశాలూ తమ దారిలోకి వచ్చేలా చేస్తున్నది.

అందుచేత ప్రపంచీకరణ అంటే పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని మళ్ళీ ఈ ప్రపంచంమీద రుద్దే క్రమం అని అర్థం చేసుకోవాలి. అయితే, సోషలిస్టు దేశాల మీద ఆవిధంగా రుద్దడం సాధ్యం కావడం లేదు. కాని, సామ్రాజ్యవాదుల వలస పాలన నుండి 20వ శతాబ్దపు నడిమి కాలంలో విముక్తి పొందిన దేశాల మీద ప్రపంచీకరణను రుద్దగలిగారు. ఆ దేశాలలో పెట్టుబడిదారీ విధానాన్ని బలపరిచే ఆర్థిక విధానాలనే చేపట్టినప్పటికీ, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ప్రజా సంక్షేమ విధానాలను అమలు చేస్తూ కొంతమేరకు పెట్టుబడిని నియంత్రిస్తూ వుండే విధానాలను అనుసరిస్తూ వుండేవి. ఇప్పుడు అక్కడ ఆ విధానాలను కొనసాగించడానికి ప్రపంచీకరణ ఒప్పుకోవడం లేదు. మూడవ ప్రపంచపు సోషలిస్టేతర దేశాలలో సామ్రాజ్యవాదానికి పూర్తిగా లోబడి పోకుండా కొంతమేరకైనా స్వయంప్రతిపత్తితో వ్యవహరించగల అవకాశాలను ప్రపంచీకరణ పూర్తిగా తొలగించింది. పెట్టుబడి ఎటువంటి ఆంక్షలూ లేకుండా యథేచ్ఛగా ప్రపంచం మొత్తం మీద సంచరించడం అంటే దాంతోబాటు సరుకులు, సేవలు కూడా దేశాల ఎల్లలతో నిమిత్తం లేకుండా యథేచ్ఛగా సంచరించడం (ఆంక్షలకు గురైన దేశాలు తప్ప).

ఐతే ఈ ప్రపంచీకరణ కాలంలో కొన్ని దేశాలు కొత్తగా ఆర్థిక శక్తులుగా బలపడ్డాయి. వాటివలన తమ ఆధిపత్యం దెబ్బ తింటుందన్న భయం పశ్చిమ సామ్రాజ్యవాద వేశాలకు పట్టుకుంది. ఈ కొత్తగా బలపడిన దేశాలలో రష్యా ఒకటి. సోవియట్ యూనియన్ గా ఉండిన కాలంలో నిర్మితమైన ఉత్పత్తి పునాది బ్రహ్మాండమైన స్థాయిలో ఉండేది. అది రష్యాకు వారసత్వంగా సంక్రమించింది. బోరిస్ ఎల్సిన్ అధికారంలో ఉన్న కాలంలో రష్యాను తాము లొంగదీసుకోగలిగామని సామ్రాజ్యవాద దేశాలు భావించాయి. కాని బోరిస్ ఎల్సిన్ దిగిపోయాక రష్యా నూతన నాయకత్వం తమ దేశపు సత్తా ఏమిటో చూపడం మొదలుపెట్టింది. మరోవైపున చైనా ప్రపంచీకరణ క్రమాన్ని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలను బట్టి గాక తనకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా అమలు చేయడంతో చాలా వేగంగా అభివృద్ధిని సాధించింది. ముఖ్యంగా సంపన్న పాశ్చాత్య దేశాల మార్కెట్ తనకు అందుబాటులో ఉండడం దీనికి తోడ్పడింది.

ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యాపై ఆంక్షలు విధంచారు. పశ్చిమ దేశాలు చైనాతో జరిపే వాణిజ్యం తగ్గిపోయింది. చైనా పట్ల పశ్చిమ దేశాలు రాజకీయంగా అనుసరించిన వైఖరి దీనికి ఒక ముఖ్య కారణం. ఆ విధమైన వైఖరిని, పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా అనుసరించడానికి అనేక కారణాలు ఉన్నాయి. తన దేశంలో ఉపాధి అవకాశాలను కాపాడుకోవడం (నిజానికి చైనా నుండి అమెరికా దిగుమతి చేసుకునే సరుకులలో అత్యధిక భాగం అమెరికా అక్కడ పెట్టిన ప్రత్యక్ష పెట్టుబడులతో ఉత్పత్తి అయ్యేవే ఉంటాయి), చైనా మీద ఎక్కువగా ఆధారపడవలసిన పరిస్థితిని నివారించడం వంటి కారణాలు ఉన్నాయి. ఇక తక్కిన పశ్చిమ దేశాలకు అదనంగా తోడయిన కారణం వాటపై అమెరికా చేస్తున్న ఒత్తిడి.. వీటన్నింటిలోకీ, చైనా మీద మరీ అతిగా ఆధారపడకూడదు అన్నదే ప్రధాన కారణం.

జార్జి బుష్ (జూ) దేశాధ్యక్షుడుగా ఉన్న నాటి నుంచీ ఈ ఆందోళన అమెరికాకు మొదలైంది. చైనా నుండి దిగుమతులు పెరిగిపోతూండడంతో జార్జిబుష్ యువాన్-డాలర్ మారకం రేటును పెంచాలని ఒత్తిడి చేయడానికి ప్రయత్నించాడు. ఒబామా హయాంలో కూడా ఈ వైఖరి కొనసాగింది. విదేశాలకు తమ పరిశ్రమలను తరలించాలని ప్రయత్నించిన అమెరికన్ కంపెనీలపై ఒబామా అపరాధ రుసుం విధించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కాలంలో దిగుమతుల మీద అదనపు సుంకాలను విధించి తద్వారా దేశీయ ఉత్పత్తులను కాపాడడానికి ప్రయత్నించాడు. ఈ అదనపు సుంకాల తాకిడి తక్కిన దేశాలకన్నా చైనాకే ఎక్కువగా తాకింది.

చైనాతో తమ వ్యాపారాన్ని తగ్గించుకోడానికి పశ్చిమ దేశాలు చేసే ప్రయత్నాల వెనుక ఉన్న రాజకీయ కారణాలు అర్థం కావడానికి రెండు ఉదాహరణలు ప్రస్తావిస్తాను. యూరప్‌లో కర్బన ఉద్గారాలను తగ్గించుకోడానికి చేసే ప్రయత్నాలలో భాగంగా సౌర విద్యుత్తు ఉత్పత్తిని పెంచడానికి నిర్ణయించుకున్నారు. అందుకు అవసరమైన సోలార్ పానెళ్లను దిగుమతి చేసుకోవలసిన అవసరం వచ్చింది. అప్పుడు యూరోపియన్ యూనియన్ ఒక నిబంధనను రూపొందించింది. ప్రపంచ మార్కెట్ లో 65 శాతానికి మించి వాటా ఉన్న ఏ దేశం నుండీ సోలార్ పానెళ్లను యూరోపియన్ దేశాలు దిగుమతి చేసుకోరాదు అన్నదే ఆ నిబంధన. ఈ నిబంధన కేవలం చైనాను దృష్టిలో పెట్టుకునే రూపొందింది. అప్పటికి చైనా అంతర్జాతీయ మార్కెట్ లో సోలార్ పానెళ్ల ఉత్పత్తిలో 85 శాతం వాటా కలిగి వుంది. దానికి కారణం వాటిని చైనా చాలా చౌకగా సరఫరా చేయడమే. చైనా నుండి వాటి దిగుమతిని నిషేధించడం కోసం యూరోపియన్ దేశాలు ఎక్కువ ఖరీదుకి ఆ పానెళ్లను ఇతర దేశాల నుండి కొనుగోలు చేయడానికి సైతం సిద్ధపడ్డాయి. ఇది కేవలం ప్రపంచ రాజకీయాల బలాబలాలను దృష్టిలో ఉంచుకుని చేసిన రాజకీయ నిర్ణయం అని స్పష్టంగా కనిపిస్తోంది.

అదే మాదిరిగా బైడెన్ ప్రభుత్వం చైనాకు సెమి కండక్టర్ల ఎగుమతిని నిషేధించింది. ఈ నిషేధాన్ని అమెరికన్ కార్పొరేట్లు సైతం వ్యతిరేకించారు. చైనాలో నడుస్తున్న, నిర్మాణంలో ఉన్న హైటెక్ పరిశ్రమలకు, మిలిటరీ టెక్నాలజీకి, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీకి ఈ సెమి కండక్టర్లు కీలకం. అమెరికన్ కార్పొరేట్లకు ఆ సెమి కండక్టర్ల ఎగుమతులు బాగా లాభాలను ఆర్జిస్తాయి. ఐనా సరే, బైడెన్ ప్రభుత్వం చైనాకు వాటిని ఎగుమతి చేయకుండా నిషేధించింది. దీనివెనుక కేవలం అమెరికా అనుసరించే ప్రపంచాధిపత్య రాజకీయాలే ప్రధాన కారణం. చైనాను ఆర్థికంగా, సాంకేతికపరంగా నిస్సహాయ స్థితికి నెట్టాలన్నదే అమెరికా వ్యూహం. చైనా మీద ప్రస్తుతం ఎటువంటి ఆంక్షలనూ అధికారికంగా ప్రకటించలేదు. కాని ప్రస్తుతం మనం ఆ దేశం మీద అమెరికా అప్రకటిత ఆంక్షలను అమలు చేయడాన్ని చూస్తున్నాం. కాబోయే కాలంలో అధికారికంగా ఆంక్షలను ప్రకటించినా ప్రకటించవచ్చు. ఆ ఉద్దేశ్యం అయినా ఉండాలి. లేదా కనీసం చైనాను బలహీనపరచాలన్న ఉద్దేశ్యం అయినా ఉండి వుండాలి

చైనా పట్ల పశ్చిమ దేశాలు ప్రదర్శిస్తున్న వివక్షత ఎటువంటి ప్రభావం చూపనుంది అన్న అంశం ప్రపంచీకరణ క్రమం తిరుగు ముఖం పట్టిందన్న ప్రస్తుత చర్చకు దారి తీసింది. చైనా మీద అతిగా ఆధారపడకూడదు అన్న పశ్చిమ దేశాల ప్రయత్నాలు తమ వ్యాపారాలను ఇతర దేశాల వైపు ఎక్కువగా మళ్ళించడానికి దారి తీస్తున్నాయి. ఆ విధంగా చేయడం వలన ఎక్కువ ధరలను చెల్లించవలసి వస్తుంది. అయినా పశ్చిమ దేశాలు ఆ వైఖరినే తీసుకున్నాయి. అమెరికా చైనాతో చేసే వ్యాపారం ప్రసస్తుతం తగ్గిపోడానికి ఇదే కారణం. పశ్చిమ దేశాలు ఆంక్షలను విధించిన దేశాల జాబితాలో చైనా కూడా చేరిపోయినట్టే కనిపిస్తోంది.

ప్రపంచీకరణ క్రమం ఏ మోతాదులో కొనసాగుతోంది అన్నది అంచనా వేయడానికి ఆర్థికవేత్తలు కొన్ని స్థూల ప్రాతిపదికలను పరిశీలిస్తారు. మొత్తం ప్రపంచ జిడిపి కి, ప్రపంచం మొత్తం మీద జరిగే దిగుమతులకు మధ్య ఉండే నిష్పత్తి అటువంటి ఒక ప్రాతిపదిక. ఆ నిష్పత్తి ఏమీ తగ్గుముఖం పట్టలేదు. మహా అయితే ప్రపంచీకరణ వేగం తగ్గింది అని చెప్పగలమేమో కాని ప్రపంచీకరణ ఏకంగా తిరుగు ముఖం పట్టిందని మాత్రం చెప్పలేం.

ప్రపంచీకరణ అంటే ప్రపంచ దేశాలు అంతకంతకూ ఒకదాని మీద ఇంకొకటి మరింత ఎక్కువగా ఆధారపడే క్రమం అన్న అభిప్రాయానికి మన దృష్టిలో అంత ప్రాధాన్యత లేదు. ఇది ప్రధానంగా అధికారానికి సంబంధించిన సంబంధం. ఆ అధికారాన్ని ఉపయోగించి, అవసరమైతే ఆంక్షలను ప్రయోగించి అన్ని దేశాలనూ ప్రపంచీకరణ చట్రంలోకి లాగడం. ఈ విధంగా అధికారాన్ని ఉపయోగించడం సామ్రాజ్యవాదపు స్వభావానికి నిదర్శనం. ప్రపంచీకరణ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యాన్ని స్థిరపరిస్తే, ఆంక్షలు సామ్రాజ్యవాదపు కర్కశత్వాన్ని సూచిస్తున్నాయి.. ప్రస్తుతం తిరుగుముఖం పడుతోందని చెప్పున్న ప్రక్రియ వాస్తవానికి ప్రపంచీకరణకు వ్యతిరేకం కాదు. అది నిజానికి ఆ ప్రపంచీకరణకు తోడుగా సాగుతున్న ఒక క్రమం.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రధానంగా సంపన్న పశ్చిమ దేశాల నుండే వస్తుంది. ఆ దేశాల కార్యకలాపాలతో ముడిపడిపోయి వుంటుంది. అందుచేత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం అంటే సంపన్న పశ్చిమ దేశాల ఆధిపత్యమే తప్ప మరొకటి కాదు. ఈ ఆధిపత్యం ప్రపంచ ప్రజలందరి మీదా చెలాయించడం జరుగుతుంది. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద చెలాయిస్తున్నారు.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రధానంగా సంపన్న పశ్చిమ దేశాల నుండే వస్తుంది. ఆ దేశాల కార్యకలాపాలతో ముడిపడిపోయి వుంటుంది. అందుచేత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం అంటే సంపన్న పశ్చిమ దేశాల ఆధిపత్యమే తప్ప మరొకటి కాదు. ఈ ఆధిపత్యం ప్రపంచ ప్రజలందరి మీదా చెలాయించడం జరుగుతుంది. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద చెలాయిసున్నారు. ప్రపంచీకరణకు మూడవ ప్రపంచ దేశాల లోని బడా బూర్జువా వర్గం మద్దతు పలకవచ్చు. ఉన్నత ఆదాయ వర్గాల వారు, డాక్టర్లు, లాయర్లు తదితర ప్రొఫెషనల్స్ కూడా మద్దతు పలకవచ్చు. కాని మూడో ప్రపంచ దేశాలలోని కార్మికుల మీద, రైతాంగం మీద, చిన్న ఉత్పత్తిదారుల మీద ప్రపంచీకరణ క్రమం తన అణచివేతను సాగిస్తుంది.

తమపై సాగే అణచివేత నుండి బైట పడడానికి ఈ తరగతుల ప్రజలు చేపట్టవలసిన కార్యాచరణ ఒక దశాబ్దం క్రితం ఏ స్వభావాన్ని కలిగివుందో ఇప్పుడూ అదే స్వభావాన్ని కలిగివుంది. శ్రామిక ప్రజానీకపు జీవితాల్లో ఏ విధమైన మెరుగుదల అయినా రావాలంటే అందుకు ప్రభుత్వం జోక్యం కల్పించుకోవడం తప్పనిసరి. తమ దేశం నుండి పెట్టుబడి బైటకు తరలిపోతుందనే భయానికి తావు లేకుండా ప్రభుత్వం జోక్యం కల్పించుకోగలిగే అవకాశం ఉండాలి. కాని ఒక దేశంలోకి పెట్టుబడుల రాక, పోక యథేచ్ఛగా సాగిపోతూ వుండాలి అన్న షరతు ఉనికిలో ఉన్నంత కాలమూ ప్రభుత్వానికి ప్రజల జీవితాలను మెరుగుపరిచే జోక్యం చేసుకునే అవకాశం ఉండదు. కనుక పెట్టుబడుల రాకపోకల మీద ప్రభుత్వానికి అదుపు ఉండడం అవశ్యంగా సాధ్యం అయినప్పుడే ప్రభుత్వ జోక్యానికి అవకాశం వస్తుంది.

మరో విధంగా చెప్పాలంటే, శ్రామిక ప్రజల జీవితాలను మెరుగుపరచుకోడానికి ఆ దేశంలో ఏర్పడే ప్రభుత్వ స్వభావం మారితే చాలదు. అంటే, ప్రస్తుత అధికార వర్గాల స్థానంలో కార్మిక, కర్షక ప్రజల మద్దతు మీద ఆధారపడిన ప్రభుత్వం ఏర్పడితే సరిపోదు. పెట్టుబడులు స్వేచ్ఛగా ఎక్కడికైనా రాకపోకలు సాగించే విధానంతో ఆ ప్రభుత్వం విడగొట్టుకోగలగాలి. కార్మిక, కర్షక తరగతుల మద్దతు మాత్రమే చాలదు. పెట్టుబడుల రాకపోకలను నియంత్రించగల అధికారం కూడా ఉండాలి. అటువంటి నియంత్రణకు పూనుకుంటే అప్పుడు సామ్రాజ్యవాదం విధించే ఆంక్షలను ఎదుర్కోవలసి వస్తుంది.

ఒక దశాబ్దం వెనుక కూడా ఇదే పరిస్థితి. ఇప్పుడూ అదే కొనసాగుతోంది. ప్రపంచీకరణ క్రమం తిరుగు ముఖం పడుతోందని కొందరు ఆర్థికవేత్తలు అంటున్నదానికి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని ఎదుర్కొనే పోరాటానికి, దాని వెనుక దన్నుగా ఉన్న సంపన్న పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని ఎదుర్కొనే పోరాటానికి ఏ మాత్రమూ సంబంధం లేదు గాక లేదు.

(స్వేచ్ఛానుసరణ)

వ్యాఖ్య

రాజదండం వెనుక కట్టు కథ !



మే 28న కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని 20 ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించాయి. ప్రభుత్వ, పార్లమెంట్ అధినేత అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పక్కకు పెట్టి కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ కారణంతోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. ప్రభుత్వ అధినేతను పార్లమెంట్‌పై బలవంతంగా రుద్దుతూ రాజ్యాంగపరంగా తీసుకున్న అనౌచిత్య చర్య ప్రతిపక్షాల నిరసనకు చట్టబద్ధమైన కారణంగా వుంది.

వాస్తవానికి ప్రారంభోత్సవం రోజున జరిగిన పరిణామాలు ఈ కార్యక్రమానికి దూరంగా వుండాలన్న ప్రతిపక్షాల నిర్ణయాన్ని మరింత బలపరిచాయి. ఆనాడు వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్, జవహర్‌లాల్ నెహ్రూకు అధికారాల బదలాయింపునకు గుర్తుగా అందచేసిన రాజదండాన్ని పార్లమెంట్ లోపల నెలకొల్పనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అకస్మాత్తుగా ప్రకటించారు. అమిత్ షా మాటల్లో చెప్పాలంటే, "పండిట్ జవహర్ లాల్ నెహ్రూకు రాజదండాన్ని అప్పగించడం ద్వారా భారతదేశ అధికార బదలాయింపు జరిగింది." అని పేర్కొన్నారు. ఆ రకంగా బ్రిటీష్ వారి నుండి కొత్త ప్రభుత్వానికి 'అధికార బదలాయింపు'ను సూచించేలా హిందూ మతపరమైన కల్పిత కథనం రూపొందించబడింది.

అధికార బదిలీని ప్రతిబింబించేలా భారతీయ కార్యక్రమం ఏదైనా వుందా అని లార్డ్ మౌంట్‌బాటన్, జవహర్‌లాల్ నెహ్రూను అడిగినట్లు అధికారికంగా తెలియచేయబడింది. అప్పుడు నెహ్రూ, కాంగ్రెస్ నేత రాజగోపాలాచారిని దీని గురించి సంప్రదించగా, ఆయన తమిళనాడు లోని మతపరమైన మఠాలను సంప్రదించి, అధికార బదిలీకి ప్రతీకగా రాజదండం వుండాలని సూచించారు. రాజ్యాంగ నిర్ణాయక సభ అధికారిక సమావేశానికి ముందుగా ఆగస్టు 14వ తేదీ రాత్రి లార్డ్ మౌంట్‌బాటన్ ఆ రాజదండాన్ని నెహ్రూకు అందచేశారని తెలియచేయబడింది.

అయితే, రాజదండం గురించి అసలు వాస్తవం, చరిత్ర ఏమిటి? అధికార బదిలీకి ఉపయోగించే గుర్తు గురించి మౌంట్‌బాటన్, నెహ్రూను అడిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేదా రికార్డులు లేవు. అసలు ఈ విషయంలో రాజాజీ పాత్ర వుందన్నట్లుగా కూడా ఎలాంటి ఆధారం లేదు. వాస్తవానికి, మౌంట్‌బాటన్, నెహ్రూకు రాజదండాన్ని అందచేయలేదు. ఆగస్టు 13వ తేదీ సాయంత్రం మౌంట్‌బాటన్ కరాచి వెళ్ళారు. తిరిగి ఆగస్టు 14వ తేదీ రాత్రి పొద్దుపోయిన తర్వాత వచ్చారు.

రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాలంటూ కొత్తగా నియమితుడైన రాజుకు సాంప్రదాయంగా ప్రధాన మత గురువు అందించే రాజదండమే ఇది. ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య రిపబ్లిక్‌లో ఇటువంటి భావనకే స్థానం లేదు. పైగా పార్లమెంట్‌లో ప్రధాన స్థానంలో ఇటువంటి మతపరమైన చిహ్నాన్ని వుంచడమనేది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్ స్వభావానికే పూర్తి విరుద్ధం.

తమిళనాడు లోని శైవ మఠం ఆధ్వర్యంలో ఈ దండం తయారుచేయబడింది. దాన్ని ఢిల్లీకి తీసుకువచ్చి 14వ తేదీ రాత్రి నెహ్రూ నివాసంలో ఆయనకు అందచేశారు. దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక కార్యక్రమం లేదు, ఇదంతా కేవలం అనధికారిక వ్యవహారం మాత్రమే, ఇతర అనేక బహుమతుల్లాగానే దీన్ని కూడా నెహ్రూ స్వీకరించారన్నది వాస్తవం. తర్వాత దాన్ని అలహాబాద్ మ్యూజియంలో పెట్టారంటేనే నెహ్రూ ఆ విషయాన్ని ఎలా చూశారన్నది అర్థమవుతోంది.

14వ తేదీ రాత్రి ఈ రాజదండాన్ని అప్పగించడం ద్వారా అధికార బదిలీ జరిగిందంటూ కట్టు కథలు చెప్పడాన్ని చూస్తుంటే, హిందూ రాజ్యాన్ని పునరుద్ధరించడం ద్వారా శతాబ్దాల తరబడి సాగిన బానిసత్వ పాలన ఎలా అంతమొందించబడిందో చెప్పడానికి ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి అల్లిన కథనానికి సరిపోతుంది. ఆనాటి నేతలకు కల్పిత పాత్రలను అంటగడుతూ చారిత్రాత్మకంగా దీనికో కథనాన్ని కల్పించడం ద్వారా అధికార బదిలీ కార్యక్రమానికి హిందూ మతం రంగు పులమగలిగారు. ఈ రాజదండం అధ్యాయం కల్పిత గాథను రూపొందించింది ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతికవేత్త ఎస్.గురుమూర్తి. 2021లో తమిళ పత్రికలో దీని గురించి ఆయన రాశారు.

మే 28వ తేదీ ఉదయం ఈ రాజదండాన్ని పట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ మత గురువులు, మతాధిపతుల ప్రదర్శనకు ముందు నడవడం, దాన్ని లోక్‌సభలో సభాపతి కుర్చీ వెనుక ప్రతిష్టించడమన్నది, హిందూ దేశాన్ని అనుకరిస్తూ కొత్త భారతదేశాన్ని ప్రతిష్టించడంలో భాగంగానే వుంది. ఇది లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్ భావజాలానికి పూర్తి విరుద్ధం. రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాలంటూ కొత్తగా నియమితుడైన రాజుకు సాంప్రదాయంగా ప్రధాన మత గురువు అందించే రాజదండమే ఇది. ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య రిపబ్లిక్‌లో ఇటువంటి భావనకే స్థానం లేదు. పైగా పార్లమెంట్‌లో ప్రధాన స్థానంలో ఇటువంటి మతపరమైన చిహ్నాన్ని వుంచడమనేది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్ స్వభావానికే పూర్తి విరుద్ధం.

వి.డి.సావర్కర్ జయంతి అయినందునే మే 28వ తేదీని కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ఎంచుకున్నారు. కొత్త భారతదేశం ఎలా నిర్మించబడుతుందో చెప్పడానికి ఇది కూడా ఒక సంకేతం. తొలుత స్వాతంత్ర్య సమరయోధునిగా పోరాటం మొదలుపెట్టిన సావర్కర్ తదనంతర కాలంలో అండమాన్ సెల్యులార్ జైలు నుండి విడుదలైన తర్వాత బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని విరమించుకున్నాడు. పదే పదే క్షమాభిక్ష కోరుతూ పిటిషన్లు పెట్టుకున్న అనంతరం ఆయనను జైలు నుండి విడుదల చేశారు. ఇక ఆ తర్వాత పూర్వపు పాలకులు, ముస్లింలకు వ్యతిరేకంగా పోరాటం జరపడంపై, హిందూత్వను పునరుద్ధరించడంపై ఆయన తన దృష్టిని మరల్చాడు. ఆయన హిందూత్వ భావనను సమర్థించిన బిజెపి పాలకులు, వేలాది సంవత్సరాల బానిసత్వ పాలనను అంతమొందించడమే హిందూ రాష్ట్ర స్థాపనగా చూశారు.

అదే రోజున, కొత్త పార్లమెంట్ భవనానికి కొద్ది వందల మీటర్ల దూరంలోనే శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న మహిళా రెజ్లర్లను పోలీసులు దారుణంగా ఈడ్చుకెళుతూ అరెస్టు చేశారు. దీంతో ఈ రాజదండం ధర్మపాలనను ప్రతిబింబిస్తుందన్న బిజెపి పాలకుల వాదన ఘోరంగా దెబ్బ తింది.

ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొంటున్న నూతన భారతదేశ చిహ్నాలు...అయోధ్యలో రామాలయ నిర్మాణం, సెంట్రల్ విస్తా, కొత్త పార్లమెంట్ భవనం...ఇవన్నీ కొత్త నిరంకుశ హిందూత్వ రాజ్య లక్షణాలుగా వున్నాయి. ఈ భాష్యానికి అనుగుణంగా చరిత్రను వక్రీకరించడం, సృష్టించడం చేస్తున్నారు.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

ఆచంటలో ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపోయిన ఇళ్లపై రేకులు
- విరిగిపడిన చెట్ల కొమ్మలు
- నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు

ప్రజాశక్తి - ఆచంట (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై భారీ ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండలంలో ఆచంట, కొడమంచిలి, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి తదితర గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగి, పలు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్లు వాలిపోవడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి నుంచి విద్యుత్ అధికారులు సిబ్బంది ఎంతో కష్టపడి సోమవారం మధ్యాహ్నం విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి.

కొడమంచిలి పంచాయతీ పరిధి కుక్కలవారిపాలెంలో సానబోయిన శ్రీనివాస్ ఇటీవలే కొత్తగా ఇల్లు నిర్మించుకున్నారు. ఆదివారం రాత్రి ఆకాల వర్షం, ఈదురుగాలులకు ఇంటిపై కప్పు ఉన్న రేకులు ఎగిరిపోయాయి. ఈ సందర్భంగా ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ పరిశీలించి బాధితులకు భరోసా కల్పించి, ప్రభుత్వం పరంగా నష్టపరిహారం అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ కె.నరసింహరావు పాల్గొన్నారు.

చేనేత వృత్తి పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- పది రోజుల్లో అరకు ఆప్కో దుకాణాన్ని తెరిపిస్తా

: ఆప్కో ఛైర్మన్ చిరంజీవి

ప్రజాశక్తి - అరకులోయ

రాష్ట్రంలో చేనేత వృత్తిని పరిరక్షించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. సోమవారం అరకు లోయను సందర్శించి, మూతపడి ఉన్న ఆప్కో దుకాణాన్ని తెరిపించి పరిశీలించారు. దుకాణం మూతపడటానికి రూ.10 లక్షల నష్టమే కారణమని తెలుసుకుని నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత వృత్తి పరిరక్షణ, లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 1976లో ప్రభుత్వం స్థాపించిన ఆప్కోకు రాష్ట్రవ్యాప్తంగా 950కు పైగా సొసైటీలు ఉన్నాయన్నారు.. ఆప్కోలో కొంతమంది సిబ్బంది అంకితభావంతో పని చేయకపోవడం వల్లే నష్టాలు రావడం బాధాకరమన్నారు. నవరత్నాల్లో భాగంగా 82 వేల మందికి ఏటా రూ.24వేలు చొప్పున ప్రభుత్వం ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుస్తోందన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పనకు పలు ప్రభుత్వ రంగ సంస్థలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్నారు. ఆప్కో నిర్వహణకు ఏటా రూ.18కోట్లు ఖర్చవుతుంటే, ఆదాయం రూ.మూడున్నర కోట్లు మాత్రమే వస్తోందన్నారు. ఆప్కోలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సిసి కెమెరాల నిఘాపెట్టడంతోపాటు ఆన్‌లైన్ బిల్లింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఆప్కోకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయి రూ.మూడు కోట్లను డిసెంబర్ నెలాఖరులోగా చెల్లిస్తామన్నారు. ఆప్కోను నష్టాల నుంచి గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. ఆప్కోలో అమ్మకాలు పెంచేందుకు రాయితీలను పెంచడంతోపాటు, ప్రస్తుతమున్న స్టాక్‌ను క్లియరెన్స్ చేసేందుకు 66శాతం నుంచి 75శాతం వరకు రిబేటు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆప్కోను లాభాలబాట పట్టించేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారు. అయితే ఆప్కోలో ఇంకా ఖాళీలు సుమారు 350 ఇప్పట్లో భర్తీచేసే పరిస్థితి లేదన్నారు. ఆప్కో సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా సంస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటక కేంద్రమైన అరకులో ఆప్కో దుకాణం మూతబడడం బాధాకరమని, దీన్ని పదిరోజుల్లో తెరిపించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ జింక విజయలక్ష్మి, వైసిపి అల్లూరి జిల్లా పద్మశాలి అధ్యక్షులు గడ్డం నర్సింగరావు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సూరిశెట్టి సూరిబాబు, వైసిపి నేతలు సమర్థి రఘునాథ్, పెట్టేలి శుక్ర,సంతోష్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఎక్కడ...!

- 'గడప గడపకూ'లో మహిళ నిలదీత...

ఎమ్మెల్యే వైవిఆర్ ఆగ్రహం

ప్రజాశక్తి-గుత్తి

'ఎక్కడున్నాయి నీ కొడుకులకు ఉద్యోగాలిచ్చేందుకు..ఉంటే కదా ఇచ్చేందుకు..' అంటూ ఓ మహిళపై ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముఖ్యంగా గ్రామానికి చెందిన రంగమ్మ 'సారూ.. నేను కూలికి వెళ్తే రూ.200 మాత్రమే వస్తుంది.. దీంతో నా కుటుంబం గడవడం కూడా కష్టంగా ఉంది.. మాకేమైనా న్యాయం చేయండి.. నా కొడుకులకు ఉద్యోగాలు ఇప్పించి ఆదుకోండి' అంటూ అంటూ ఎమ్మెల్యేను నిలదీసింది. ఇందుకు ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'యాడ ఉన్నాయ్.. ఉద్యోగాలు.. ఉంటే కదా ఇచ్చేకి.. ఉద్యోగాల్లేవు..గిద్యోగాల్లేవు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇందుకు ప్రతిస్పందనగా మహిళ 'ఎందుకు సార్ అలా అంటావ్.. మేము ఎంతో కష్టపడ్డాం.. కనీసం కసువు ఊడ్చే పని అయినా కల్పించండి..' అంటుండగా నిర్లక్ష్యంగా ముందుకు సాగడం బాధాకరం. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, సర్పంచి చిదంబరి, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామ రంగారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో తలపడనున్న మైక్ పెన్స్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోరు మొదలైంది. ఇప్పటికే తాను బరిలో ఉన్నట్లు మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నాయకుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, తానూ రంగంలోకి దిగుతున్నానని మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ తాజాగా వెల్లడించారు. తాను కూడా రంగంలో ఉన్నానని ఫ్లోరిడా గవర్నరు రాన్ డిశాంటిస్ ఇదివరకే ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ నామినేషన్ ఎవరికి దక్కుతుందో ప్రైమరీస్ ఎన్నికల్లో తేలుతుంది. అబార్షన్స్‌పై నిషేధం విధించాలని గట్టిగా వాదించేవారిలో పెన్స్ ఒక్కరు. కన్సర్వేటివ్ విధానాలను అమలు చేయడంలో ముగ్గురూ ముగ్గురే. ఇతర దేశాల్లో సైనిక జోక్యం, అగ్ర రాజ్య ఉగ్ర దాడులు వంటి వాటిలో వీరి మధ్య ఏకాభిప్రాయం ఉంది.

చల్లారని మణిపూర్

- తాజా హింసాకాండలో ముగ్గురి మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాకాండ ఆగడం లేదు. సోమవారం ఉదయం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో చెలరేగిన హింసా కాండలో ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని కాంచ్‌చుప్ ప్రాంతంలో ఈ హింసాకాండ జరిగినట్లు పోలీసులు తెలిపారు. రెండు గ్రూపులకు చెందిన సాయుధులు ఒకరిపై ఒకరి కాల్పులు జరిపారని పోలీసులు చెప్పారు. గాయపడిన వారిని ఇంఫాల్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అలాగే, కాక్‌చింగ్ జిల్లాలోని సెరౌలో జరిగిన హింసాకాండలో నలుగురు గాయపడినట్లు పోలీసులు చెప్పారు. మే 3 నుంచి మణిపూర్‌లో హింసాకాండ చెలరేగుతున్న సంగతి తెలిసిందే. ఆర్మీ చీఫ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా మణిపూర్‌లో పర్యటించినా హింసాకాండా అదుపులోకి రావడం లేదు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - పగిద్యాల

ప్రియుడు మోసం చేశాడని ప్రియురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రాతకోట గ్రామానికి చెందిన వినోద్ కుమార్, కర్నూలుకు చెందిన పద్మావతి కర్నూలులోని మోటార్ సైకిల్ షోరూంలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ ఎనిమిదేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించి ఈనెల 9,10న వివాహ తేదీలు ఖరారు చేశారు. అయితే వినోద్ కుమార్ జూపాడుబంగ్లా మండలం భాస్కాపురం గ్రామానికి చెందిన మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రియురాలు పద్మావతి మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారు. కర్నూలులో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు.

కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తన సమస్య పరిష్కరించడంలో రెవెన్యూ, సర్వే, భూరికార్డుల శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారంటూ మనస్తాపం చెందిన రైతు అనంతపురం కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. యాడికి మండలం, నగరూరు గ్రామానికి చెందిన రైతు అహోబిలేసు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌కు సోమవారం ఉదయం వచ్చాడు. అప్పటికే జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఇతర అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. సదరు రైతు అర్జీ ఇవ్వకుండా కలెక్టరేట్ ఆవరణంలో ఓ మూలన చెట్టుపై ఎక్కి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించాడు. చెట్టు కింద తన భార్య పిల్లలు రోదన అరుపులు చేయడంతో అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు తెలిపారు. కలెక్టరేట్ బీట్ పోలీస్ భగీరథ పరుగులు తీసి ఆ వ్యక్తి ఉన్న చోటుకు వెళ్లాడు. అప్పటికే సదరు రైతు చెట్టు ఎక్కి తాళ్లు సిద్ధం చేసుకుంటున్నాడు. నీ సమస్య పరిష్కరిస్తారు దిగాలంటూ విజ్ఞప్తి చేశారు. దీంతో రైతు కిందకు దిగాడు. పోలీసులు ఆ రైతును జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ వద్దకు తీసుకెళ్లారు. దీంతో రైతు అహోబిలేసు కిందకు దిగి తన సమస్య చెప్పుకొచ్చాడు. 462 సర్వే నెంబర్‌లో 7.48 ఎకరాల సాగు భూమి ఉందని, తన పొలానికి పక్క పొలానికి గట్టు ఉందన్నారు. గట్టుపై చెట్లు పెద్దగా పెరిగి నీడలా ఏర్పడటంతో పంటలు దెబ్బతింటున్నాయని, ఆ చెట్లు తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ చెట్లు తనకు చెందుతాయా, లేక పక్క పొలం వారికి చెందుతాయో తేల్చాలంటూ మండల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులకు అనేక మార్లు అర్జీలు, విజ్ఞప్తులు చేశానన్నారు. అయితే అధికారులు సమస్య పరిష్కరించడం లేదని, విసిగు చెంది ఆత్మహత్య యత్నం చేసినట్లు తెలిపారు. స్పందించిన జేసి సర్వే శాఖ ఏడీని పిలిపించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

విశాఖలో వైసిపి నాయకుల భూ దోపిడీ : అయ్యన్న

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ)

విశాఖ నగరంలో వైసిపి నేతలు విచ్చలవిడిగా భూములు దోచుకున్నారని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఈ భూ దోపిడీ వ్యవహారంపై విజయసాయిరెడ్డి, రాష్ట్ర మంత్రులు సమాధానం చెప్పాలని సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. సిరిపురం జంక్షన్ సిబిసిఎన్‌సి భూముల్లో జరుగుతున్న నిర్మాణ వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం కింద కలెక్టర్ కార్యాలయంలో ఒక దరఖాస్తు, జివిఎంసి కార్యాలయంలో ఒక దరఖాస్తును తాను ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో భూములను వైసిపి నేతలు విచ్చలవిడిగా దోచుకున్నారని, వాటికి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు ఉందని అన్నారు.

విద్యుద్ఘాతానికి మహిళ దుర్మరణం

ప్రజాశక్తి-పత్తికొండ (కర్నూలు)

కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలో ఆదినారాయణ రెడ్డి కాలనీలో విద్యుద్ఘాతానికి మహిళ మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం... శివమ్మ,నారాయణ దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శివమ్మ సోమవారం ఇటుక బట్టీలో పనికి వెళ్లారు. పనిచేస్తుండగా విద్యుత్ తీగలు తెగి పడడంతో శివమ్మకు(32) షాక్ తగిలింది. అక్కడికక్కడే మరణించారు. శివమ్మకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా

మొదటిపేజీ తరువాయి

స్థానికులు అక్కడికి చేరుకొని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొన్నారు. అప్పటికే మిక్కిల నాగమ్మ (55), గరికపూడి మేరమ్మ, (45) గరికపూడి రత్నకుమారి (53), కట్టా నిర్మల (55), గనికపూడి సుహాసిని (35), మామిడి ఝాన్సీ (48) మృతి చెందారు. గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ గనికపూడి సలోమి (55) మరణించారు. మరో 25 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులంతా వ్యవసాయ కార్మికులు. ఘటనా స్థలిని గుంటూరు జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హాఫీజ్ పరిశీలించారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం : మంత్రి అంబటి

ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటిరాంబాబు, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడినవారికి రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు మంత్రి అంబటి ప్రకటించారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.
తేది: 05.06.2023, ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం.:డిఆర్‌ఎమ్/వర్క్స్/బిజెడ్‌ఎ/15/2023
PUB/0587
భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారుడు తరఫున ప్రతీదీ వ్యతిరేకంగా పేర్కొన్న తేదీలకు 15.00 వరకు క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్‌లు ఆహ్వానించడమైనది.
క్ర.సం.: 01. టెండర్ నం.: ఇ-33-ఈస్ట్-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు-పని పేరు: రాయనపాడు- 75 మీ×80మీ. ద్వారా ట్రిమ్పింగ్ షాప్ యొక్క రీ ఫ్లోరింగ్. పూర్తి కాలం: 9(తొమ్మిది) నెలలు, టెండర్ విలువ: రూ. 1,45,68,604/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 2,22,900/-, ముగింపు తేది: 19.06.2023.
క్ర.సం.: 2, టెండర్ నం.: ఇ-24-ఈస్ట్-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు-పని పేరు: విజయవాడ డివిజన్: ఎస్‌డబ్ల్యూ-1 : ఎడిఇఎన్/బివిఆర్‌ఎమ్ సబ్-డివిజన్ కింద ఎస్‌ఇ/డబ్ల్యూ/బివిఆర్‌ఎమ్ విభాగంలో ఇప్పటికే ఉన్న ఎఫ్‌ఓబికి కనెక్ట్ చేయడానికి తణుకు (2 సంఖ్యలు), ఆకివీడు (2 సంఖ్యలు) మరియు కైకలూరు (2 సంఖ్యలు) స్టేషన్‌లలో 6 లిఫ్ట్‌ల ఏర్పాటు. ఎస్‌డబ్ల్యూ-2 : అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎడిఇఎన్/లైన్స్/బిజెడ్‌ఎ సబ్-డివిజన్ కింద ఎస్‌ఎస్‌ఇ/డబ్ల్యూ/బిజెడ్‌ఎ విభాగంలో ఇప్పటికే ఉన్న ఎఫ్‌ఓబికి కనెక్ట్ చేయడానికి రాయనపాడు (2 సంఖ్యలు) స్టేషన్‌లలో 2 లిఫ్ట్‌ల ఏర్పాటు. పూర్తి కాలం: 9 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: రూ. 2,03,98,436/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 2,52,000/-, ముగింపు తేది: 28.06.2023
క్ర.సం. : 3, టెండర్ నం.: ఇ-11-నార్త్-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు-పని పేరు: విజయవాడ డివిజన్-ఎలమంచిలి వద్ద ప్లాట్‌ఫారమ్ పొడిగింపు (పిఎఫ్-1) మరియు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కాకినాడ టౌన్, సామర్లకోట్, అనపర్తి, అనకాపల్లి, ఎలమంచిలి, తుని మరియు నిడదవోలు (7 స్టేషన్లు)లో ప్లాట్‌ఫారమ్ ఉపరితలాలను మెరుగుపరచడం. పూర్తి కాలం: 9 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: రూ. 25,38,24,906/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 14,19,100/-, ముగింపు తేది: 23.06.2023
క్ర.సం.: 4, టెండర్ నం.: ఇ-12-నార్త్-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు: పని పేరు: ఎస్‌డబ్ల్యూ-1 :ఎబిఎస్ పథకం కింద తుని, యలమంచిలి మరియు అనపర్తి రైల్వే స్టేషన్లలో జెంట్స్, లేడీస్, దివ్యాంగజన్ (13.0 × 14.5 = 188.50 చ.మీ.లు.) మరియు వెయిటింగ్ హాల్ (10 × 10 = 100 చ.మీ.లు) కోసం విడివిడిగా ప్రీమియం మాడ్యులర్ టాయిలెట్ల ఏర్పాటు. ఎస్‌డబ్ల్యూ-2 : నిడదవోలు, సామల్‌కోట, కాకినాడ రైల్వే టౌన్ మరియు అనకాపల్లి రైల్వే స్టేషన్ పరిధిలోని జెంట్స్, లేడీస్, దివ్యాంగులకు (13.0 × 14.5 = 188.50 చ.మీ) మరియు వెయిటింగ్ హాల్ (20 × 10 = 200 చ.మీ) విడివిడిగా ప్రీమియం మాడ్యులర్ టాయిలెట్‌లను ఏర్పాటు చేయడం. పూర్తి కాలం: 9 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: రూ. 11,24,87,350/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 7,12,400/-, ముగింపు తేది: 23.06.2023
క్ర.సం.: 5, టెండర్ నం.: ఇ-16-సౌత్-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు-పని పేరు: విజయవాడ డివిజన్: బిఆర్ కోసం పిఎస్‌సి స్లాబ్‌లతో స్టీల్ ప్లేట్ గిర్డర్‌లతో కూడిన ప్రస్తుత స్పాన్‌ను భర్తీ చేయాలని ప్రతిపాదించబడింది. విజయవాడ - గూడూరు సెక్షన్‌లో గూడూరు (జిడిఆర్) మరియు మనుబోలు (ఎమ్‌బిఎల్) స్టేషన్‌ల మధ్య కి.మీ. 136/33-35 వద్ద నెం. 271 ఎ యుపి మరియు డిఎన్ లైన్‌లు ఇరువైపులా 200 మీటర్ల పొడవున అప్రోచ్ ట్రాక్‌లను విధిగా ఎత్తివేయడం. పూర్తి కాలం: 6 (ఆరు) నెలలు, టెండరు విలువ: రూ. 1,42,53,991/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 2,21,300/-, ముగింపు తేది: 26.06.2023
క్ర.సం.: 6, టెండర్ నం.: ఇ-17-సౌత్-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు-పని పేరు: 3.509 కి.మీ పొడవున బలహీనంగా ఏర్పడే పునరావాసం (ట్రిపుల్/డబ్లింగ్ సెక్షన్‌లో ట్రాఫిక్‌ను మళ్లించడం ద్వారా నిరంతరాయంగా సాగే బ్లాంకెటింగ్ మెటీరియల్‌తో కూడిన టిఎఫ్‌టిఆర్ (పూర్తి / పురోగతిలో ఉంది) గూడూరు - విజయవాడ (డిఎన్)= ఎడిఇఎన్/ఎన్‌ఎల్‌ఆర్ సబ్‌లోని వివిధ ప్రదేశాలలో 3.509 కి.మీ. ఎస్‌ఆర్.డిఇఎన్/సౌత్/బిజెడ్‌ఎ అధికార పరిధిలో విభాగం. పూర్తి కాలం: 13 (పన్నెండు) నెలలు, టెండరు విలువ: రూ. 4,23,79,942/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 3,61,900/-, ముగింపు తేది: 26.06.2023
క్ర.సం.7, టెండర్ నం.: ఇ-17-వంతెనలు-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు-పని పేరు: విజయవాడ-విశాఖపట్నం విభాగం: సెక్షనల్ బ్రిడ్జ్‌లను బలోపేతం చేయడం (8 డిఎన్, 9 పైకి, 10 పైకి, 11 పైకి, 13 పైకి, 13 డిఎన్, 57 పైకి, 104 పైకి, 220 డిఎన్, 220 పైకి, 236 పైకి, 236 డిఎన్, 239 పైకి, 239 డిఎన్, 245 పైకి, 245 డిఎన్, - 16 వంతెనలు) డిఇఎన్/బిఆర్/బిజెడ్‌ఎ కింద ఎడిఇఎన్/బిఆర్/నార్త్/బిజెడ్‌ఎ యొక్క ఎస్‌ఎస్‌ఇ/బిఆర్. 2/ఆర్‌జెవై విభాగంలో. పూర్తి కాలం: 14 (పద్నాలుగు) నెలలు, టెండరు విలువ: రూ. 4,33,49,920/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 3,66,800/-, ముగింపు తేది: 03.07.2023
1.భావి టెండర్‌దారులు ఏదైనా టెండర్ కొరకు మార్పులు/సవరణ ఉంటే టెండర్ ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్ "www.ireps.gov.in" సందర్శించమని సూచించబడ్డారు.
డివిజినల్ రైల్వే మేనేజర్, (వర్క్స్), విజయవాడ.

తేది : 31.05.2023, ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం. డిఆర్‌ఎమ్/వర్క్స్/బిజెడ్‌ఎ/14/2023
PUB/0588
భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారుడు తరఫున క్రింది పనుల కొరకు ప్రతిదానికి వ్యతిరేకంగా పేర్కొన్న తేదీలు మరియు 15.00గం. వరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.
క్ర.సం.: 1, టెండర్ నం. : ఇ-02-టిఎమ్-లైన్స్-బిజెడ్‌ఎ-2023, పని వివరాలు-పని పేరు: దక్షిణ మధ్య రైల్వే యొక్క ట్రాక్ మెషిన్ సిబ్బంది కోసం 40 సంఖ్యల ఎఆర్‌టి/జనరల్/స్లీపర్ లేదా ఏదైనా ఇతర రకం కోచ్‌లను క్యాంపింగ్ కోచ్‌లుగా మార్చడం. పూర్తి కాలం: 18 (పద్దెనిమిది) నెలలు, టెండరు విలువ: రూ. 8,65,70,019/-, ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ. 5,82,900/-, ముగింపు తేది: 19.06.2023
1.భావి టెండర్‌దారులు ఏదైనా టెండర్ కొరకు మార్పులు/సవరణ ఉంటే టెండర్ ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్ "www.ireps.gov.in" సందర్శించమని సూచించబడ్డారు.
డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/టిఎమ్/లైన్స్, విజయవాడ.
A0835
తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైటు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి

బ్యాంక్ ఆఫ్ ఇండియా BOI
కంకిపాడు బ్రాంచి, 13-28, గ్రౌండ్ ఫ్లోర్, గన్నవరం రోడ్డు, కంకిపాడు, కృష్ణా జిల్లా-521260. ఫోన్: 0866-2821888
బంగారు నగల వేలం ప్రకటన

లోన్ అకౌంట్ నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	స్థూల బరువు	నికర బరువు
569377610009142	బండారు శ్రీనివాసరావు, తండ్రి: బండారు వెంకటేశ్వరరావు, హెచ్.నెం.6-35, తెన్నేరు పోస్ట్, కంకిపాడు మండలం.	18.60 గ్రా॥	17.00 గ్రా॥

పైన ఉదహరించిన బంగారు నగలపై అప్పులు తీసుకున్న ఖాతాదారులు తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంక్ ఆఫ్ ఇండియా, కంకిపాడు బ్రాంచి, కృష్ణా జిల్లా, తేది: 12.06.2023, సోమవారం సా॥గం॥ 3.30 ని॥లకు మా బ్రాంచి ఆవరణలో వేలం వేయబడును.
షరతులు & నిబంధనలు: 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ.10,000/- ధరావతు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చుపాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 3) వేలం ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు మొత్తం ఋణగ్రహీత భరించవలెను. 4) నగల బరువుకు, నాణ్యతకు బ్యాంక్ వారి పూచీ ఏ మాత్రం లేదు. 5) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకుగాను, వాయిదా వేయుటకుగాని, వేలం ఆపుటకుగాని, రద్దుచేయుటకుగాని బ్యాంక్ వారికి పూర్తి అధికారం కలదు. 6) ఈ ఖాతాదారుల్లో ఎవరైననూ మరణించినయెడల వారి వారసులకు ఈ ప్రకటనపూర్వకముగా తెలియపరిచినట్లుగా భావించవలెను. 7) అప్పు వసూలు నోటీసులు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును.
తేది: 05-06-2023 సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.
PUB/0593
నోటిఫికేషన్
సివిల్ / ఎలక్ట్రికల్ / ఎస్ అండ్ టి డిపార్ట్‌మెంట్లలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన జూనియర్ టెక్నికల్ అసోసియేట్ (లెవెల్-6) ఎంగేజ్‌మెంట్ కొరకు సూచనాత్మక నోటీసు.
తేది: 05.06.2023, ఖాళీ నోటీసు నం.పి/ఎస్‌సిఆర్/హెచ్‌క్యూ/110/జెటిఎ(పనులు)కాంట్రాక్ట్/2023
సౌత్ సెంట్రల్ రైల్వేలో సివిల్ (వర్క్స్) / ఎలక్ట్రికల్ (డ్రాయింగ్) / సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్ (డ్రాయింగ్) శాఖ కాంట్రాక్ట్ బేసిస్‌లో జూనియర్ టెక్నికల్ అసోసియేట్ (లెవల్-6) ఎంగేజ్‌మెంట్.
పోస్ట్: జూనియర్ టెక్నికల్ అస్సోసియేట్-లెవెల్-6 (కాన్స్ మరియు ఓపెన్ లైన్)
ఖాళీల సంఖ్య: 35
పూర్తి చేసిన దరఖాస్తును సెక్రటరీ ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ అండ్ పర్సనల్ ఆఫీసర్ (ఇంజనీరింగ్), ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయం, 4వ అంతస్తు, పర్సనల్ డిపార్ట్‌మెంట్, సౌత్ సెంట్రల్ రైల్వే, రూమ్ నెం.422, 4వ అంతస్తు, రైలు నిలయం, సికింద్రాబాద్, పిన్ :- 500025 (తెలంగాణ రాష్ట్రం) అనే చిరునామాకు ఎన్వలప్ కవర్‌లో పంపాలి.
"జూనియర్ టెక్నికల్ అసోసియేట్ (కాన్స్ మరియు ఓపెన్ లైన్) పోస్ట్ కొరకు దరఖాస్తు" అని ఎన్వలప్ పై రాయాలి.
విద్యార్హత / అర్హత, వయస్సు, వేతనం, నిశ్చితార్థం కాలం, దరఖాస్తు ఫార్మాట్ మరియు ఇతర వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in ను చూడండి.
A0841
ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్.

यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Andhra Corporation
కొరిటెపాడు బ్రాంచ్
హరిహర మహల్ ఎదురు, కొరిటెపాడు, గుంటూరు - 522007.
ఫోన్: 0863-2251683, 9324988341
E-mail: ubin0803146@unionbankofindia.bank
NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST
డిమాండ్ నోటీసు
టు : ఋణగ్రహీత : మెస్సర్స్ అక్షయ గో ప్రోడక్ట్స్, డి.నెం.18-147/6/1, విక్టోరియా ఫార్మసీ కాలేజ్ దగ్గర, వెంగళాయపాలెం రోడ్డు, నల్లపాడు, గుంటూరు జిల్లా - 522005.
పార్టనర్ మరియు హామీదారు : శ్రీ భవనం మణికంఠ రెడ్డి, తండ్రి : శ్రీనివాస రెడ్డి, డోర్ నెం.4-5-32/15/ఎ, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ ఎదురు రోడ్డు, చెన్నకేశవ అపార్ట్‌మెంట్స్ దగ్గర, 1వ లైను, విద్యానగర్, గుంటూరు - 522002.
పార్టనర్ మరియు హామీదారు : శ్రీ భవనం భాను తేజ రెడ్డి, తండ్రి : శ్రీనివాసరెడ్డి, డోర్ నెం.4-5-32/15/ఎ, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ ఎదురు రోడ్డు, చెన్నకేశవ అపార్ట్‌మెంట్స్ దగ్గర, 1వ లైను, విద్యానగర్, గుంటూరు - 522002.
తనఖాదారు మరియు హామీదారు : శ్రీ భవనం శ్రీనివాస రెడ్డి, తండ్రి : అప్పిరెడ్డి, డోర్ నెం.4-5-32/15/ఎ, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ ఎదురు రోడ్డు, చెన్నకేశవ అపార్ట్‌మెంట్స్ దగ్గర, 1వ లైను, విద్యానగర్, గుంటూరు - 522002.

ఫెసిలిటీ/లోన్	లిమిట్స్	సంవత్సరం	ది.30-04-2023 నాటికి బకాయి మొత్తం
OCC	Rs. 24,00,000/- to Rs.30,00,000/-	2021-2022	Rs. 27,72,491.30/-

స్థిరాస్తి వివరములు : గుంటూరు, విద్యానగర్, 1వ లైను, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ ఎదురు రోడ్డు, చెన్నకేశవ అపార్ట్‌మెంట్ దగ్గర, డో.నెం.4-5-32/15/ఎ, కొరిటెపాడు, డి.నెం.21/బి వద్దగల శ్రీ భవనం శ్రీనివాస రెడ్డికి చెందిన 307 చ॥గ॥ల విస్తీర్ణము గల రెసిడెన్షియల్ భూమి మరియు అందులోని జి+1 భవనము. దీనికి హద్దులు : తూర్పు : మునిసిపల్ కార్పోరేషన్ రోడ్డు, 43.6 అ.లు, పడమర : విక్రేత నుండి బి.బి. స్వరాజ్యలక్ష్మికి అమ్మిన స్థలం,4.6 అ.లు, ఉత్తరం : బి.బి. స్వరాజ్య లక్ష్మి యొక్క ఆస్తి, 63.6 అ.లు, దక్షిణం : బోడపాటి అరుణకి చెందిన ఆస్తి, 63.6 అ.లు.
అమ్మా / అయ్యా,
విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు ఒసిసి అకౌంట్ క్రింద మా కొరిటెపాడు బ్రాంచి వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను ది.01.05.2023న నిరర్థక ఆస్తిగా NPA వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదీన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుపబడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తము ది.30.04.2023 నాటికి రూ.27,72,491.30 పై. (అక్షరాలా ఇరవై ఏడు లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల తొంభై ఒక్క రూపాయలు మరియు ముప్పై పైసలు మాత్రమే) చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణపత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫల మైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారాం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము/ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏవిధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.
తేది : 02.05.2023, స్థలం : గుంటూరు సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, # 48-14-111, శ్రీ నిత్యా కాంప్లెక్స్, విశాఖపట్నం - 530013
ఫోన్ నెం. : 0891-2567546 / 2505919. ఈ - మెయిల్ : iob2579@iob.in
ఇ-వేలం అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ నందలి రూల్ 8(6) / రూల్ 9(1) నిబంధనల ప్రకారం) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) / 9(1) లలోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన
సెక్యూరిటైజేషన్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారికి ఋణగ్రహీత & తనఖాదారులు యొక్క పేర్లు మరియు & చిరునామా : 1) మెస్సర్స్ శ్రీ శివ కామేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రెసిడెంట్ శ్రీ మండవ వెంకటేశ్వర రావు మరియు సెక్రటరీ శ్రీ మండవ శ్రీధర్, 396/2ఎహెచ్, డోర్ నెం.3-353, విద్యా నగర్, జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా-521175 (ఋణగ్రహీత). 2) శ్రీ మండవ వెంకటేశ్వర రావు, తండ్రి. ధశరధ రామయ్య, డి.నెం.2-127/1, గాంధీ చౌక్, వీనస్ బజార్, శ్రీనగర్ కాలనీ, గన్నవరం, కృష్ణా జిల్లా-521101 (తనఖాదారు / హామీదారు). 3) శ్రీమతి మండవ సుజాత, భర్త. శ్రీ మండవ వెంకటేశ్వర రావు, డి.నెం. 2-127/1, గాంధీ చౌక్, వీనస్ బజార్, శ్రీనగర్ కాలనీ, గన్నవరం, కృష్ణా జిల్లా-521101 (తనఖాదారు / హామీదారు). 4) శ్రీ మండవ శ్రీధర్, తండ్రి. శ్రీ మండవ వెంకటేశ్వర రావు, డి.నెం.2-127/1, గాంధీ చౌక్, వీనస్ బజార్, శ్రీనగర్ కాలనీ, గన్నవరం, కృష్ణా జిల్లా-521101 (తనఖాదారు / హామీదారు). 5) శ్రీమతి మండవ కుసుమ కుమారి, భర్త. శ్రీ మండవ శ్రీధర్, డి.నెం.2-127/1, గాంధీ చౌక్, వీనస్ బజార్, శ్రీనగర్ కాలనీ, గన్నవరం, కృష్ణా జిల్లా-521101 (తనఖాదారు / హామీదారు). 6) శ్రీమతి దామచర్ల ప్రసన్న కుమారి, ప్లాట్ నెం.301, కనక దుర్గ కాంప్లెక్స్, 3 ఫేజ్, శ్రీ కనక దుర్గ గుడి ఎదురుగా, KPHB కాలనీ, హైదరాబాద్-500072, తెలంగాణ రాష్ట్రం (హామీదారు). 7) శ్రీమతి దామచర్ల లక్ష్మీ కిరణ్మయి, ప్లాట్ నెం.301, కనక దుర్గ కాంప్లెక్స్, 3 ఫేజ్, శ్రీ కనక దుర్గ గుడి ఎదురుగా, KPHB కాలనీ, హైదరాబాద్-500072, తెలంగాణ రాష్ట్రం (హామీదారు). 8) శ్రీమతి బోడె మాధవి, డి.నెం.13-88, పోరంకి, పెనమలూరు మండలం, విజయవాడ రూరల్, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521137 (హామీదారు) వారు తేది.31.05.2023 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.23,25,45,942/- (అక్షరాల ఇరవై మూడు కోట్ల ఇరవై ఐదు లక్షల నలభై ఐదు వేల తొమ్మిది వందల నలభై రెండు రూపాయలు మాత్రమే) కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర అయిన ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/ఆధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై తేది.26.06.2023 న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) కు ఇందుమూలముగా సూచించటమైనది.
స్థిరాస్తుల వివరములు
ఆస్తి నెం.1 : (ఎకరా 15.50 సెంట్లు శ్రీ మండవ శ్రీధర్ గారు మరియు ఎకరా 1.00 సెంట్లు శ్రీమతి మండవ కుసుమ కుమారి గార్ల పేరున ఉన్న ఆస్తి
(దస్తావేజు నెం.473/2007 తేది.05.02.2007 మరియు దస్తావేజు నెం.4982/2007 తేది.22.10.2007 ప్రకారం ఆస్తి)
ఐటమ్ నెం.1 : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట టౌన్ మరియు మండలం మరియు సబ్ రిజిస్ట్రీ వద్ద గల ఆర్.ఎస్.నెం.396/2ఎ2హెచ్/1 లోని ఎకరా 15.50 సెంట్లు విస్తీర్ణంలోని వ్యవసాయేతర భూమి శ్రీ మండవ శ్రీధర్, తండ్రి. మండవ వెంకటేశ్వర రావు గారి పేరున ఉన్న ఆస్తి. హద్దులు : తూర్పు : శ్రీమతి ఏలూరి కమలమ్మ & ఇతరులు యొక్క ఆస్తి, పడమర : బైపాస్ రోడ్డు, ఉత్తరం : శ్రీమతి ఏలూరి కమలమ్మ & ఇతరులు యొక్క ఆస్తి, దక్షిణం : కాలువ (కెనాల్) భౌతికంగా వాగు.
ఐటమ్ నెం.2 : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట టౌన్ మరియు మండలం మరియు సబ్ రిజిస్ట్రీ వద్ద గల ఆర్.ఎస్.నెం.396/2ఎ2హెచ్/1 లోని ఎకరా 1.00 సెంట్లు విస్తీర్ణంలోని వ్యవసాయేతర భూమి శ్రీమతి మండవ కుసుమ కుమారి, భర్త. శ్రీధర్ గారి పేరున ఉన్న ఆస్తి. హద్దులు : తూర్పు : రోడ్డు, పడమర : శ్రీ మండవ శ్రీధర్ గారికి చెందిన ఆస్తి, ఉత్తరం : శ్రీ మండవ శ్రీధర్ గారికి చెందిన ఆస్తి, దక్షిణం : శ్రీ మండవ శ్రీధర్ గారికి చెందిన ఆస్తి.
ఐటమ్ నెం.1 మరియు 2 యొక్క మొత్తం విస్తీర్ణం ఎకరా 16.50 సెంట్లు.
రిజర్వు ధర రూ.6,43,72,000/- ధరావత్తు : రూ.64,37,200/-
ఆస్తి నెం.2 : (మెస్సర్స్ శివకామేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి పేరున ఉన్న ఆస్తి
(దస్తావేజు నెం.404/2007 తేది.01.02.2007 ప్రకారం ఆస్తి)
కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట, విద్యా నగర్, సబ్ డివిజన్ నెం.396/2ఎ2హెచ్, సర్వే నెం.396, డి.నెం.5-353 లోని ఎకరా 14.00 సెంట్లు విస్తీర్ణంలోని వ్యవసాయేతర భూమి మరియు నిర్మాణంతో గల కాలేజీ భవనం మెస్సర్స్ శ్రీ శివకామేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి పేరున ఉన్న ఆస్తి. హద్దులు : తూర్పు : రోడ్డు, పడమర : శ్రీమతి వై. కమలమ్మ యొక్క ఆస్తి, ఉత్తరం : ఉమ్మడి దారి, దక్షిణం : జి. రంగారావు యొక్క ఆస్తి.
(ఫర్నీచర్ మరియు ఫిక్చర్ / ల్యాబ్ పరికరాలు మొదలైనవి చేర్చబడలేదు.
రిజర్వు ధర రూ.19,15,25,000/- ధరావత్తు : రూ.1,91,52,500/-
1) స్థానిక ప్రభుత్వ సంస్థలకు చెల్లించవలసిన బకాయిలు (ఆస్తి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు మొదలగునవి) బ్యాంకు వారికి తెలియదు.
2) ధరావత్తు జమచేయు విధానము : అధీకత అధికారి "ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్., అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ శాఖ" అకౌంట్ నెం.257902000002579. IFSC కోడ్ : IOBA0002579 బ్యాంకు యొక్క ఖాతానకు బదిలీ చేయగలరు.
3) "చట్టబద్ధ బకాయిల కన్నా బ్యాంకు వారి యొక్క బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది. బిడ్ పెంపుదల : రూ.50,000/-, ఆస్తులు తనఖీ కొరకు తేది.23.06.2023 వరకు (ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు) ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం: తేది.26.06.2023 న ఉ॥ 10.30 ని॥ల నుండి మ॥ 12.30 ని॥ల వరకు అమ్మకం https://www.mstcecommerce.com/auctionhome/ibapi ఫ్లాట్ ఫారం వద్ద వేలం ముగించునంతవరకు చివరి వరకు చివరి 10 నిమిషాలు అపరిమిత పొడిగింపుతో.
4) విక్రయానికి సంబంధించిన పూర్తి వివరములు, నిబంధనలు మరియు షరతుల కొరకు దయచేసి సర్వీస్ ప్రొవైడర్ వెబ్ సైట్ లో అందించిన లింకును చూడగలరు: (1) https://www.ibapi.in (2) https://eprocure.gov.in/epublish/app లేదా బ్యాంక్ యొక్క వెబ్ సైట్ www.iob.in. తదుపరి వివరాల కొరకు దయచేసి సంప్రదించండి: "ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్., అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ శాఖ, 48-14-111, శ్రీ నిత్య కాంప్లెక్స్, విశాఖపట్నం-530013. మొబైల్ నెం. 83289 66063, ఫోన్ : 0891-2502641.
తేది : 05.06.2023,
ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

వందే భారత్‌పైనే శ్రద్ధ

- రైలు భద్రతపై లేని పట్టింపు
- బడ్జెట్‌లో కోతలు.. వేలల్లో పోస్టుల ఖాళీలు
- చార్జీల పెంపుదల.. రైళ్ల ఆలస్యం
- సమస్యలతో ప్రయాణికుడు సతమతం
- పచ్చజెండాలు ఊపుతూ ప్రచారానికే మోడీ ప్రాధాన్యం
- కేంద్రం తీరుపై సామాన్య ప్రజలు, నెటిజన్ల నుంచి విమర్శలు

న్యూఢిల్లీ : ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాద కేంద్రంలోని మోడీ సర్కార్ బాధ్యత రాహిత్యాన్ని గుర్తు చేస్తున్నది. కేంద్రం వందే భారత్ రైలు సర్వీసులపై శ్రద్ధ పెట్టి.. రైలు భద్రతను గాలికొదిలేసిందని సామాన్య ప్రజలు, నెటిజన్లు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు రాష్ట్రాలకు వెళ్లే.. వందే భారత్ రైళ్లకు పచ్చ జెండాలు ఊపి ప్రారంభిస్తూ ప్రచారానికే మోడీ ప్రాధాన్యతనిచ్చారని విమర్శిస్తున్నారు. అసాధారణ రేట్లుండే ఏసీ రైళ్లు పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరిగేదేముంటుందని ప్రశ్నిస్తున్నారు.

ఒడిశా రైలు ప్రమాద ఘటనతో భద్రత గురించి మాత్రమే కాకుండా రైళ్లలో రద్దీ, జాప్యం, బడ్జెట్‌లో కోతలు, రైల్వేలో ఉద్యోగ ఖాళీలు, చార్జీల పెంపు వంటి ఇతర సమస్యలూ తెర మీదకు వస్తున్నాయి. ఎకనామిక్ టైమ్స్ ప్రకారం.. ప్రతి వందే భారత్ కోసం రైల్వే రూ. 115 కోట్లు వెచ్చిస్తున్న సమయంలోనే ఒడిశా రైలు ప్రమాదం చోటు చేసుకున్నది. వందే భారత్ విషయంలో అంతా తానే అన్నట్టుగా మోడీ వ్యవహరించారు. కనీసం రైల్వే మంత్రికి ప్రాధాన్యతను ఇవ్వకపోవటం గమనార్హం.

పెరిగిన ప్రమాదాలు.. మరణాలు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) సమాచారం ప్రకారం.. గత కొన్నేండ్లుగా రైల్వే ప్రమాదాలు పెరిగాయి. 2022-23లో ఈ ప్రమాదాలు 37 శాతం ఎగబాకాయి. 2018లో రైల్వే ప్రమాదాల సంఖ్య 27,643గా, 2019లో 27,987గా ఉన్నది. అయితే, కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత చోటు చేసుకున్న రైలు ప్రమాదాలలో సుమారు 2.6 లక్షల మరణాలకు దారి తీశాయి. కోవిడ్ సమయంలో మినహా గత ఐదేండ్లలోనూ రైలు ప్రమాదాలు పెరిగాయి. భారత్‌లోని రైలు ప్రమాదాల్లో చోటు చేసుకుంటున్న మరణాలు ఏటికేడు పెరుగుతున్నాయి. రైలు ప్రమాద మృతుల సంఖ్య 2018లో 24,545, 2019లో 24,619గా ఉన్నది.

నిధుల కోతలు.. కాగ్ హెచ్చరికలు

రైల్వేలకు కేటాయించే నిధులలోనూ మోడీ సర్కారు కోత విధిస్తున్నది. దీంతో ఈ నిధుల కత్తిరింపు రైల్వే భద్రతను దెబ్బతీస్తున్నాయి. 2017 నుంచి 2021 మధ్య రైలు ప్రమాదాలలో గణనీయమైన భాగం ట్రాక్ లోపాల వంటి మెకానికల్ వైఫల్యాల కారణంగా జరిగాయి. అయితే, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022-23 బడ్జెట్‌లో ట్రాక్ పునరుద్ధరణకు జరిపిన కేటాయింపులు రూ. 3,222.4 కోట్లు తగ్గటం గమనార్హం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా రైలు పట్టాలు తప్పినవాటిపై గతేడాది ఆడిట్(కాగ్ రిపోర్టు-2022) లో కొన్ని కీలక విషయాలను వెల్లడించింది. 2017-18 నుంచి 2019-20 మధ్య కాలంలో కొన్ని రైల్వే జోన్లు కేటాయించిన నిధులలో కొంత భాగాన్ని తిరిగి ఇచ్చాయని కాగ్ హైలెట్ చేసింది. నిధుల కేటాయింపులో క్షీణత, కేటాయించిన నిధులను ఉపయోగించకపోవటం కారణంగా పునరుద్ధరణ పనులను సకాలంలో పూర్తి చేయటంపై ప్రభావం ఉంటుందని కాగ్ హెచ్చరించింది. 2017-18 నుంచి 2020-21 వరకు 1129 పట్టాలు తప్పిన ఘటనల్లో 26 శాతం ట్రాక్ పునరుద్ధరణలతో ముడిపడి ఉన్నాయని వివరించింది. రైల్వే మంత్రిత్వ శాఖ నివేదిక- 2019-20 ప్రకారం రైలు ప్రమాదాలలో 70 శాతం పట్టాలు తప్పినవే. దీంతో ట్రాక్ పునరుద్ధరణ నిధులలో ఈ కోత ప్రస్తుతం చర్చకు దారి తీస్తున్నది. కోచ్‌లు పట్టాలు తప్పటం కారణంగానే శుక్రవారం ప్రమాదం చోటు చేసుకున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

నియామకాల్లేవ్.. చార్జీల పెంపు.. రైళ్ల ఆలస్యం

నిధుల కోతతో పాటు నియామకాలు లేకపోవటం కూడా భద్రతను దెబ్బతీసింది. సెంట్రల్ జోన్‌లో భాగంగా ఉన్న 28,650 ఖాళీ స్థానాల్లో దాదాపు సగం భద్రతా కేటగిరికి చెందినవే. ఇటు చార్జీల పెంపు కూడా దారుణంగా ఉన్నది. ఇటీవల మరో 130 రైళ్లను 'సూపర్ ఫాస్ట్' హోదా ఇవ్వటం ద్వారా వాటి చార్జీలను పెంచారని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. ఎక్కువ చార్జీలున్నప్పటికీ.. స్లీపర్ కోచ్‌లు కిక్కిరిసిపోతున్నాయని సోషల్ మీడియా వేదికగా రైల్వే శాఖ మంత్రిని ట్యాగ్ చేస్తూ పలువురు ప్రయాణికులు కంప్లైంట్లు చేశారు. ఒడిశాలో ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గురించి కూడా ఇలాంటి వాలా ఫిర్యాదులు ఉన్నాయి. ఇక రైలు ఆలస్యం ఇంకో సమస్య. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వే ముఖచిత్రం మారిపోయిందని రైల్వే మంత్రులు (ఎన్డీయే-1, ఎన్డీయే-2) పలు సందర్భాల్లో చెప్పుకుంటూ వచ్చారు. అయితే, రైళ్లు మాత్రం చాలా ఆలస్యంగా నడుస్తున్నాయంటూ ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావటం గమనార్హం.

బడ్జెట్ కేటాయించినా పైసా ఖర్చు చేయలే..

- కవచ్ కోసం నిధులున్నా నిరుపయోగమే
- టెండర్ల జోలికే వెళ్లని రైల్వేశాఖ

న్యూఢిల్లీ : ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర ప్రమాదం తర్వాత రైల్వే భద్రత, రైలు ప్రమాదాల నివారణ వ్యవస్థ(కవచ్)పై నిరంతరం ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత కొన్నేండ్లుగా భద్రతా పనులపై రైల్వేల వ్యయం తగ్గుదల గురించి తీవ్ర చర్చకు దారి తీసింది. బాలాసోర్‌లో రైలు పట్టాలు తప్పిన ఘటన సౌత్ ఈస్ట్ జోనల్ రైల్వే(ఎస్ఈఆర్) కిందకు వస్తుంది. అయితే యాంటీ కొలిజన్ సిస్టమ్ (కవచ్) కోసం కేటాయించిన బడ్జెట్ నుంచి ఎస్ఈఆర్ ఒక్క పైసా కూడా ఖర్చు చేయకపోవటం చర్చనీయాంశంగా మారింది.

ఎస్ఈఆర్ కోసం మూలధన వ్యయం కింద రూ.468.90 కోట్లు ఆమోదించబడ్డాయి. ఇందులో లో ట్రాఫిక్ రైల్వే నెట్‌వర్క్ (1563 ఆర్‌కేఎం)పై స్వదేశీ కవచ్ (ఇది 2020-21లో పూర్తి చేయాల్సిన పని) కు సంబంధించిన పని ఉన్నది. కానీ ఇందుకోసం బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవటం గమనార్హం. అదే జోన్‌లోని మరో సెక్టార్‌లో (2020-21లో జరగాల్సిన పని) తక్కువ ట్రాఫిక్ ఉన్న రైల్వే నెట్‌వర్క్‌లో దీర్ఘకాలిక అభివృద్ధి వ్యవస్థ కోసం సుమారు రూ. 312 కోట్లు మంజూరు చేయబడ్డాయి. అయితే గతేడాది మార్చి వరకూ ఇందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవటం గమనార్హం.

అలాగే సిగ్నలింగ్ టెలీ కమ్యూనికేషన్ కింద సౌత్ ఈస్టర్న్ రైల్వే కోసం రూ. 162.29 కోట్లు ఆమోదించబడింది. ఈ డబ్బును అత్యధికంగా ట్రాఫిక్ ఉన్న రైల్వే మార్గంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, సెంట్రలైజ్డ్ ట్రాఫిక్ కంట్రోల్, కవచ్ కోసం ఖర్చు చేయాల్సి ఉన్నది. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి ఖర్చూ చేయకపోవటం గమనార్హం.

ఈ ప్రాంతంలో భద్రతా పనులకు సంబంధించి ఇంత వరకు టెండర్లు తీసుకోనందున బడ్జెట్‌ను ఖర్చు చేయలేదని రైల్వే మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. 2023-24కి సంబంధించిన ప్రభుత్వ బడ్జెట్ సమాచార విశ్లేషణ ప్రకారం.. ఇలాంటి నిష్క్రియ నిధుల స్థితితో కవచ్‌ను అమలు చేయటానికి చాలా సమయం పడుతుంది.

కవచ్ అమలుపై ప్రధానంగా దృష్టి సారించినట్టు చెప్తున్నది. ముఖ్యంగా అత్యంత రద్దీగా ఉండే రైల్వే మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి. సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్ వంటి నెట్‌వర్క్‌లు రెండో, మూడో అధిక ప్రయాణీకుల రద్దీని కలిగి ఉన్న మార్గాలు. రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్డీఎస్ఓ) భారతదేశంలో కవచ్ పరికరాలను అందించడానికి మేధా సర్వో డ్రైవ్స్, హెచ్‌బీఎల్, కెర్నెక్స్ అనే మూడు సంస్థలను ఆమోదించింది. దీనికి సంబంధించి మరో రెండు కంపెనీలు పనిచేస్తున్నాయని సమాచారం.

'ఆడుదాం ఆంధ్రా'కు టెండర్లు

- కొనుగోలు, క్వాలిటీ కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఫైల్

రాష్ట్ర స్థాయిలో పెద్దఎత్తున నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు విస్తృతంగా చేస్తున్నారు. క్రీడా పరికరాలు, ఇతర అవసరాలకు టెండర్లను కూడా ఆహ్వానించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కొనుగోలు, క్వాలిటీ కమిటీలను ఏర్పాటుచేస్తున్నారు. మొత్తం ప్రక్రియను ఆగస్టు 15లోగా పూర్తి చేసి క్రీడా పరికరాలు మండల స్థాయికి అందించాలని నిర్ణయించారు.

రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ, వార్డు స్థాయి వరకు అనేక క్రీడాంశాలతో పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ (ఎఎటి) అని పేరు కూడా పెట్టారు. ఈ పోటీల నిర్వహణకు కావాల్సిన క్రీడా పరికరాలను కొనుగోలు చేసేందుకు టెండర్ కమిటీని అధికారులు ఏర్పాటుచేశారు. ఈ మొత్తం పరికరాలను స్థానికంగా కాకుండా పరికరాల ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఏయే పరికరాలను కొనుగోలు చేయాలన్నది కూడా ఈ కమిటీలే ఖరారు చేస్తాయి. ఈ కమిటీలో ఇద్దరు క్రీడా శిక్షకులు, ఒక క్రీడా నిపుణుడు ఉంటారు. ఎంత మొత్తంలో పరికరాలు కావాలన్నది ఈ నెల ఏడో తేదీలోగా ఈ కమిటీ ఖరారుచేసి, సాంకేతిక కమిటీ ముందుకు తీసుకెళ్తుంది. టెక్నికల్ కమిటీకి ఆర్అండ్‌బి చీఫ్ ఇంజినీరు నేతృత్వం వహిస్తారు. అనంతరం జూన్ 15న టెండర్లు ఆహ్వానిస్తారు. జూలై 10 నాటికి టెండర్లు ఖరారు చేయాలని నిర్ణయించారు. ట్రోఫీల నమూనాలు, సర్టిఫికెట్లను ఖరారు చేసేందుకు మరో కమిటీని కూడా ఏర్పాటుచేయనున్నారు. మొత్తం క్రీడా పరికరాలను కొనుగోలు చేసిన అనంతరం వాటిని ఆగస్టు 15 నాటికి మండలాలకు అందించాలని నిర్ణయించారు. ఈ పరికరాల క్వాలిటీ నిర్వహణ కమిటీలను కూడా మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటుచేయనున్నారు.

రక్షణ రంగంలో పారిశ్రామిక సహకారానికి ప్రణాళిక సిద్ధం !

- వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడంపై భారత్, అమెరికా రక్షణ మంత్రుల చర్చలు

న్యూఢిల్లీ : అత్యంత ఉన్నత సాంకేతికత రంగాల్లో సహకారం దిశగా రాబోయే ఐదేళ్లలో విధానపరమైన దిశను నిర్దేశించగల రక్షణ రంగ పారిశ్రామిక సహకారానికి ఒక ప్రణాళికను భారత్, అమెరికా సోమవారం రూపొందించాయి. కొత్త సాంకేతికతల సహ అభివృద్ధి, సహ ఉత్పత్తికి గల అవకాశాలను కూడా గుర్తించాలని నిర్ణయించాయి. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, రాజ్‌నాథ్ సింగ్ మధ్య జరిగిన సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ నెలాఖరులో ప్రధాని మోడీ అమెరికాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆస్టిన్ పర్యటన జరుగుతోంది. సరఫరా చైన్‌లను నిర్మించడానికి గల మార్గాలను కూడా ఇరువురు మంత్రులు అన్వేషించారు. కొత్త సాంకేతికతలను కలిసి అభివృద్ధిపరచడానికి, ప్రస్తుతమున్న, అలాగే కొత్త సాంకేతిక వ్యవస్థలను కలిసి ఉత్పత్తి చేయడానికి అవకాశాలను ఇరు పక్షాలు అన్వేషిస్తాయని రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఇరు దేశాలకు చెందిన రక్షణ స్టార్టప్‌ల మధ్య సహకారాన్ని మరింత పెంచేందుకు కూడా ఆలోచిస్తున్నాయి. ఈ లక్ష్యాలను సాధించే దిశగా ఇరు పక్షాలు కలిసి రక్షణ రంగ పారిశ్రామిక సహకారానికి ఒక ప్రణాళికను ఆమోదించాయని ఆ ప్రకటన తెలిపింది. రాబోయే ఐదేళ్లలో దిశా నిర్దేశాన్ని ఈ ప్రణాళికే రూపొందిస్తుంది. ద్వైపాక్షిక రక్షణ సహకార అంశాలపై గణనీయంగా ఇరు పక్షాలు చర్చలు జరిపాయి. ముఖ్యంగా పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేయడానికి గల మార్గాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఆదివారం సాయంత్రం సింగపూర్ నుండి రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన ఆస్టిన్‌కు తొలుత త్రివిధ దళాల గౌరవ వందనం లభించింది. వ్యూహాత్మక ప్రయోజనాలు, విస్తృత భద్రతా సహకారంతో సహా పలు రంగాల్లో రక్షణ రంగ సహకారాన్ని పెంపొందించడంపైనే చర్చలు కేంద్రీకృతమైనట్లు రాజ్‌నాథ్ సింగ్ ట్విట్టర్‌లో తెలిపారు. స్వేచ్ఛా, పారదర్శకమైన, నిబంధనలకు కట్టుబడి వుండే ఇండో-పసిఫిక్ ప్రాంతానికి భారత్-అమెరికా భాగస్వామ్యం చాలా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. మరిన్ని రంగాల్లో అమెరికాతో మరింత కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నామని, తద్వారా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంఘటిత పరుచుకుంటామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టాలని చూడటం దుర్మార్గం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టాలని చూడటం దుర్మార్గమని సిఐటియు నాయకులు కెవి సత్యనారాయణ అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 844వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ డిపార్టుమెంట్ ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ రంగ సంస్థలు లాభాల్లో నడవాలని కోరుకుంటారని, దానికి భిన్నంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టాలని ప్రయత్నించడం దారుణమని అన్నారు. సొంత ఇనుప గనులు కేటాయించకుండా, యంత్రాల మరమ్మతులు చేయించకుండా, రా మెటీరియల్ కొనకుండా ఉత్పత్తికి ఆటంకాలు కలిగిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్లాంట్‌లో ఉత్పత్తి ఆగకుండా కార్మికులు నిత్యం శ్రమిస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో ఉక్కు ఉద్యోగులకు తోడుగా ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

తహశీల్దార్ కార్యాలయంపై వైసిపి జెండా

- కుందుర్పిలో ఘటన

ప్రజాశక్తి-కుందుర్పి (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా కుందుర్పి మండలంలో జనం విస్తుపోయే ఘటన చోటు చేసుకుంది. రాజకీయ పార్టీలకు అతీతంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయంపై ఏకంగా అధికార వైసిపి జెండా ఎగిరింది. దాదాపు ఒకరోజంతా ఈ జెండా కార్యాలయంపై ఉంది. ప్రభుత్వ కార్యాలయంపై వైసిపి జెండా ఎగరడం ఏమిటంటూ పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఇది ఆకతాయిలు చేసిన పనా.? లేక ఎవరైన రాజకీయ ఉద్దేశంతో చేశారా.? అన్న కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో కుందుర్పి మండల తహశీల్దార్ కార్యాలయంపై వైసిపి జెండా ప్రత్యక్షమైంది. సోమవారం ఉదయం అధికారులు గుర్తించి వెంటనే జెండాను తొలగించారు. అప్పటికే ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున వైరల్ అయ్యింది. వైసిపి పాలనలో ప్రభుత్వ కార్యాలయాలను పార్టీ కార్యాలయాలుగా మార్చేస్తున్నారంటూ కళ్యాణదుర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు మండిపడ్డారు.

గుర్తు తెలియని వ్యక్తులు కట్టారు : తహశీల్దార్

ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు జెండాను కట్టారని తహశీల్దార్ విజయ్‌కుమారి తెలిపారు. తమ కార్యాలయ సిబ్బంది ఆదివారం మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యాన కళ్యాణదుర్గంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారన్నారు. ఈ సమయంలో కొందరు ఆకతాయిలు తహశీల్దార్ కార్యాలయంపై జెండా కట్టారని తెలిపారు.

కారు అద్దంలో చూస్తూ.. మోడీ డ్రైవింగ్

రాహుల్ గాంధీ విమర్శలు

న్యూయార్క్: ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి నాయకులు ఎప్పుడూ భవిష్యత్తు గురించి మాట్లాడరని, తమ వైఫల్యాలకు గత ప్రభుత్వాలపై నిందలు వేస్తుంటారని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ ఆదివారం న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఒడిషా రైలు దుర్ఘటనపై సంతాపం వ్యక్తం చేస్తూ.. నిమిషం పాటు మౌనం పాటించారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన రైలు ప్రమాదం నాకు గుర్తుంది. ఈ ప్రమాదానికి బ్రిటిషర్లే కారణమని ఆ రోజు కాంగ్రెస్ అనలేదు. ఆ ఘటనకు బాధ్యత వహిస్తూ.. అప్పటి రైల్వే శాఖ మంత్రి మాట్లాడుతూ..'దానికి పూర్తి బాధ్యత నాదే.. నేను రాజీనామా చేస్తున్నా' అని ప్రకటించారు. ఇప్పటి బిజెపి నేతలు సాకులు వెతుకుతున్నారు. ఎదురవుతున్న వైఫల్యాలను అంగీకరించడం లేదు. ఇప్పుడు భారత్‌లో ఇదే సమస్య నెలకొని ఉంది' అని రాహుల్ బిజెపిపై విమర్శలు గుప్పించారు. ఆర్ఎస్ఎస్, బిజెపిలు భవిష్యత్తును చూడలేకపోతున్నాయని అన్నారు. 'ఆయన (ప్రధాని మోడీ) ఇండియా అనే కారును నడిపే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆయన ముందుకు చూడకుండా కారు అద్దంలో చూసి డ్రైవ్ చేస్తున్నారు. కారు ముందుకు పోకుండా ఎందుకు ప్రమాదాలకు గురవుతుందో ఆయనకు అర్థం కావడం లేదు. దేశంలో ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉంది. ప్రధాని, మంత్రులు, బిజెపి నాయకులు, ఆర్ఎస్ఎస్.. అంతా ఎప్పుడూ కూడా భవిష్యత్తు గురించి మాట్లాడినట్లు మనకు కనిపించదు. వారెప్పుడూ గతాన్నే తవ్వుతారు. వారు ముందుకు చూడలేకపోతున్నారు. వారి వైఫల్యాలకు గతంలోని వ్యక్తుల్ని, ప్రభుత్వాలను నిందిస్తుంటారు' అని విమర్శించారు. దేశంలో రెండు సిద్ధాంతాల మధ్యే పోరాటం జరుగుతోందన్నారు. ఒకదానికి కాంగ్రెస్, మరోదానికి బిజెపి - ఆర్ఎస్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు సాధిస్తున్న విజయాలను రాహుల్ గాంధీ కొనియాడారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr. & 1st Floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Daba Gardens, Visakhapatnam-530020.

O.A No.318 of 2023

Between: Indian Bank, Rep by its Branch Manager, D.No.9-18, Kotakatta Centre, Nunna Branch, Vijayawada. ....Applicant
And
M/s Nihanthi Implex, Proprietor Mrs. Marala Naga Vijaya Lakshmi and others .... Defendants

To,
D-1: M/s Nihanti Implex, Proprietor Mrs Marala Naga Vijaya Lakshmi, GF-1, Sandhya Constructions near Sivalayam, Enikepadu, Vijayawada-521108.
D-2: Mrs. Marala Naga Vijaya Lakshmi Proprietor M/s Nihanthi Implex H.No.1-1-62, Srugeri Colony, Kothapeta, Hyderabad.
D-3: Mr. Pulavartty Syam Prasad Jystvya, S/o. Jystavva Daspulavarthy, H.No.1-1-62, Srugeri Colony, Kothapeta, Hyderabad.

PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

1. Whereas, the Applicant has instituted an Application Under Section19 of The Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for Recovery loan amount together with current and future interest and other relief's. You are hereby summoned to appear and file written statement before this tribunal at **10.30 AM**. or at such time immediately thereafter according to the convenience of tribunal on **20-06-2023** to answered the claim.
2. If you intended to file any documents you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the tribunal in person or by a Pleader/Advocate duly instructed.
4. Take Notice that, in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and seal of the Tribunal on this date **11th day of May-2023** at Visakhapatnam.

SIGNATURE OF THE OFFICER
AUTHORIZED TO ISSUE SUMMONS

IDBI BANK
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
డోర్ నెం.27-37-20, శాంభవ్ ఎన్‌క్లేవ్, రాజగోపాలాచారి స్ట్రీట్, గవర్నర్‌పేట, విజయవాడ-520002. ఆంధ్రప్రదేశ్

బంగారు నగల వేలం కొరకు బహిరంగ ప్రకటన

ఋణగ్రహీత(లు) బ్యాంకుకు చెల్లించవలసిన దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుటకు బ్యాంకు పేరిట వారు తనఖా ఉంచిన బంగారు నగల బహిరంగ వేలం గురించి ఆఫర్లు ఆహ్వానిస్తున్నారు. వేలంను తేది. 13-06-2023, సా॥గం.3.30 ని॥ల నుండి ఐడిబిఐ బ్యాంక్, గవర్నర్‌పేట బ్రాంచి వద్ద నిర్వహించబడును.

ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	తాకట్టుపెట్టిన బంగారు ఆభరణముల వివరములు	స్థూల బరువు	బయానా (రూ.)	రిజర్వుధర (రూ.)
01516711 00059370 &01516711 00059255	కడప గుజ్జుల కిషోర్‌కుమార్, R.W.నెం. 916, డి.నెం. 42-3/1-83బి, కల్లేపల్లివారి స్ట్రీట్, రామకృష్ణాపురం, విజయవాడ, ఎ.పి-520003.	గాజులు-4 నల్లపూసల చైన్-1 బ్రాస్‌లెట్-1 ఉంగరాలు-2	127.3 గ్రా	రూ. 40,500	రూ. 6,75,760

బ్యాంకుచే నిర్ణయించిన అమ్మకం నియమ & నిబంధనల ప్రకారం వేలం నిర్వహించబడును. సదరు వివరముల కాపీని **ఐడిబిఐ బ్యాంక్, గవర్నర్‌పేట బ్రాంచి** నోటీసుబోర్డులో **ది.13-06-2023 వరకు ప్రదర్శించబడును.** ఆసక్తిగల వ్యక్తులు సదరు వివరములు చూడవలెను. వేలంలో పాల్గొనే బిడ్డరుకు పైన తెలిపిన అమ్మకం నియమ & నిబంధనలు గురించి పూర్తిగా తెలియును అని నిర్ణయించబడును. **బిడ్ సమర్పించుటకు ఆఖరు తేది: 12-06-2023, మ॥ 12-00 గం॥ల వరకు ఆహ్వానించబడతాయి.** వేలం రద్దు చేయుటకు / వాయిదా వేయుటకు / మార్పులు చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు.

ప్రదేశం: విజయవాడ, తేది: 06-06-2023 సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్

Union Bank of India
తాడిగడప బ్రాంచి (11931)
తాడిగడప, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా-521137.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
SCHEDULE 6 (RULE 8(1)) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ & ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం. 54) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : 1) శ్రీమతి సుషి కృష్ణ తన్నీరు, భర్త: చాగర్లమూడి గౌతమ్ చౌదరి,** D1707, ఆదిత్య ఎంప్రెస్ టవర్స్, షేక్‌పేట, హైదరాబాద్-500008. **2) శ్రీమతి సుషి కృష్ణ తన్నీరు, భర్త: చాగర్లమూడి గౌతమ్ చౌదరి,** హెచ్.నెం. 6-3, చాగర్లమూడివారి వీధి, చౌడవరం, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా-521139. **3) శ్రీ చాగర్లమూడి గౌతమ్ చౌదరి (కో-అప్లికెంట్), తండ్రి: చాగర్లమూడి వెంకట మురళీకృష్ణ,** హెచ్.నెం. 6-3, చాగర్లమూడివారి వీధి, చౌడవరం, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా-521139. **4) శ్రీ చాగర్లమూడి వెంకట మురళీకృష్ణ (హామీదారు), తండ్రి: చాగర్లమూడి గంగాధరరావు,** హెచ్.నెం. 6-3, చాగర్లమూడివారి వీధి, చౌడవరం, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా-521139 చెల్లించవలిసిన బకాయిమొత్తం **రూ.58,31,169.81 (అక్షరాల యాభై ఎనిమిది లక్షల ముప్పై ఒక్క వేల నూట అరవై తొమ్మిది రూపాయలు మరియు ఎనభై ఒకటి పైసలు మాత్రమే)** మరియు వడ్డీ సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.30-01-2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 8 ప్రకారము **02-06-2023 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెల్లించవలసిన బకాయిమొత్తం **రూ.58,31,169.81 పై॥ + వడ్డీ** మరియు ఇతర ఖర్చులతో ఛార్జికి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. (డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత చెల్లించినవి మినహాయించవలయును).

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

కృష్ణా జిల్లా-521139, పెనమలూరు మండలం, చౌడవరం గ్రామము మరియు గ్రామ పంచాయతీ, కోదండ రామాయలం దగ్గర, ఆర్.యస్.నెం.392, డి.నెం.6-3, 6-3ఎ, అసెస్‌మెంట్ నెం.820 నందు **శ్రీ చాగర్లమూడి వెంకట మురళీకృష్ణ, తండ్రి: సిహెచ్.గంగాధరరావు (లేటు) పేరునగల** 1040 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందులోని రెండంతస్తుల (జి+1) ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావత్తు. **ఆస్తికి హద్దులు 1040 చ॥గ॥: తూర్పు:** జి.హరిబాబు మరియు ఇతరుల యొక్క ఆస్తి; **దక్షిణం:** సిహెచ్.కోటేశ్వరరావు మరియు ఇతరుల యొక్క ఆస్తి; **పడమర:** సిహెచ్.సరోజినీ యొక్క ఆస్తి; **ఉత్తరం:** సిహెచ్.సాంబశివరావు & సిహెచ్ సురేష్ & సిహెచ్ రమేష్ యొక్క ఆస్తి & మార్గము. **ఉమ్మడి మార్గమునకు హద్దులు: తూర్పు:** సిహెచ్.రమేష్ యొక్క ఆస్తి; **దక్షిణం:** ఐటమ్-5 (1040 చ॥గ॥); **పడమర:** సిహెచ్.సాంబశివరావు & గోవర్ధనరావు యొక్క ఆస్తి; **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు.

తేది : 02-06-2023 సం/- అధీకృత అధికారి
ప్రదేశము : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Indian Bank ALLAHABAD
BANKING THAT'S # TWICE AS GOOD
ఇండియన్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచి,
6/1/211/212, బ్యాంక్ స్ట్రీట్, అరండల్‌పేట, నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్-522601. ఫోన్: 08647-222064

APPENDIX-IV-A {SEE PROVISION TO RULE 8(6)}
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన

ఇండియన్ బ్యాంక్, సత్తెనపల్లి బ్రాంచికి తనఖా / ఛార్జ్‌గా వుంచిన దిగువ పేర్కొన్న స్థిరాస్తులను ఇండియన్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి భౌతికంగా/నిర్మాణాత్మకంగా/లాంఛనముగా (ఏదైతే అది) స్వాధీనం చేసుకోబడిదనదని రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వబడింది. రుణగ్రహీతలు: **మెస్సర్స్ గణపతి ఆయిల్ జనరల్ మర్చంట్స్, యజమాని: శ్రీమతి చందలూరి కోమలి,** డి.నెం.20/2/86/6, వెంకటపతి కాలనీ, ఇరుకుపాలెం రోడ్డు, సత్తెనపల్లి, గుంటూరు-522403. **శ్రీమతి చందలూరి కోమలి (అప్లికెంట్), భర్త: చందలూరి లక్ష్మీనరసింహారావు,** డి.నెం.216, స్ట్రీట్ నెం.230, వీరాంజనేయ నగర్, సత్తెనపల్లి, గుంటూరు-522403. **శ్రీ చందలూరి లక్ష్మీనరసింహారావు (హామీదారు) తండ్రి: పొంగేశ్వరరావు,** డి.నెం.216, స్ట్రీట్ నెం.230, వీరాంజనేయ నగర్, సత్తెనపల్లి, గుంటూరు-522403 వారు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ఇండియన్ బ్యాంక్, సత్తెనపల్లి బ్రాంచికి** చెల్లించవలసిన **ది.05.06.2023 నాటికి రూ.9,36,461/- (అక్షరాల తొమ్మిది లక్షల ముప్పై ఆరు వేల నాలుగు వందల అరవై ఒకటి రూపాయలు మాత్రమే) బకాయి మొత్తాన్ని మరియు** దాని మీద తదుపరి వడ్డీ, వ్యయాలు, ఇతర ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో సహా రికవరీ కోసం సదరు ఆస్తిని **''ఎక్కడ ఉన్నది అలాగే'' ''అక్కడ ఏమి ఉన్నదో అది'' మరియు ''ఉన్నది ఉన్నట్లుగా''** పద్ధతిపై **26.06.2023 తేదీన** విక్రయించబడును.

ఆస్తుల యొక్క వివరములు

గుంటూరు జిల్లా (ఇప్పుడు పల్నాడు జిల్లా), నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రేషన్, రాజుపాలెం మండలం, H/o.రెడ్డిగూడెం, మొక్కపాడు గ్రామము మరియు గ్రామపంచాయతీ, **డి.నెం.426 నందు య॥ 8-18 సెం॥ మరియు డి.నెం.427 నందు య॥ 0-68 సెం॥, మొత్తం య॥ 8.86 సెం॥ లలో 100 చ॥గ॥లకు సమానమైన 84 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందులో డోర్ నెం.6-9 కలిగిన ఆర్‌సిసి దాబా ఇంటికి** సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు : తూర్పు:** రోడ్డు-10 అ॥; **దక్షిణం:** అప్లికెంట్ యొక్క తండ్రి శ్రీ చందలూరి పొంగేశ్వరరావు కొనుగోలు చేసిన ఆస్తి-90 అ॥; **పడమర:** మంగంటి ముసలయ్య యొక్క స్థలము 10-00 అ॥; **ఉత్తరం:** గల్లీ బజారు-90 అ॥.

రిజర్వుధర	రూ.8,30,000/- (ఎనిమిది లక్షల ముప్పై వేల రూపాయలు మాత్రమే)
ధరావత్తు	రూ.83,000/- (ఎనభైమూడు వేల రూపాయలు మాత్రమే)
ముందస్తు రుణములు	ఏమీ లేవు
ఇ-వేలం తేదీ మరియు సమయం:	26.06.2023, ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 04:00 గం॥ల వరకు
బిడ్ పెంపుదల విలువ:	రూ.20,000/-
ఆస్తి యొక్క ఐడి నెం	IDIB6482565718A

బిడ్డర్లు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ MSTC లిమిటెడ్ వెబ్‌సైట్ (www.mstcecommerce.com) ను సదర్శించాలని సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం దయచేసి MSTC హెల్ప్‌డెస్క్ నెంబర్ 033-22901004కు మరియు సర్వీస్ ప్రొవైడర్స్ హెల్ప్‌డెస్క్‌లో లభించే ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లకు కాల్ చేయండి MSTC లిమిటెడ్‌తో రిజిస్ట్రేషన్ స్థితి కోసం దయచేసి ibapiop@mstcecommerce.com ను మరియు EMD స్థితి కోసం ibapifin@mstcecommerce.com ను సంప్రదించండి. ఆస్తి వివరాలు మరియు ఆస్తి యొక్క ఛాయాచిత్రం కోసం మరియు వేలం యొక్క నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ibapi.in ను సందర్శించండి. ఈ పోర్టల్‌కు సంబంధించిన స్పష్టీకరణలకోసం, దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్ 18001025026 మరియు 011-41106131 ను సంప్రదించండి. https://ibapi.in మరియు www.mstcecommerce.com వెబ్‌సైట్స్‌లో ఆస్తి కోసం పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు శోధించవలసినదిగా సలహా ఇవ్వడమైనది. **ఇతర వివరాలకు దయచేసి అధీకృత అధికారిని సంప్రదించండి: +91 9849602102 లేదా బ్రాంచి మేనేజర్, ఇండియన్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచి, ఫోన్: +91 9849602102 లేదా 08647-222064.**

తేది: 05.06.2023, ప్రదేశము: నరసరావుపేట సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

ప్రతిపక్షాల భేటీ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జూన్ 12న పాట్నాలో జరగాల్సిన ప్రతిపక్ష పార్టీల సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశానికి 16 పార్టీలు పాల్గొనున్నాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, మరికొందరు ప్రతిపక్ష నేతలు అందుబాటులో లేకపోవడంతో సమావేశం వాయిదా వేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, డిఎంకె నేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా వారి బిజి షెడ్యూల్ కారణంగా హాజరుకాలేకపో తుండటంతో ప్రతిపక్షాల సమావేశం వాయిదా పడింది. కాగా.. రాహుల్ గాంధీ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు జెడియు నేత, బీహార్ సిఎం నితీష్ కుమార్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, ఆప్, వామపక్షాలతో, ప్రాంతీయ పార్టీలతో చర్చలు జరిపారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఢిల్లీ సిఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ సిఎం, టిఎంసి అధినేత మమతా బెనర్జీ, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్‌తో సహా అనేక పార్టీల నాయకులతో ఆయన వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. మరోసారి జూన్ 12న ప్రతిపక్ష నేతల సమావేశం కావాల్సి ఉండగా నేతల బిజీ షెడ్యూల్ కారణంగా వాయిదా పడింది.

సిసోడియాకు మళ్లీ చుక్కెదురు

- భార్యను కలుసుకోవడానికి అనుమతి

న్యూఢిల్లీ : ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం తిరస్కరించింది. ఢిల్లీ అక్రమ మద్యం పాలసీ కేసులో సిసోడియా ప్రస్తుతం సిబిఐ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. సిసోడియా బెయిల్ విజ్ఞప్తిని తిరస్కరించిన కోర్టు భార్యను కలుసుకోవడానికి ఒక రోజుకు మాత్రం అనుమతించింది. అందుకోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నివాసం లేదా ఆసుపత్రికి సిసోడియాను తీసుకెళ్లాలని ఢిల్లీ హైకోర్టు పోలీసుల్ని ఆదేశించింది. ఈ సమయంలో సిసోడియా తన కుటుంబ సభ్యుల్ని తప్ప ఇతరులెవరినీ కలవకూడదని న్యాయమూర్తి ఆదేశించారు. ఫిబ్రవరి 26న సిసోడియాను సిబిఐ అరెస్టు చేసింది. తన భార్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆరు వారాల మధ్యంతర బెయిల్ కోరుతూ మనీష్ సిసోడియా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు.

గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీకి యావజ్జీవం

న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో 32 ఏళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీని వారణాసి కోర్టు దోషిగా తేల్చింది. అతనికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. లక్ష రూపాయల జరిమానా విధించింది. ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అన్సారీ 1991లో ఓ కాంగ్రెస్ లీడర్‌ని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు. అప్పుడప్పుడే రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న అన్సారీ.. 1991, ఆగస్టు 3న మాజీ ఎమ్మెల్యే అజయ్‌రాయ్ సోదరుడు అవదేశ్ రాయ్‌ను అతని ఇంటి ముందే కాల్చి చంపాడు. ఈ కేసులో అన్సారీతోపాటు భీమ్ ససింగ్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ కలీమ్, మరో ఇద్దర్ని నిందితులుగా చేర్చారు. దీనిపై మే 19న తుది విచారణ చేపట్టిన వారణాసి ఎంపీ ఎమ్మెల్యే కోర్టు తాజాగా తీర్పును వెలువరించింది. తీర్పు నేపథ్యంలో కోర్టు పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరో హత్య కేసులో అన్సారీ ప్రస్తుతం పదేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నాడు.

'మార్గదర్శి' నిధుల దారి మళ్లింపు కేసు విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్స్ నిధుల దారి మళ్లింపు కేసుపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో సంస్థ యజమానులు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్న తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని ఎపి ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ రాజేష్ బిందాల్ విచారణ జరిపారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలన్న అభ్యర్థనను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సహా ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 18కి వాయిదా వేసింది. అంతవరకూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులన్నీ అమలులో ఉంటాయని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. 'తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్టే పోలీసుల దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తోంది. దర్యాప్తునకు ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దన్నది న్యాయసూత్రం. ఎపిలోనే అత్యధిక చిట్ ఫండ్ డిపాజిట్ దారులు ఉన్నారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ హెడ్ ఆఫీసు హైదరాబాద్‌లో ఉన్న కారణంతో తెలంగాణ హై కోర్టు స్టే ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు' అని ఎపి ప్రభుత్వం పేర్కొంది. బ్రాంచ్ ఆఫీస్ డబ్బు హెడ్ ఆఫీస్‌కు తరలించి స్వాహా చేశారని, సంపూర్ణ న్యాయం కోసం హైకోర్టులో ఏ పిటిషన్ అయినా ట్రాన్స్‌ఫర్ చేసే అధికారం 139-ఎ కింద సుప్రీంకోర్టుకు ఉందని ఎపి ప్రభుత్వం తెలిపింది.

ఇంటర్‌నెట్ ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు !

- కెఎఫ్ఓఎన్ ప్రాజెక్టును ప్రారంభించిన పినరయి విజయన్
- 20లక్షల కుటుంబాలకు ఉచిత ఇంటర్‌నెట్

తిరువనంతపురం : దేశంలో ఇంటర్‌నెట్‌ను ప్రాథమిక హక్కుగా గుర్తించిన మొట్టమొదటి రాష్ట్రం కేరళ సోమవారం ప్రతిష్టాత్మకమైన కెఎఫ్ఓఎన్ (కేరళ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్) ప్రాజెక్టును ప్రారంభించింది. డిజిటల్‌పరంగా గల తేడాలను రూపుమాపి, రాష్ట్రంలోని దారిద్ర్య రేఖకు దిగువున గల కుటుంబాలన్నింటికీ ఉచితంగా ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు ఈ ప్రాజెక్టు ఉద్దేశించబడింది. దేశంలో సామాజిక, రాజకీయ అభివృద్ధికి కేరళ రాష్ట్రం ఇప్పటికే ఒక ప్రామాణికతను నిర్దేశించింది. తాజాగా దేశ డిజిటల్ పరివర్తనలో కూడా ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. 30వేలకు పైగా ప్రభుత్వ సంస్థలకు విశ్వసనీయమైన, భద్రతతో కూడిన ఇంటర్‌నెట్ అనుసంధానతను అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా వుంది. పరిమితి లేని కమ్యూనికేషన్ సౌకర్యాలు అందించడం, ఇ-ప్రభుత్వ సేవలను మరింత సమర్ధవంతంగా అందచేయగలగడం కూడా లక్ష్యాలుగా వున్నాయి. ఇది కాకుండా అదనంగా, ఆర్థికంగా వెనుకబడిన దాదాపు 20లక్షల కుటుంబాలకు ఉచితంగా ఇంటర్‌నెట్ సదుపాయాన్ని అందజేయడమే కాకుండా, అవసరమైన డిజిటల్ సాధనాలతో, అవకాశాలతో వారికి సాధికారతను కెఎఫ్ఓఎన్ కల్పిస్తోంది.

ప్రజల కలల సాకారం : సిఎం విజయన్

ఈ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రసంగించారు. కెఎఫ్ఓఎన్ ప్రారంభంతో ఎన్నాళ్లగానో ప్రజలు కన్న కల నెరవేరిందని, పైగా ఎల్‌డిఎఫ్ ఇచ్చిన హామీ సాకారమైందని తెలిపారు. బాధ్యతాయుతమైన పాలనకు ఇది మరొక ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. అన్ని కుటుంబాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్‌నెట్ అందడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువున గల 20లక్షల కుటుంబాలకు ఉచిత ఇంటర్‌నెట్ సదుపాయం అందుతుందని, మిగిలినవారికి సబ్సిడీ రేట్లకు ఇస్తామని చెప్పారు. ఇప్పటికే 17,412 ప్రభుత్వ కార్యాలయాలకు, 2105 ఇళ్లకు ఇంటర్‌నెట్ ఇచ్చారు. కోవిడ్ అనంతర కాలంలో కొత్త రకమైన పని సంస్కృతి ఆవిర్భవించిందని విజయన్ పేర్కొన్నారు. ఇంటి నుండి పనిచేయడం, ఇంటికి సమీపంలో పని చేయడం, ఇంటికి దూరంగా పని చేయడం వంటి వర్కింగ్ పద్ధతులు సర్వసాధారణమయ్యాయి. మన యువత ఇంటర్‌నెట్ నుండి మరిన్ని ప్రయోజనాలు పొందాలంటే దేశంలో ప్రతిచోటా మరింత మెరుగైన ఇంటర్‌నెట్ సేవలు అందాలని అన్నారు. దీనికి కెఎఫ్ఓఎన్ ప్రాజెక్టు మంచి పరిష్కారమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

సిబ్బందే లేకుండా భద్రత ఎలా?

- సిగ్నల్, ట్రాఫిక్ విభాగాల్లోనే భర్తీకాని 77 వేల పోస్టులు
- మొత్తంగా 3 లక్షల పోస్టులు ఖాళీ
- రైల్వేశాఖ ఉద్యోగ నియామకాల్లో కేంద్రం మీనమేషాలు

న్యూఢిల్లీ : భారతీయ రైల్వేల్లో భద్రతకు సంబంధించి వివిధ విభాగాల్లో సిబ్బందిని ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదు. ముఖ్యంగా రైల్వేలో కీలకమైన సిగ్నల్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాల్లో 77 వేలకు పైగా ఖాళీలు భర్తీ చేయలేదు. భారతీయ రైల్వేలో మూడు లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయి. ఈ వివరాలను సాక్షాత్తూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడించారు. 2022 డిసెంబరు 23న రాజ్యసభలో మంత్రి మాట్లాడుతూ 'దేశవ్యాప్తంగా రైల్వేల్లో 3.12 లక్షల నాన్ గెజిటెడ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది' అని తెలిపారు. ఇందులో కీలకమైన సిగ్నల్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాల్లో గణనీయమైన సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. సిగ్నల్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్‌లో 14,815 ఖాళీలు, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్‌లో 62,264 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అత్యధికంగా 87,654 పోస్టులు, మెకానికల్ విభాగంలో 64,346 ఖాళీలు, ఎలక్ట్రికల్ విభాగంలో 38,096 ఖాళీలు ఉన్నాయని మంత్రి తెలిపారు. కీలకమైన కార్యాచరణ విభాగాల్లో సిబ్బంది కొరత భారతీయ రైల్వేల సమర్థవంతమైన పనితీరుకు సవాల్‌గా నిలుస్తోంది. ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ప్రమాదం జరిగిన సౌత్ ఈస్టర్న్‌లో 17,811 ఖాళీలు

శుక్రవారం ఘోర రైలు ప్రమాదం జరిగిన ఒడిషాలోని బాలాసోర్ జిల్లా బహనగ బజార్ సౌత్ ఈస్టర్న్ రైల్వే పరిధిలోకి వస్తుంది. మంత్రి ఇచ్చిన సమాధానం ప్రకారం ఈ సౌత్ ఈస్టర్న్‌లో 17,811 నాన్ గెజిటెడ్ పోస్టులు, 150 గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగాల ఖాళీ విషయంలో ఉత్తర రైల్వే జోన్‌లో అత్యధికంగా 39,226 ఖాళీలు ఉన్నాయి. పశ్చిమ రైల్వే జోన్‌లో 30,785 ఖాళీలు ఉన్నాయి. తూర్పు రైల్వే జోన్‌లో 30,735, సెంట్రల్ రైల్వే జోన్‌లో 28,876 ఖాళీలు ఉన్నాయి. నైరుతి రైల్వే జోన్‌లో 6,638 ఖాళీలు ఉన్నాయి. భారతీయ రైల్వేలో మొత్తంగా ఎ, బి, సి గ్రూపుల్లో 3,15,780 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే వేసిన వరస ప్రశ్నలకు మంత్రి ఈ సమాధానాలు ఇచ్చారు. అలాగే, 2021-22లో గ్రూప్ ఎ, సిల్లో కేవలం 4,625 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి చెప్పారు. ఇదే సమయంలో 44,847 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేశారు.

ఈ ఏడాదిలో సుమారు 1,35,000 ఉద్యోగాలు భర్తీ చేస్తామని రైల్వే శాఖ హామీ ఇచ్చింది. 2020 నుంచి 2022 మధ్యకాలంలో సుమారు 3.5 కోట్ల మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. కేరళ ఎంపి అబ్దుల్ వహాబ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ 'వివిధ కేటగిరిల్లోని ఉద్యోగులను భర్తీ చేయాలనే డిమాండ్‌తో ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ (సిఎస్ఎంటి) వద్ద ఉన్న డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ముందు నేషనల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సభ్యులు నిరసనకు దిగినట్లు' తెలిపారు. ఒక్క సెంట్రల్ రైల్వే జోన్‌లోనే నాన్ గెజిటెడ్ గ్రూప్ సి పోస్టులు 28,650 ఖాళీగా ఉన్నాయి. ఇందులో భద్రతా విభాగం పోస్టులే 14,203 ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయకపోవడంతో మొత్తంగా భారతీయ రైల్వేల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గుముఖం పడుతూ వస్తోంది. 2019-20లో భారతీయ రైల్వేలో మొత్తంగా 12,35,900 ఉద్యోగులు ఉండగా, 2020-21 నాటికి ఈ సంఖ్య 12,33,700కు తగ్గిపోయింది.

ముగిసిన ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆపరేషన్

- బాలాసోర్ నుంచి తొమ్మిది బృందాలు వెనక్కి
- 151 మృతదేహాల గుర్తింపు
- నిలకడగా కోరమాండల్ లోకోపైలట్ల ఆరోగ్యం

భువనేశ్వర్ : ఒడిషాలో ఘోర రైలు ప్రమాదం జరిగిన బాలాసోర్ జిల్లాలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు (ఎన్‌డిఆర్‌ఎఫ్) ఆపరేషన్ సోమవారంతో ముగిసింది. ఈ ప్రాంతం నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన తొమ్మిది బృందాలు వెనక్కి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 2న జరిగిన రైలు ప్రమాదం నుంచి 44 మంది బాధితుల్ని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాయి, 121 మృతదేహాల్ని వెలికితీసాయి. ప్రమాద ప్రాంతం వద్ద ప్రస్తుతం గాయపడిన వ్యక్తులు లేదా మృతదేహాలు లేకపోవడంతో ఈ ప్రాంతం నుంచి తొమ్మిది ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు వెనక్కి వెళ్లాయి. ఇందులో ఎనిమిది బృందాలు ఆదివారమే వెనక్కి వెళ్లిపోగా, సోమవారం మిగిలిన ఒక్క బృందం తిరిగి వెళ్లిపోయింది. ఈ బృందాలన్నీ రాష్ట్ర విపత్తు బృందాలు, స్థానిక అధికారులతో కలిసి సహాయక బృందాల్లో పాల్గొన్నాయి. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాల వెంట భారీ ప్లాస్మా, గ్యాస్ కట్టర్లు, లిఫ్టింగ్ ప్యాడ్‌లు, స్ట్రెచర్‌లు, ఇతర పరికరాలు ఉన్నాయి.

151 మృతదేహాల గుర్తింపు

బాలాసోర్ రైలు ప్రమాదం సంఘటనా స్థలంలో శిథిలాల కింద పడి ఉన్న 151 మంది మృతదేహాలను గుర్తించినట్లు ఒడిషా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెనా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాలను ఆయా గ్రామాలకు తరలిస్తామని, దీనికయ్యే రవాణా ఖర్చు మొత్తం ఒడిశా ప్రభుత్వమే భరిస్తుందని జెనా తెలిపారు.

నిలకడగా కోరమాండల్ లోకోపైలట్ల ఆరోగ్యం

ఒడిషా రైలు ప్రమాదంలో గాయపడిన కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ డ్రైవర్ గుణనిధి మహంతి, ఆయన అసిస్టెంట్ హజారీ బెహరా ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని రైల్వే అధికారులు సోమవారం వెల్లడించారు. వారిద్దరికీ భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స కొనసాగుతోంది. 'మహంతిని సోమవారం ఐసియు నుంచి సాధారణ వార్డుకు తరలించారు. బెహరాకు మాత్రం తలకు శస్త్రచికిత్స జరగాల్సి ఉంది' అని ఆగ్నేయ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ అదిత్య చౌధరి మీడియాకు తెలిపారు. ఈ పరిస్థితుల్లో తమ గోప్యతకు భంగం కలిగించవద్దని లోకోపైలట్ల కుటుంబాలు అభ్యర్థించాయి. వారిద్దరు శారీరకంగా, మానసికంగా కోలుకునేలా చూడాలని కోరారు. ఈ రైలు ప్రమాదం పూర్తి కారణాలపై ఇంకా స్పష్టత రానప్పటికీ.. డ్రైవర్ తప్పిదం లేకపోవచ్చని రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే తెలిపిన సంగతి తెలిసిందే. ఘటన సమయంలో రెండు రైళ్లు కూడా పరిమిత వేగానికి లోబడే వెళ్తున్నాయని అధికారులు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలో మార్పు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చారు.

ఒడిషాలో పట్టాలు తప్పిన గూడ్స్

ఒడిషాలో మరో రైలు ప్రమాదం జరిగింది. బార్‌గఢ్ జిల్లాలో సంబర్ధరా సమీపంలో లైమ్‌స్టోన్‌తో వెళుతున్న ఒక గూడ్స్ రైలులో అనేక వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఈ రైలు డుంగురి నుంచి బార్‌గఢ్‌కు వెళుతోంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఎసిసి సిమెంట్ ప్లాంట్‌లోని ప్రైవేట్ ట్రాక్‌పై ఈ ప్రమాదం జరిగింది. నారో గేజ్ లైన్ సిమెంట్ ప్లాంట్ యాజమాన్యానికి చెందింది. భారతీయ రైల్వేలకు చెందినది కాదు.

సుస్థిరత, భద్రతే చైనా పంథా !

- షాంగ్రిలా డైలాగ్ సదస్సులో చైనా రక్షణ మంత్రి

బీజింగ్ : సింగపూర్‌లో జరుగుతున్న 20వ ఐఐఎస్ఎస్ షాంగ్రిలా డైలాగ్‌లో భద్రతాపరమైన అంశాలపై చైనా తన దార్శనికతను స్పష్టంగా తెలియజేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా అనుసరిస్తున్న ఘర్షణాయుత వైఖరికి విరుద్ధంగా వాస్తవ, సుస్థిర భద్రతతో కూడిన తనదైన పంథాను వివరించింది. సదస్సులో చైనా స్టేట్ కౌన్సిలర్, రక్షణ మంత్రి లీ షాంగ్ఫూ మాట్లాడుతూ, చైనా ఉమ్మడి, సమగ్ర, సహకార, సుస్థిర భద్రతా దార్శనికతను వివరించారు. ఘర్షణలకు బదులుగా భద్రతపై చర్చలు జరిపే కొత్త పంథాను అనుసరించడం, పొత్తులకు బదులుగా భాగస్వామ్యాలు వహించడం, అందరికీ సమాన అవకాశాలు అన్నది చైనా విధానంగా వుందని చెప్పారు. 'చైనా నూతన భద్రతా చొరవలు' అన్న అంశంపై ప్రసంగిస్తూ ఆయన, చైనా ప్రతిపాదించిన గ్లోబల్ సెక్యూరిటీ ఇనీషియేటివ్ (జిఎస్ఐ)ను అమలు చేయాలంటే బెదిరింపులు, గుత్తాధిపత్యం బదులుగా పరస్పర గౌరవం నెలకొనాలని సూచించారు. న్యాయం, పారదర్శకత వుండాలన్నారు. పరస్పర విశ్వాసం, సంప్రదింపులతో ఘర్షణల పంథాను విడనాడాలన్నారు. అందరినీ కలుపుకుని పోవడం, అరమరికలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించే ధోరణితో ఘర్షణలను నివారించాలని అన్నారు. ఆసియా-పసిఫిక్ కమ్యూనిటీ పట్ల తమకు గల నిబద్ధతతో అన్ని పక్షాలతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా వుందన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో భద్రతకు మరింత మెరుగైన అవకాశాలను అనుసరిస్తూ, ప్రాంతీయ భద్రతా సహకారాన్ని మరింతగా పెంపొందించడానికి కృషి చేస్తామన్నారు. బలమైన భద్రతా, విశ్వాస పునరుద్ధరణా వ్యవస్థలను నిర్మించడం, మరింత సమానమైన భద్రతా నిబంధనలను పెంపొందించడం, బహుముఖ భద్రతా యంత్రాంగాలను మెరుగుపరచడం, సమర్ధవంతమైన రక్షణ, భద్రతా సహకారాన్ని కొనసాగించడం తమ దార్శనికతలో కీలకాంశాలని లీ పేర్కొన్నారు. చైనా ఆధునీకరణ అనేది అత్యంత శక్తివంతమైన అభివృద్ధి సాధనంగా వుందని ఆయన నొక్కి చెప్పారు. ప్రపంచ శాంతి పరిరక్షణకు, అంతర్జాతీయ పాలనను మెరుగుపరచడానికి ఇది దోహదపడుతుందన్నారు.

సౌదీ అరేబియాలో మదురో పర్యటన

దుబాయ్ : అధికార పర్యటన నిమిత్తం సౌదీ అరేబియా వచ్చిన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోకు ఘన స్వాగతం లభించింది. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత జెడ్డా నగరానికి చేరిన మదురోకు సౌదీ అధికారులు స్వాగతం పలికారు. మదురో పర్యటనకు గల కారణాలేంటనేది తెలియరాలేదు. ఆయన పర్యటన షెడ్యూల్ వివరాలు కూడా తెలియలేదు. తీవ్రవాదాన్ని ఎదుర్కొనడంపై అంతర్జాతీయ సమావేశం సౌదీ అరేబియా ఆధ్వర్యంలో ఈ వారంలో సౌదీ రాజధాని రియాద్‌లో జరగనుంది. ఈ సమావేశానికి అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కూడా అధ్యక్షత వహిస్తారు. సౌదీలో రాజకీయ, దౌత్య, ఇంధన, పొత్తులను మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా మదురో వర్క్ ఎజెండా వుండనుంది. అంకారాలో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన మదురో అక్కడ నుండి జెడ్డా వచ్చారు. 1952 నుంచి సౌదీ, వెనిజులా మధ్య మంచి దౌత్య సంబంధాలు వున్నాయి. దశాబ్దాలుగా అమెరికాకు అత్యంత సన్నిహిత దేశంగా సౌదీ అరేబియా వుంది. ఇటీవలి సంవత్సరాల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. గత కొద్ది నెలలుగా ఇరాన్, సిరియాలతో సౌదీ సంబంధాలను పునరుద్ధరించింది. గత నెల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని అరబ్ లీగ్ సదస్సుకు సౌదీ ఆహ్వానించింది. ఆ తర్వాత కొద్ది రోజులకే పశ్చిమ దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా సీనియర్ అధికారిని కూడా ఆహ్వానించి, ఆతిథ్యమిచ్చింది. తమ జాతీయ ప్రయోజనాలే తమకు ముఖ్యమని సౌదీ వాదిస్తూ వస్తోంది. బృహత్తరమైన అభివృద్ధి ప్రాజెక్టుల కోసం పెద్ద ఎత్తున అంతర్జాతీయ పెట్టుబడులను ఆహ్వానించేందుకు సౌదీకి గల పేరు ప్రతిష్టలను మెరుగుపరచుకోవడానికి, ప్రాంతీయ సుస్థిరతను మరింత పెంచుకోవడానికి సౌదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.

బంగ్లాదేశ్‌లో భారత్ ఆర్మీ చీఫ్ పర్యటన

ఢాకా : భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే సోమవారం బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ షఫియుద్దీన్ అహ్మద్‌తో ఇక్కడ సమావేశమయ్యారు. రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం పాండే సోమవారం ఉదయం ఇక్కడకు వచ్చారు. పరస్పర ప్రయోజనకరమైన వివిధ అంశాలపై చర్చించారు. ద్వైపాక్షిక రక్షణ, భద్రతా సంబంధాలను మరింతగా విస్తరించుకునేందుకు గల మార్గాలను అన్వేషించారు. ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బంగ్లాదేశ్‌కు రావడం ఇది రెండవసారి. గత జులైలో మొదటసారి వచ్చారు. సాయుధ బలగాల విభాగ ప్రిన్సిపల్ స్టాఫ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్‌తో కూడా ఆయన సమావేశమయ్యారు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో అశువులు బాసిన అమర వీరులకు మనోజ్ పాండే నివాళి అర్పించారు. సేనకుంజ వద్ద ఆయనకు గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. ఇరు దేశాల సైన్యాల మధ్య గల స్నేహ బంధానికి గుర్తుగా ఒక మొక్కను నాటారు. చత్తోగ్రామ్‌లోని బంగ్లాదేశ్ మిలటరీ అకాడమీ (బిఎంఎ)లో 84వ లాంగ్ కోర్స్ ఆఫీసర్ కేడెట్ల పాసింగ్ అవుట్ పరేడ్‌ను జనరల్ పాండే తిలకిస్తారు. ఈ సందర్భంగా మిత్ర దేశాలకు చెందిన ఉత్తమ విదేశీ కేడెట్‌కు బంగ్లాదేశ్, భారత్ ఫ్రెండ్‌షిప్ ట్రోఫీ అందజేస్తారు.

మరో 3 రోజులు ఎండలే

- నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, న్యూఢిల్లీ

నైరుతి రుతుపవనాలు రావడం ఆలస్యం కావడంతో రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు ఎండల తీవ్రత ప్రభావం చూపనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 43.3 డిగ్రీలు, ఏలూరు జిల్లా శ్రీరామవరంలో 43.1, తిరుపతి జిల్లా గొల్లగుంటలో 42.9, కృష్ణా జిల్లా కాజాలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు వెల్లడించారు. అలాగే మంగళవారం అల్లూరి జిల్లా నెల్లిపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తీవ్ర వడగాడ్పులతోపాటు, 212 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం వుందని పేర్కొన్నారు. ఎండల తీవ్రతలోనూ అక్కడక్కడ భారీగా ఈదురగాలులతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం వుందని తెలిపారు.

కేరళకు రుతుపవనాల రాకను ప్రభావితం చేయనున్న అల్పపీడనం : ఐఎండి

ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఏర్పడనున్న అల్ప పీడన ప్రాంతం వచ్చే రెండు రోజుల్లో మరింత బలపడుతుందని, దీని ప్రభావంతో కేరళ తీరప్రాంతం దిశగా వచ్చే రుతుపవనాలు మరి కొంత ముందుకు జరిగే అవకాశం వుందని భావిస్తున్నట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండి) సోమవారం తెలిపింది. దీంతో మొదట 4న కేరళను తాకుతాయన్న రుతుపవనాలు ఇంకొన్ని రోజులు ఆలస్యమయే అవకాశం ఉంది. కేరళకు రుతుపవనాలు వచ్చే తేదీని ఐఎండి ప్రకటించలేదు. దక్షిణ అరేబియా సముద్రం మీదుగా వీచే పశ్చిమ గాలులు సగటు సముద్ర మట్టానికి 2.1 కిలోమీటర్ల ఎత్తున కొనసాగుతున్నాయి. రాగల 24గంటల్లో ఇదే ప్రాంతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం వుందని, ఇది ఉత్తర దిశగా కదిలి మరింత బలపడి, ఆ తదుపరి 48గంటల్లో తుపానుగా మారే అవకాశం వుందని ఐఎండి తెలిపింది. వీటి కారణంగా కేరళ తీర ప్రాంతాన్ని తాకే రుతుపవనాలు మరింత ముందుకు కదిలే అవకాశం వుందని ఐఎండి పేర్కొంది. సాధారణంగా జూన్ 1 నాటికి కేరళకు నైరుతి రుతుపవనాలు వస్తాయి. ఒక వారం రోజులు అటూ ఇటూగా ఈ తేదీలు మారుతూ వుంటాయి. ఈసారి జూన్ 4కల్లా వస్తాయని మేలో ఐఎండి అంచనా వేసినా నేటికీ రాలేదు.

ఉద్యమం ఆగదు.. కొనసాగుతుంది

- హోంమంత్రి అమిత్ షా నుంచి హామీ రాలేదు
- రెజ్లర్ సాక్షి మాలిక్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను రెజ్లింగ్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌సింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న భారత రెజ్లర్లు కలిశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో హోంమంత్రిని కలిసిన రెజ్లర్లు దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. హోంమంత్రిని కలిసిన వారిలో రెజ్లర్లు భజరంగ్ పునియా, సాక్షి మాలిక్, సంగీతా ఫోగట్, సత్యవర్త్ కడియన్ ఉన్నారు. మైనర్‌తో సహా ఏడుగురు మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై నిష్పాక్షిక విచారణ జరిపి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు డిమాండ్ చేశారు. హోంమంత్రి అమిత్ షా తమకు అనుకూలంగా హామీ ఇవ్వలేదని రెజ్లర్లు తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని చెప్పినట్లు రెజ్లర్లు పేర్కొన్నారు. 'ఉద్యమం ఆపేశామనే వార్త పూర్తిగా తప్పు. న్యాయం కోసం చేస్తున్న పోరాటంలో మేమేమీ వెనక్కు తగ్గలేదు. ఆందోళనతోపాటు రైల్వేలో నా బాధ్యతను నిర్వర్తిస్తున్నాను. న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. దయచేసి ఎలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దు' అని సాక్షి మాలిక్ అన్నారు. సత్యవర్త్ కడియన్ మాట్లాడుతూ.. తమకు హోంశాఖ మంత్రి నుంచి ఆశించిన ప్రతిస్పందన రాలేదని నిరాశ వ్యక్తం చేశారు. కేంద్రమంత్రితో శనివారం రాత్రి భేటీ అయినట్లు బజరంగ్ పునియా మీడియా వద్ద ధ్రువీకరించారు. ప్రస్తుతానికి అంతకంటే తానేమీ చెప్పలేనని పేర్కొన్నారు. ఒలింపిక్ పతక విజేతలు సాక్షి మాలిక్, బజరంగ్ పునియా, వినేశ్ ఫోగట్ రైల్వేలో తిరిగి విధుల్లో చేరారు.

అగ్రస్థానంలో ఐఐటి మద్రాస్

(మొదటి పేజీ తరువాయి)

మూడు స్థానాల్లో నిలిచాయి. ఫార్మసీ విభాగంలో హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ మొదటి స్థానంలో నిలిచింది. జామియా హమ్‌దర్ద్, బిట్స్ పిలానీ రెండు, మూడు స్థానాలు సాధించాయి. 22వ ర్యాంకులో ఎయు కాలేజీ ఆఫ్ ఫార్మసీ (విశాఖపట్నం) నిలిచింది.

న్యాయ విద్యలో బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా' తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా ర్యాంకింగ్ కోసం గతేడాది 7,254 దరఖాస్తులు రాగా.. ఈ ఏడాది 8,686 దరఖాస్తులు వచ్చాయి.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఎయుకు 43వ స్థానం

ఎన్ఐఆర్ఎఫ్ - 2023 ర్యాంకింగ్స్‌లో జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాల విభాగంలో విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం 43వ స్థానం సాధించింది. కళాశాలల విభాగంలో ఎయు ఫార్మసీ కళాశాల 22వ స్థానం, ఎయు ఇంజనీరింగ్ కళాశాల 94వ స్థానం పొందాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ఎయు ప్రథమ స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా 2,478 విద్యా సంస్థలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో భాగం కాగా వాటితో ఎయు పోటీపడి ఈ అత్యుత్తమ స్థానం దక్కించుకుంది. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నాక్ చైర్మన్ సహస్రబుద్దే నుంచి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ధ్రువపత్రాలను ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ స్వీకరించారు.

హామీల అమలు ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

పెడుతున్నారు. 41.15 కాంటూరు పరిధిలో కుటుంబాలకే పరిహారం ఇవ్వకపోతే 45.75 కాంటూరు పరిధిలో ఉన్న 84 గ్రామాల్లోని 14,703 కుటుంబాలకు పరిహారం ఎప్పటికిస్తారో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. కేంద్రం మెడలు వంచి పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

పరిహారం పెంపు హామీపై మౌనం

తాము అధికారంలోకి వస్తే ప్రస్తుతం నిర్వాసిత కుటుంబాలకు ఇస్తున్న రూ.6.36 లక్షల పరిహారాన్ని రూ.పది లక్షలకు పెంచుతామంటూ 2019 ఎన్నికలో వైసిపి హామీ ఇచ్చింది. 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.లక్షా 15 వేలు మాత్రమే ఇచ్చారు. ఆ భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షల పరిహారం ఇస్తామని ప్రతిపక్ష నేతగా జగన్ ప్రకటించారు. నాలుగేళ్లు గడిచినా పరిహారం పెంపును అమలుకు నోచుకోలేదు. నిర్వాసితుల కోసం జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లోని నిర్వాసిత కాలనీల్లో నిర్మిస్తోన్న ఇళ్లు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. 18 ఏళ్లు నిండిన యువతకు ఇవ్వాల్సిన పరిహారం విషయంలో ప్రభుత్వం తేల్చడం లేదు. 2017 జూన్ 30 కటాఫ్ తేదీగా నిర్ణయించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడు గ్రామాన్ని ఖాళీ చేస్తారో అది కటాఫ్ తేదీగా నిర్ణయించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

41.15 కాంటూరులో కలిపే గ్రామాలపై ప్రకటనతో సరి

గతేడాది వరదల సమయంలో కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. కాంటూరు లెక్కలు శాస్త్రీయంగా లేవని తేలింది. దీంతో, సిపిఎం, ప్రజాసంఘాల ఆందోళనతో దిగొచ్చిన ప్రభుత్వం కుక్కునూరు మండలంలో పది గ్రామాలను, వేలేరుపాడు మండలంలో ఎనిమిది మొత్తం 18 గ్రామాలను 41.15 కాంటూరు పరిధిలో కలుపుతున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అవార్డు పాస్ చేయడం వంటి ఏ ఒక్క ప్రక్రియా జరగలేదు. దీంతో, ఆయా గ్రామాల నిర్వాసిత కుటుంబాలు తీవ్ర ఆందోళనతో ఉన్నాయి. వరదల సమయం దగ్గర పడుతున్నప్పటికీ నిర్వాసితుల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిర్వాసితుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నేడు పోలవరానికి సిఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించనున్నారు. ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 9:30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి పోలవరం ప్రాజెక్టుకు చేరుకుంటారు. పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు వద్ద వున్న కాన్ఫరెన్స్‌హాల్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం తిరిగి బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

బొమ్మరిల్లు

-బి. రిషిత శ్రీ,
ఇంటర్,
ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

ఫ్యాషన్



ఐదవ తరగతి అమ్మాయిలు,అబ్బాయిలు
ఎంపిపి పాఠశాల, మర్తాడు మెయిన్ ,అనంతపురం.

- బి. కిరణ్మయి,
ఇంటర్,
ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

రాజు గారి హారం

హేమంతపురి రాజ్యానికి విక్రమసింహుడు రాజు. తనకు కాబోయే భార్య కోసం విలువైన వజ్రాలతో కూడిన హారాన్ని తయారుచేయించాడు. దాన్ని ఓ రోజు ప్రదర్శనశాల్లో ఉంచాడు. సాయంత్రానికి హారం కనబడలేదు. సైనికుల చేత రాజ్యం అంతా వెతికించాడు. కానీ, హారం కనబడదు. దీంతో హారాన్ని వెతికి తెచ్చిన వారికి వెయ్యి వరహాలు బహుమతిగా ఇస్తానని రాజ్యమంతా ప్రకటన చేయించాడు.

కిరణ్ అనే యువకుడు మంచినీళ్ల కోసం చెరువు వద్దకు వెళ్లాడు. అందులో ఏదో హారం కనబడుతుంది. రాజు ప్రకటించిన గుర్తులతో హారం ఉండటంతో చెరువులో దిగి దానిని పట్టుకోవడానికి ప్రయత్నించాడు. కానీ చేతికి దొరకలేదు. చెరువు అంతా బురద బురదగా మారిపోయింది. హారం కనిపించలేదు.

కిరణ్ ఏమీ అర్థంకాక చెరువు గట్టుమీద కూర్చున్నాడు. కొంత సమయం తర్వాత బురదగా ఉన్న నీరు తేటగా మారింది. హారం కనిపించింది. మళ్లీ సరస్సులోకి దిగి హారాన్ని పట్టుకోడానికి ప్రయత్నించాడు. ఫలితం లేకపోయింది.

దాంతో కిరణ్ దిగులుగా ఒడ్డున కూర్చున్నాడు. ఇంతలో అటువైపుగా ఒక సాధువు వెళ్తూ ... కిరణ్‌ని చూశాడు. అలా ఎందుకు ఉన్నాడో అడిగి తెలుసుకున్నాడు. మహర్షి కొంత సేపు ఆలోచించి... 'నాయనా, హారం సరస్సులో లేదు. ఒడ్డున ఉన్న చెట్టు కొమ్మపైన ఉంది. దాని ప్రతిబింబం నీకు నీళ్లలో కనిపిస్తుంది.' అన్నాడు. ఆ మాటలకు కిరణ్ ఒక్కసారిగా తల పైకి ఎత్తి చూశాడు. అక్కడ కొమ్మల మధ్య హారం కనిపించింది. కిరణ్ ఆనందంతో చెట్టు ఎక్కి హారం తీసుకున్నాడు. కిందకు దిగాక సాధువుకి కృతజ్ఞతలు తెలిపాడు. అప్పుడు మహర్షి 'ఎంతసేపూ ఆత్రుతగా నీళ్లలో హారం కోసం వెతకాడనికి కష్టపడ్డావు గానీ కొంచెం మెదడుకు పని చెప్పలేదు. కొద్దిగా ఆలోచించి ఉంటే హారం ఎక్కడ ఉందో కనిపించేది. సరే ఈ హారం తీసుకెళ్లి రాజుగారికి ఇచ్చి బహుమతి అందుకో. మంచిగా జీవించు' అని దీవించి వెళ్లిపోయాడు సాధువు.



- బి. ఉదయిని,
7వ తరగతి,
నారాయణ స్కూలు,
ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA జీవన the family

ఒరిస్సా బాలాసోర్ రైలు ప్రమాదం మృత్యుఘంటిక మోగించిన వేళ.. మానవత్వ హృదయాలెన్నో ఆపన్నహస్తాలు అందించాయి. భీతావహ వాతావరణంలోనే ఒక కంట తడిపెడుతూ.. మరో కంట బాధితులను రక్షించాలని పరితపించాయి. వందలాది మంది ప్రాణాలను రక్షించడంలో.. సకాలంలో ఆస్పత్రులకు చేరవేయడంలో వారు చేసిన కృషి అభినందనీయం. మానవత్వం పరిమళించిన మంచి జాడలు ఇవిగో ...

ఆపద వేళ.. అభయ హస్తాలు ...

జూన్ 2. శుక్రవారం సాయంత్రం 6 గంటల 40 నిమిషాలు, పూలామణి హెంబ్రం వంటగదిలో పనిచేసుకుంటోంది. అప్పుడు ఉన్నట్లుండి తన ఇంటి పక్కనే ఉన్న రైలు పట్టాల మీద నుండి భీకర శబ్దం వినిపించింది. ఆ శబ్దం ఆమె ఉన్న చోటుకు సరిగ్గా 200 మీటర్ల దూరం నుంచి వచ్చింది. జరిగిన ప్రమాదాన్ని ఊహించిన పూలామణి చేస్తున్న పనిని పక్కనపెట్టేసి అటువైపు పరుగు తీసింది. భర్త రఘు ఆమెను అనుసరించాడు. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. చీకటి ఆవరించింది. అయినా ఆ భార్యాభర్త వెనుకడుగు వేయలేదు.

'నా జీవితంలో మొదటిసారి నేను అన్ని మృతదేహాలు చూశాను. చాలా భయమేసింది. రక్తపు మడుగులో ఎంతోమంది విగతజీవులుగా మారిపోయారు. గుండె దిటవు చేసుకుని వారందరినీ దాటుకుని ముందుకు ఉరికాను. నేను అక్కడికి చేరేసరికి ఓ చిన్న పాప రైలు కిటికీలకు వ్రేలాడుతూ కనిపించింది. కాళ్లూచేతులకు గాయాలై రక్తం కారుతోంది. ఆ పాప అమ్మ కూడా అక్కడే గాయాలతో పడి ఉంది. లేవలేని స్థితిలో బిడ్డను రక్షించుకోలేక ఆ తల్లి గట్టిగా అరుస్తూ ఉంది. మేము అక్కడికి వెళ్లి ఆ పాపను, తల్లిని మా ఇంటికి తీసుకువచ్చాం. మంచినీళ్లు తాగించి డాక్టరును పిలిచాం. తల్లీబిడ్డను అక్కడే వదిలేసి మళ్లీ రైల్వే ట్రాకు వైపు వెళ్లాను' అంటూ ఆనాటి భయంకర దృశ్యాన్ని వర్ణిస్తున్న పూలామణి 30 ఏళ్ల గిరిజన మహిళ. ఆ రోజు అలా అరడజను మందికి పైగా చిన్నారులను ఆమె రక్షించింది.

హెంబ్రం దంపతులిద్దరూ ఈసారి ట్రాకుపై క్షతగ్రాతులుగా పడి ఉన్న 30 మందిని హాస్పటల్‌కు చేరేందుకు వాహనాలు సమకూర్చారు. అలా బాలాసోర్ రైలు ప్రమాద వార్త అందిన క్షణాల వ్యవధిలో రెస్క్యూ బృందాలు ప్రమాదస్థలిని సమీపించేలోపు కృష్ణపూర్, కమరిపూర్ గ్రామాల నుంచి 58 మంది గిరిజనులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. 200 మంది బాధితులను రక్షించారు. బోగీల మధ్య చిక్కుకుపోయిన మృతదేహాలను కిందకు దించారు.

'నేను బోగీల దగ్గరకు చేరేసరికి ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలతో హోరెత్తిపోతోంది. గుట్టలు గుట్టలుగా మృతదేహాలు పడివున్నాయి. ఇంకా బోగీల్లో చిక్కుకుని వ్రేలాడుతూ చాలామంది ఉన్నారు. కాళ్లూ చేతులు తెగిపడి మొండెం మాత్రమే ఉన్న ఎన్నో మృతదేహాలను బోగీలపైకెక్కి మరీ కిందికి దించాను. ఆ దృశ్యాలు ఇప్పటికీ నా కళ్ల నుండి చెదరలేదు. ఇంత ప్రమాదాన్ని చూసిన మేమంతా ఎంత భయపడ్డామో.. మాటల్లో చెప్పలేం. ఆ బోగీల్లో ఏదైనా మా ప్రాంతంపై పడి వుంటే మేమంతా ఇప్పుడు ఇలా ఉండేవాళ్లం కాదు..' అంటూ తన అనుభవాన్ని చెబుతున్నాడు మరో గిరిజన యువకుడు మహేశ్వర కిస్కు.

పూర్ణచంద్ర ఓ రైతు. ఆ రోజు సాయంత్రం మార్కెట్లో పనులు ముగించుకుని తన స్నేహితులతో కలిసి ఇంటికి వెళుతున్నాడు. రైల్వే ట్రాక్ సమీపంలోకి వచ్చేసరికి ఈ ప్రమాదం జరిగింది. 'పెద్ద శబ్దం చేసుకుంటూ రైలు బోగీలు పక్కకు ఒరిగిపోవడం మా కళ్ల ముందే కనిపించింది. ఒక్క క్షణం ఏం జరుగుతుందో అర్థం కాలేదు. అయినా వెంటనే తేరుకుని అటువైపు పరుగెత్తాం. మేము అక్కడకు వెళ్లే సరికి దట్టమైన పొగ కమ్మేసింది. ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోతోంది. రక్తం మడుగులో శవాలు తేలుతున్నాయి. కాళ్లు, చేతులు విరిగిపడి బాధతో విలవిల్లాడుతున్నవారు ఎంతోమంది కనిపించారు. వారిని రక్షించే క్రమంలో నా బట్టలు కూడా రక్తంతో తడిశాయి' అంటూ చెబుతున్న మాలిక్ సరైన సమయంలో అక్కడకు చేరుకుని బోగీల నుంచి 30 మంది ప్రయాణికులను రక్షించారు.

'ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకున్న నేను ఓ నిచ్చెన సాయంతో బోగీలపైకి చేరుకుని ప్రయాణికులను రక్షించాను. క్షణం ఆలస్యం చేసినా ప్రమాద తీవ్రత ఇంకా తీవ్రంగా ఉండేది' అంటూ తన అనుభవాన్ని పంచుకున్న దినసరి కూలీ సుదర్శన్ దాస్ రెస్క్యూ బృందాలు ఆ ప్రాంతాన్ని చేరుకునేసరికి పదుల సంఖ్యలో ప్రయాణికులను రక్షించాడు.

'ప్రమాదం జరిగిన మొదటి అరగంట లోపు ఎంతమందిని వీలైతే అంతమందిని రక్షించాలని అక్కడికి చేరుకున్నాను. అయితే బోగీల నుంచి అలా తీసుకొచ్చే క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అలా నా చేతుల్లో ఓ పెద్దాయన, ఓ బిడ్డ చనిపోయారు. ఆ క్షణం నేను మొద్దుబారిపోయాను. వాళ్లు మంచినీళ్లు అడిగారు. వాళ్లను ఎలాగైనా రక్షించాలన్న తాపత్రయంలో వాళ్లకు నీళ్లు కూడా పట్టించలేకపోయాను. అది తలచుకుంటే ఇప్పటికీ బాధేస్తుంది' అంటూ కంటతడి పెట్టుకున్నాడు రంజన్ ముర్ము.

రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించే గణేష్ ప్రసాద్ నాయక్ కళ్లెదుటే ఈ ప్రమాదం జరిగింది. సాయంత్రం ప్రార్థన ముగించుకుని ఇంటకి వెళుతున్న అతడు ఈ ప్రమాద దృశ్యాన్ని చూశాడు. ప్రయాణికులను రక్షించేందుకు అటువైపుగా పరుగుతీశాడు. 'నా మిత్రులకు ఫోను చేసి వెంటనే రమ్మని చెప్పాను. మేమంతా కలిసి 71 మృతదేహాలను వెలికితీశాం. ఒక్క మహిళనే రక్షించగలిగాం. బయటికి తీసుకువచ్చిన దగ్గర నుంచి ఆమె తన 18 ఏళ్ల కొడుకు గురించి ఆరా తీస్తూనే ఉంది. ఆ తల్లి బాధ చూడలేక సెల్‌ఫోను లైటు వేసుకుని నేను మళ్లీ ఆ బోగీ దగ్గరకు చేరుకున్నాను. అక్కడ ఆమె కొడుకు విగతజీవిగా పడిఉన్నాడు. ఆ సంగతి ఆమెకు చెప్పలేక అక్కడ నుంచి మౌనంగా నిష్క్రమించాను. అటువైపుగా వస్తున్న ఓ వ్యక్తిని ఆమె తన కొడుకును వెతికిపెట్టమని దీనంగా వేడుకోవడం నాకు కనపడుతూనే ఉంది. ఆ క్షణం నాకు దు:ఖం కట్టలు తెంచుకుంది' అంటూ ఇప్పుడు చెబుతున్నా ఆ ఇన్‌స్పెక్టర్ కళ్లవెంట నీళ్లు కారుతున్నాయి.

ఆ రోజు నుంచి ఇప్పటి వరకు ప్రమాదంలో బయటపడిన వారిని రక్షించేందుకు స్థానికులు పెద్ద ఎత్తున కదిలి వస్తున్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కో విషాద అనుభవం. రక్తదానం చేసేందుకు అక్కడికి గుంపులుగా చేరుకుంటున్న వారంతా స్వచ్ఛందంగా ముందుకువచ్చినవారే.

'బాధితులెవరో మాకు తెలియదు. కాని వారు ఆపదలో ఉన్నారు. వాళ్లను రక్షించడంలో మా వంతుగా ఏదైనా చేయాలనుకున్నాం. అందుకే బాలాసోర్ జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేసేందుకు 25 మంది బృందంగా చేరుకున్నాం' అంటున్నాడు భద్రక్ ప్రాంత వాసి. అలా ఆ ఆస్పత్రిలో స్థానికులు ఇచ్చిన రక్తదానంతో 500 యూనిట్ల రక్తం బాధితులకు అందించారు. 900 యూనిట్ల రక్తం స్టాక్‌లో ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన వీరంతా బాధితులను ఎప్పుడూ కలుసుకోలేదు.. భవిష్యత్తులో కలుస్తారనీ లేదు.. కానీ ఆపదలో ఆదరించాలన్న లక్ష్యమే వారందరినీ ఇంత పెద్ద విపత్తులో ముందుకు నడిపించింది. మానవత్వం ముందు కులం, మతం ఎప్పుడూ దిగదుడుపే..! ఆపదల వేళ మనుషులు సహజంగా మానవత్వంతోనే స్పందిస్తారు. అది ఎల్లప్పుడూ సాగాల్సిన మానవీయ గుణం.

వారం రోజుల్లో షూటింగ్ షురూ

హీరో అజిత్‌కుమార్ నటిస్తోన్న తాజా చిత్రం 'విదా ముయర్చి'. మగిజ్ తిరుమేని దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా అప్‌డేట్ గురించి మేకర్స్ తెలిపారు. మరి వారం రోజుల్లో పూణేలో షూటింగ్ ప్రారంభించబోతున్నారు. అక్టోబర్ కల్లా షూటింగ్ పూర్తి చేసి 2024లో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. లైకా ప్రొడక్షన్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించబోతుంది.

పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో 'మావీరన్'

హీరో శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం ' మావీరన్'. తెలుగులో మహావీరుడు టైటిల్‌తో వస్తోన్న ఈ చిత్రానికి మడొన్నే అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్‌లో దర్శకుడు శంకర్ కూతురు అదితి శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఫుల్ బిజీగా ఉన్నట్లు మేకర్స్ ప్రకటించారు. జులై 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాలో కమెడియన్ సునీల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి భరత్ శంకర్ సంగీతం అందిస్తున్నాడు.

ఈ సినిమా నన్ను ఏడిపించింది

అనురాగ్ కశ్యప్ తెరకెక్కించిన 'కెన్నెడీ' చిత్రంపై ప్రముఖ చిత్ర నిర్మాత శేఖర్ కపూర్ ప్రశంసలు కురిపించారు. తాజాగా ముంబైలో ఈ సినిమా ప్రత్యేక ప్రదర్శనను నిర్వహించారు. పలువురు నిర్మాతలు, నటీనటులు ఈ చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శేఖర్.. 'నన్ను ఆకర్షించని అనురాగ్ సినిమాని నేను ఎప్పుడూ చూడలేదు. కానీ, ఇది నన్ను ఏడిపించింది. చాలా ఆశ్చర్యపరిచింది. ఒత్తిడికి గురి చేసింది. సినిమాని నిజంగా ఆస్వాదించాను. ఎంజాయ్ అనే పదం కొన్ని చిత్రాలకు ఉపయోగించడం చాలా కష్టమైనది. ఇది మనోహరమైన చిత్రం' అంటూ మూవీ యూనిట్ మొత్తాన్ని ప్రశంసించారు.

సెప్టెంబరు 15న 'టిల్లు స్క్వేర్'

సిద్ధు జొన్నలగడ్డ కథా నాయకుడిగా 'టిల్లు స్క్వేర్' అనే చిత్రం రాబోతుందని తెలిసిందే. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. 2023, సెప్టెంబర్ 15న ఈ సినిమాని విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ ఓ పోస్టర్ విడుదల చేసింది. ఈ చిత్రానికి రామ్ మిరియాల, శ్రీ చరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

ఆదిపురుష్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ...

ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్'. ఈ గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జూన్ 6న తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ స్టేడియంలో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన జీయర్ స్వామి హాజరు కానున్నారని మేకర్స్ ప్రకటించారు. ఈవెంట్‌కు ఇంకా చాలా మంది ప్రముఖులను ఆహ్వానించాలని భావిస్తున్నారు. సైఫ్ అలీ ఖాన్ విలన్‌గా నటించిన ఈ చిత్రానికి ఓం రౌత్ దర్శకత్వం వహించారు. కృతి సనన్ కథానాయికగా నటిస్తోంది. టీ సిరీస్ మరియు రెట్రో ఫైల్స్ బ్యానర్‌లచే నిర్మించబడిన ఈ పాన్ ఇండియన్ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది.

'కంగువ' తాజా షెడ్యూల్



సూర్య ప్రస్తుతం నటిస్తున్న సినిమా 'కంగువ'. శివ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పీరియాడిక్ వార్ యాక్షన్ డ్రామాగా రానుంది. పది భాషల్లో, 2డి-3డి వెర్షన్స్‌లో, ఐమాక్స్ ఫార్మాట్‌లో రిలీజ్ కానుంది. 2024 వేసవిలో రిలీజ్ కానున్న ఈ మూవీ టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ఇటీవలే బయటికి వచ్చాయి. తాజాగా కంగువ లేటెస్ట్ షెడ్యూల్ జూన్ 20న ఇవిపి ఫిల్మ్ సిటీలో జరగనుందని సమాచారం. ఎనిమిది రోజుల పాటు జరగనున్న ఈ షెడ్యూల్‌లో ఒక భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని షూట్ చెయ్యనున్నారు.

ఈసారైనా కలిసొచ్చేనా..

రేపటినుంచి భారత్×ఆస్ట్రేలియా డబ్ల్యుటిసి ఫైనల్

లండన్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) నాలుగేళ్ల క్రితం అట్టహాసంగా ప్రవేశపెట్టిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి భారత జట్టు ప్రవేశించి రన్నరప్‌గా నిలిచింది. ఆ సీజన్‌లో భారతజట్టు ఫైనల్‌కు చేరినా న్యూజిలాండ్ చేతిలో 8వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఇంగ్లండ్‌లోని లండన్ వేదికగా జరిగిన ఫైనల్లో భారతజట్టు మూడున్నర రోజుల్లోనే ఓడింది. దీంతో ఐసిసి టెస్ట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని న్యూజిలాండ్ ఎగరేసుకుపోయింది. ఆ సీజన్ భారతజట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువగా.. న్యూజిలాండ్ జట్టు రెండోస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాయి.

ఈ ఏడాది డబ్ల్యుటిసి ఫైనల్‌కు లండన్‌లోని ఓవల్ మైదానంలో జరగనుంది. జూన్ 7 నుంచి భారత్-ఆస్ట్రేలియా జట్లు ఫైనల్లో తలపడనున్నాయి. 2022-23 సీజన్‌కు జరిగిన టెస్ట్ సిరీస్‌లలో భారత్ 2వ స్థానంలో నిలిచి వరుసగా రెండోసారి డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరి రికార్డు నెలకొల్పింది. ఇక ఆస్ట్రేలియా జట్టు 66.67పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. భారతజట్టు 58.8పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

ముగ్గురు పేసర్లు.. ఇద్దరు స్పిన్నర్లతో..

ఇంగ్లండ్ పిచ్‌లు పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. దీంతో భారత్ ముగ్గురు ప్రధాన పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముంది. ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్‌తోపాటు మరో ఆల్‌రౌండర్ జట్టులో ఉండనున్నారు. భారత్ ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగుతుందని.. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలను తుది జట్టులోకి తీసుకుంటుందని బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు.

క్వార్టర్స్‌కు రూడ్

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి 4వ సీడ్ కాస్పెర్ రూడ్ ప్రవేశించాడు. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో నార్వేకు చెందిన రూడ్ 7-6(7-3), 7-5, 7-5తో నికోలస్ జర్రీ(చిలీ)పై వరుససెట్లలో నెగ్గాడు. తొలి సెట్‌ను టై బ్రేక్‌లో చేజిక్కించుకున్న రూడ్.. రెండు, మూడు సెట్‌లు గెలిచేందుకు పోరాడాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ సుమారు 3గంటల 20నిమిషాలసేపు సాగించింది.

ఇక మహిళల సింగిల్ క్వార్టర్‌ఫైనల్లోకి ట్యునీషియాకు చెందిన 7వ సీడ్ ఓన్స్ జబీర్ ప్రవేశించింది. ప్రి క్వార్టర్స్‌లో జబీర్ 6-3, 6-1తో పెరా(అమెరికా)పై సునాయాసంగా గెలిచింది. మరో పోటీలో 14వ సీడ్, దక్షిణాఫ్రికాకు చెందిన హడ్డాడ్ మలా ప్రవేశించింది. ప్రి క్వార్టర్స్‌లో మలా 6-7(3-7), 6-3, 7-5తో సొమిబెస్ టొర్మో(స్పెయిన్)పై పోరాడి నెగ్గింది.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2023
ఎంట్రీలకు ఆహ్వానం

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు కావస్తున్నది. కోవిడ్ మహమ్మారి కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2023 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావులతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం **ఏదేని ప్రజా సమస్యపై రాసిన క్షేత్ర స్థాయి వార్తా కథనాలను, ఫీచర్స్‌ను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2022 మే 1నుంచి 2023 ఏప్రిల్ 30లోపు తెలుగు దిన పత్రికల్లో, స్పెషల్స్‌లో ప్రచురితమైన వార్తా కథనాలు, ఫీచర్స్ మాత్రమే పంపాలి.** ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం ఒకటి జతచేసి పంపాలి. తమకు నచ్చిన మంచి సమస్యాత్మక కథనాన్ని ఇతరులైనా పంపవచ్చు. అచ్చయిన తేదీ, ఎడిషన్ వివరాలు జత చేయాలి. ఒక్కొక్కరు ఒకటి లేదా రెండు వార్తాకథనాలను మాత్రమే పంపాలి. ఎంట్రీలు 2023 జూన్ 10 కల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2023 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2023 జూన్ మూడవ వారంలో పుట్టపర్తిలో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎం వి ఎస్ శర్మ, కార్యదర్శి,
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా : కార్యదర్శి , ప్రజాశక్తి సాహితీ సంస్థ, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా, పిన్: 522501. ఇ-మెయిల్ అడ్రస్: psmhaward@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68